జగన్నాథం, యల్లాపంతుల

మదనసాయకము

ఏలూరు, 1919

Record no. 710

Jagannādhaṃ, Yallāpantula

Madanasāyakamu

Ēlūru, 1919

Record no. 710

SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

జగన్నాధం, యల్లాపంతుల.

మదనసాయకము.- ఏలూరు : మంజువాణీ ముద్రాలయము, 1919.

vi, (2), 133 p. :port. ;17 cm.

Record no. 710

Jagannādhaṃ, Yallāpantula.

Madanasāyakamu. - Ēlūru : Mañjuvāṇī Mudrālayamu, 1919.

vi, (2), 133 p. :port. ;17 cm.

Record no. 710

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began:

MADANA SAYAKAMU

[THE DART OF LOVE]

AN ARTISTIC & ROMANTIC PLAY FOR THE STAGE.


(Prescribed by the University of Madras as a detailed Text for the Intermediate Examination, 1922.)

"Love surfeits not; lust like a glutton dies;
Love is all truth; lust full of forged lies."

—*SHAKESPEARE.*

Y. JAGANNATHAM, B.A.

Price As. 8.]



యల్లాపంతుల జగన్నాథం, బి. ఏ.,

(BY ONE WHO ACTED)

It is with great delight that I read this drama written by my friend, Mr. Yellapantula Jagannatham and with greater interest, I played *Satrjit* when it was enacted once in this town. The name *Madana Sayakam* by which the play is known, is indeed very charming, especially as it is lent by the heroine, *Madanasayaka.* The reader finds in the play all the good qualities of the heroine. Both are attractive, naturally beautiful and bereft of artificial embellishments. The author has intended the drama for mature minds who only can appreciate the delicacy of feeling, purity of expression and brilliancy of imagination which it contains.

The plot is ingeniously woven; the incidents are dexterously arranged and connected and the dramatic situations are clearly conceived and vividly described. The story of *Rtadhwaja,* given in *Markandeya Purana,* is the earliest version in our Telugu Literature and on this, are based the other versions in the several Prabandhams yet published. Every one of them abounds in tedious descriptions and divides the story into two main parts. The first part closes with the marriage of *Rtadhwaja* and *Madalasa* (Madanasayaka of this play) and the death and revival of Madalasa comes as a sequel. The author of Madanasayakam has very well succeeded in adapting the story to dramatic composition. The two parts in the original are harmoniousy combined and the unity of action is main-

tained. One scene naturally leads to the next and yet it is not mere narration of events in their chronological order that we find in the successive scenes. The dramatic situations are all well chosen.

The First act is one of "Endeavours" *Tumbura* endeavours to bring back *Madanasayaka*; *Galava* to destroy the wicked Rakshasas, and *Rtadhwaja* like a knight-errant to pursue and kill *Talaketu.*

The Second Act is one of "Hope." *Rtadhwaja* did not kill *Talaketu* for the sake of *Madanasayaka* but she secured her freedom by the death of *Talaketu*. We therefore, share the delight of *Aswastha, Tumbura* and *Galava* as well as their hope that *Rtadhwaja* & *Madanasayaka* may be man and wife. *Rtadhwaja* amply deserves the reward.

The Third Act is one of "Love". The Love scene deserves special notice. It is, indeed, a piece of perfection. This alone is enough to show that the author is one of good taste. The intensity of love is not marred by obscenity in thought, language or action. The development of the scene well justfies the motto which the author has published in the beginning showing the contrast between love and lust. The charming talk of the youths certainly reminds the reader of that of Jessica and Lorenzo in the Merchant of Venice. The author has, no doubt, borrowed some of the ideas from Shakespeare; but like an experienced gardner, successfully grafted them on the native plant.

The Fourth Act is the play of "Nemesis." *Turyaketu* avenged the death of his brother. *Durga* was angry that she had been neglected by *Satrjit*. She did not actually employ *Turyaketu* in the work of retribution but announced to *Aswastha* that she desired that the calamities brought about by the revengeful *Turyaketu* should happen. The last scene of the Fourth Act also deserves special notice. There is much of psychological interest. The various phases of feeling, the extreme pain and pleasure to which *Satrjit* was alternately subject, are all well depicted. From my own experience, I find that the actor who plays the part of *Satrjit* finds ample scope for action.

The Fifth Act is one of "Agreeable surprises." The revival of Madanasayaka remains *Crux criticorum*; but the readers associating themselves with the characters of the play, exclaim with a sigh of relief, "All is well that ends well" without questioning the *raison d'etre*.

The author has skilfully concealed the Supernatural element. The importance of the miraculous horse (*Kuvalayaswa*) the gift of *Galava*, is obscured by the valour displayed by the hero *Satrjit* does not seem to know anything about the horse. Like *Prospero* in the Tempest, *Aswastha* managed everything is such a marvellous manner that nothing seemed absurd when the desired object was achieved.

The individuality of character is consistently maintained. The royal dignity and the judicious temper of the Emperor *Satrjit*, the chivalry and devotedness to the call of duty of the hero *Rt-adhwaja*; the modesty, innocence and genuine love of the heroine *Madanasayaka*; the constancy and the endeavour to help comrades in distress of *Aswastha* and his devoted son; the desire to root out evil and to maintain the *Varnasramadharma* of *Galuva* are all well delineated. The author has not failed to bring out the subtle contrast of characters: Of the maids, one is playful and the other is earnest and sympathetic. They remind the reader of a similar contrast between the *Anasuya* & *Priyamvada* of *Kalidasa's Sakuntala*.

I heartily thank the author for having accepted the few suggestions I have made–especially those that go to improve the flow of his verses. With his permision, I give below a few examples to illustrate the point. The unhappy distribution of accents hinders the flow of the following lines.

1. * * * * * శల్యపంజ
రములు నల్లలు గుళ్లు నె * అచులు దోఁచు
2. ముజ్జగంబుల నొక్క ని * ముసములోనఁ
3. తనయు మునిహంతలైన న * క్తంచరులను
4. వేదపారము జరి * పింతురు నిజశిష్య
వర్గమ్ముచే యతి * వర్యులిచట
సామగానమొనర్చ ని * చ్చట మృగమ్ము
లేర్చివటువుల బ్రోలఁ గు * ప్పించునౌర!
5. ఏతెంచెబోతన * కెదిరిఁగానక కావ

రమ్మున నన్నుఁ జే * యఁగానవలెనె?
ఔర! విధిచెయ్దములు దురూ * హమ్ములుగద!
6. సకలభువనమోద * సంధాయకమ్మని
పేర్గన్నగాంధర్వ * విద్యయేమొ
7. జంపెనని మదియెంతయు * సంబరపడు
కార్యమగుటయు నాతఁడిం * క మరలిచను
8. నీవయితుని కూర్మి * నెచ్చెలి నాతన
యుఁడు వీఁడె సఖునట్లె * యున్నవాఁడు

These are improved in the following Manner.

1. * * * * * శల్యపంజ
రములు నల్లలు గుళ్లు మాం * సములుదోఁచు (పుటలు 10-11)
2. ముజ్జగంబుల కనుమోడ్పు * ప్రొద్దులోన (పుట 11)
3. తనయు మునిహంతలగు పలా * శనుల నొకట (పుట 12)
4. వేదపాఠమ్ము నే * ర్పింతురంతేవాసి
వర్గమ్ముచే మౌని * వర్యులిచట
సామగానమ్ము నెడలేక * సలుపునిచట
ఇచట వటువులతో నాడు * మృగములౌర! (పుట 20)
5. ఏతెంచెఁబోతన * కెదిరిఁగన్గొనక కా
వరముపైననుఁ జేఱ * పట్టవలెనె?
ఔర! విధిచెయ్వి కడుదురూ * హమ్ముగాదె? (పుట 26)
6. సకలలోకామోద * సంధాయినియఁటంచు
పేర్గన్నగాంధర్వ * విద్యయేమొ? (పుట 30)
7. జంపెనని మదియెంతయు * సంబ్రమొందు
మఱియుఁ బనితీఱెనని తాను * మరలిపోవు (పుట 43)
8. నీమనోహరుకూర్మి * నేస్తంబునాపట్టి
యునువీఁడె సఖునట్లె * యున్నవాఁడు (పుట 127)

I desire to invite the attention of the readers to some verses that contain very good ideas–quite

new to the Telugu Literature. Some of them are the author's own; others are borrowed from Shakespeare and other master minds of English Literature.

1. తరుణి! పెడఁబాయఁబోకుము * ధైర్యనాక etc. (పుట 27)
2. తన కనుంగవ నీరు సం * ద్రమ్ముగాఁగ etc. (పుట 45)
3. హాసమును బోలనైతిగా * యనుచుబిట్టు etc (పుట 50)
4. (గేయము) అహాహా! వన కామిని etc. (పుట 67)
5. రాజనందన మరణవా * ర్తాశతఘ్ని etc. (పుట 93)
6. హాసతీయుంచు నవని సా * ష్టాంగమెఱగి etc. (పుట 115)

The language in general is harmonious but the naturalness of expression is concealed by the artificial literary language. The vitiation of taste still prevalent amongst a large class of pedants sufficiently explains the author's use of the few obsolete and out of the way expressions.

In my opinion this drama deserves a very good place in the field of vernacular literature. Unlike most of the dramas which infest the man of taste though they may appeal to the vulgar mob audience this is a good piece of Telugu Literature deserving a careful study besides satisfying the demands of the modern elegant stage.

Gidugu Venkata Sitapati B. A. L. T.
Lecturer in History,
Rajah's College,
Parlakimedi.

Preface.

The able pen of my beloved friend has exhausted not only what he desired to say of my play as an impartial critic and an actor, but also what I proposed to say in a preface to the book as the author thereof. Still I attempt a few lines though they may prove repetitions from my friend's review. A play that would meet all the requirements of the modern stage and at the same time afford real enlightenment to the student of literature, had been the object of my fancy for a long time and I think I have realised that in my *Madanasayakam.* I also desired that my play should be as artistic as possible and I thought I would have the best facility for the show of art if I should take an oldest puranic story and develop it on the most modern principles of dramaturgy. I have done it, and how far I have succeeded is left for the reader to judge. As for the style and language adopted, I make a clean confession that I am not the master of myself and I am quite conscious that my position is as unenviable as the bat of the story, neither the Old nor the New school claiming me. But I have this consolation that I sail in the same ship with a very large number of bats of my stamp who are daily and really contributing to the growth of our Andhra Literature. Until and unless a master mind is born who can set a model in adapting modern Telugu to dramatic composition, I find it very difficult to give up all the regard I have for traditional models and literary style.

Let us hope for better times!

Parlakimedi } The Author
24th May 1919 }

ఈనాటకమున వచ్చెడి పాత్రములు.

పురుషులు.

శత్రుజిత్తు—అధీశ్వరుఁడు.
ఋతధ్వజుఁడు—యువరాజు. కథానాయకుఁడు.
అశ్వస్థుఁడు—ఒక నాగరాజు.
విశోకుఁడు—అశ్వస్థుని కుమారుఁడు.
గాలవుఁడు—ఒక మహర్షి.
తుంబురుఁడు—గంధర్వగురువు.
విశ్వావసుఁడు—మదనసాయక తండ్రియగు నొక గంధర్వుఁడు.
తాళకేతుఁడు—రాక్షసరాజు.
తూర్యకేతుఁడు—తాళకేతుని తమ్ముఁడు.

స్త్రీలు.

మదనసాయక—విశ్వావసుని కొమార్తె. కథానాయిక.
కుముద్వతి—మదనసాయక తల్లి.
కుండల—మదనసాయక ధాత్రేయి.

మఱియు, మంత్రి, సభ్యులు, రాజపరివారము, ప్రతీహారులు, మునికుమారులు, వృద్ధకంచుకి, ఆశ్వికుఁడు, చెలికత్తెలు, చేటి.

శ్రీరస్తు.

మదనసాయకము.

(నాంది.)

ఉ. "ఏమెయిదీవె యందొదవు * నిందిర ! చిందము చంద్రచాపముల్
తామరదోయి చక్రకుము * దమ్ములు ?" నాఁ దలవంచి నేర్పుమై
"నీమెయిదీవె" యంచు హావ * ణించినవ్రీడ నిజేశుఁగాంచు నా
కామునిఁ గన్నతల్లికడ * గన్నుల చూడ్కులు మిమ్ము నోముతన్.

[నాంద్యంతమున.]

సూత్రధారుఁడు—[ప్రవేశించి] అవునవును. లోకజనని యెవరికిం సేవ్యురాలుకాదు? వెండియు, ఈదినములలో ఆసౌభాగ్యదాయినిని గొలువని సీమంతిని యుండునా? ఇప్పుడు ఏవరవర్ణిని మోముఁజూచినను లక్ష్మి యచటనే తాండవమాడుచుండును. ఏనివాసము గనినను శోకరహితమై, "నిత్యకళ్యాణము పచ్చతోరణ"మై కనుపట్టును. "వరలక్ష్మి" అవతరణమేకదా యిందులకుఁగారణము? మఱి

యు నాసతికి నేఁడు తీరుబడియేలేదు. [ఆకర్ణించుట నభి నయించి] పేరంటాండ్ర మంగళగీతములు ఇంకను వినవచ్చుచునేయున్నవి. కాని ఆమెసపర్య యిప్పటికిఁ బూర్తియైయుండును. కావున నిఁక నామెనిచటికి రావించెదను గాక. [అని తెరవంకఁగని]

క. రూపెత్తిన సౌభాగ్యమ!
నీపూజన మయ్యెనేని * నీతోడుత సం
ల్లాపింపఁగార్యమొదవెడు;
నాపని వినిచెద బిరాన * నరుదేరఁగదే.

నటి—[ప్రవేశించి] ఆర్యపుత్రా! వచ్చితిని. ఏమియాజ్ఞ?

సూత్ర—[సాకూతముగా] నటీ! వింటివా? ఇప్పుడీ సరసులకు "మదనసాయక" ప్రయోగమే విహితమఁట?

నటి—[సాకూతముగా] ఆర్యపుత్రా! అదియెట్లు? ఇది వాన కారు గదా?

సూత్ర—[దరహాసముతో] అయిననేమి? కామజనకసీమంతిని ప్రతిగృహమ్మున నెలకొనియుండ ఈదినములు మాత్రము క్రీడాయోగ్యములు కావా? ప్రేయసీ! ఎట్లయినను సభ్యుల యిష్టమే యిప్పుడు జరుగవలయు.

నటి—అటులే కానిమ్ము. కాని యీరూపకము మనకు అతినవీనము కాదా?

సూత్ర—సుందరీ? ఈసందేహమే నన్నును వేధించుచున్నది.

సీ. ఇతివృత్తమాత్రాంత * దేకాని రచనావి
ధానమ్ముఁజూడనం * తయును క్రొత్త
గద్యపద్యములల్లఁ * గానేర్చుఁగాని యు
ద్గ్రంథనిర్మితికి నీ * కవియుఁ గ్రొత్త
ఇతర నాటకములా * డితి మెన్నియోకాని
మనకు నీనాటక * మ్మనఁగఁ గ్రొత్త
కరుణాద్భుతములు ము * ఖ్యరసమ్ము లొనరింపఁ
బూనుట నాటక * మ్ములకె క్రొత్త
ఇంక నెటులుండునో మన * మిప్పుడాడఁ
బోవు నీరూపకమ్ము పూఁ * బోఁడి! అయిన
నేను జంకను జామి; భవా * నికటాక్ష
మొలయు మనయెడ; భంగపా * టావ దెపుడు.

నటి—సత్యము సత్యము. అయిన నిఁక జాగేల? ఆర్యపుత్రా!

సూత్ర—అవును. కర్తవ్యమిఁక నడపుదము. కాని ప్రాణేశ్వరీ! ఇప్పుడు ఏఋతువును బాడి యీసదస్యుల మనములు రంజింపఁజేయుదువు?

నటి—ఆనతియైనచో, "అప్రస్తుతప్రశంస" కుఁబోక ఏతదృతువర్ణనమే కావించెద.

సూత్ర—'వాన కా' రనియంటివే? ఏదీ చూతము?

నటి—[నాట్యమొనర్చుచు గానముసేయును]

(గేయము)

మలచఁజేయన్ బురి వీడఁగ నాహా! మయూర మాడు నదే

కనునాథా! నాథా! మయూర మాడు నదే

శరమేదన్ [2] శరమేది మరుండు ధరించె మొగలిసురియన్

కనువింపై [2] హరివిలు దోఁచెడు నదిగోనదిగో కనురమణా!

మొగుల డాఁగి పద్మిని కినుఁ డగడు సల్పు నవురా!

వగరొ కుముద్వతికి రజనికరుఁడు గూర్చు నయయో!

విను నాథా! నాథా!

సూత్ర—ఏమేమి? ఏమనుచున్నావు?

నటి—

"కలచెన్ గుముద్వతిన్, రజనీకరుండయో!"

సూత్ర—[హర్షసూచకముగా] భళిభళి సాధ్వీ! నీనోఁట నమృతమొలికినది. వానతటికి నీవెంత యింపుదెచ్చితివే? కాని,

గీ. పద్మిని కినుండు నలకుము * ద్వతికి రజని
కరుఁడు వెతఁగూర్చు నెన్నఁడు * కనము వినము;
వెత గుముద్వతి కిపుడు గా * వించు నతఁడు
రజనికరుఁడటె? సఖి! కాఁడు; * రజనిచరుఁడు.

మనమింకఁ బోవుదమా?

నటి—మహాప్రసాదము.

[ఇరువురు నిష్క్రమింతురు.

మదనసాయకము

ప్రథమాంకము.

స్థలము—గంధర్వపురి.

రంగము—విశ్వావసుని మందిరము.

[విశ్వావసుఁడును, కుముద్వతియుఁ బ్రవేశింతురు.]

కుము—[విచారముతో] అమ్మోయమ్మాయీ! మమ్మెంత యదృష్టహీనులంజేసితివే. కాలుని దృష్టిపథమ్మున నీవింతచిన్ననాఁటనే పడుదువని కలనైన ననుకొననైతిని. తనయా

చ. "ఇదె వడిదెంచు నమ్మ! చెలు * లేరు" నటంచు సఖీజనమ్ముతో
మ్మనమునఁదోడుకొంచు నల * మందరశైలము పజ్జకీవయో!
కొదుకక పోవుచుంట గనుఁ * గొంటిని వేడుకతోడ; నెట్లునైఁ
జెడవెతు నింక? నాకడుపుఁ * జిచ్చొనరించితివే కుమారికా!

విశ్వా—[విచారముతో] ఔరా! ఏమిదౌర్జన్యము! శ్రీకంఠుఁడు ఈనిశాటుల నింకను దయ మిక్కిలి కంటితోఁ జూచుచున్నాఁడేమి? అయ్యో! నాతనూజ నెత్తుకపోయిన పాతాళలోకేశ్వరుఁడగు తామ్రకేతుఁడు చండశాసనుఁడు కదా?

చ. ఇనుఁడతడాజ్ఞ సేయు దువ * యింపఁగ జంకుదు; కన్నుసన్నచే
సిన వెఱఁగంది పద్మజుఁడు * శ్రీపతి ధూర్జటి వానియొప్పతున్

జనుదురు; చీఱఁబంపఁ బరి * చర్యయొనర్పఁగ నప్సరోగణ
మ్మనుపడి నంపునింద్రుఁడును; * భూరి పరాక్రమశాలి వాఁడెపో.

హర్యక్షము వాతబడ్డ హరిణి తెఱంగున నాకూఁతురు ఈ యాతుధానునిచేఁ జిక్కినది. ఇఁక నేనెటులీ యమితశోకమును సహింతును? కటకటా! పుత్రీ! మదనసాయకా! రూపవయోవిద్యాసంపత్తులందు మర్త్యామర్త్యులలో నీకు జోడునీడగు వరుఁడు ఎందును గానంబడమి నీకింకను బరిణయము చేయకయుండ నేఁటికి ఆతలఁపు సైతము అనవసరమయ్యెగదే బాలా! అయ్యో! మద్గృహదీపకళికా! నాగీము నలముకొనిన యిరులెట్లు తొలంగునే!

కుము—[సశోకము] హా పుత్రీమణీ! ఈనఁగాచి నక్కలపాలుచేసినట్లు శైశవమునుండియు నిన్నుమిగుల గారాబముతోఁ బెంచి పెద్దదానిఁజేసి తుదకొక పాడురక్కసుని కఱకు హస్తముల కప్పగించితిమి కదే? మమ్మెట్లు విడనాడి పోయితివి బిడ్డా!

ఉ. శోకమునొందు నీ సకుల; * జోఁపకపండ్ల నొసంగుపెంచివే
సీకయిచూచు చిల్కలను; * నీనడ నేర్చుచు వెంటరాఁగఁ జీ
కాకున నీవు ద్రోచినను * గ్రమ్మఱిపోవని యంచపిండుఁ; జిం
తాకలితాత్ములైన తలి * దండ్రుల నెట్లెడఁ బాసిపోతివే?

అయ్యోపట్టీ! నేనెటులీయమిత శోకసాగరమును దరింతును? నిన్నుఁదలంచిన నాకడుపు చెఱువగుచున్నదే!

విశ్వా—[భార్యహస్తముపట్టి] ప్రేయసీ! ఊఱడిల్లుము. ఈవిచారమున కంతమెక్కడ? పురాకృతదురితఫలమనుభవింపక తీఱునా?

కుము—[తెరవంకఁగని, దిగ్గనలేచి] ప్రాణేశ్వరా! అదిగో! మన గురువరులగు తుంబురు లరుదెంచుచున్నారు.

[అంతఁ దుంబురుఁడు ప్రవేశించును.]

విశ్వా—[కని, మోఁకరించి] గురూ! వందనము [లేచి, నతాననుఁడై] తామీశిష్యుని మోము చూడరాదు. వీఁడు మెండుగఁ బాపము జేసినవాఁడు.

తుంబు—[వానికరద్వయముపట్టి] గంధర్వశిఖామణీ! విచారింపకుము. నీకొదవినకష్టము నీయట్టి సుగుణసంపన్నునకు రాఁగూడదు. నేనీదుర్వార్త వినినక్షణమునఁ జేష్టలుడిగితిని జుమా.

విశ్వా—[కేల్మోడ్చి] మహనీయా! తమరాకచే నాగృహము పావనం బయ్యెను. దయచేసి యీపీఠము నలంకరింపుఁడు.

తుంబు—అటులటులే. [అని యాసీనుఁడై, జాయాపతుల నుద్దేశించి] విశ్వావసూ! కుముద్వతీ! మీరెంతయుఁ గొందలపడుట తగదు. దైవయోగ మనుల్లంఘనీయము గదా? [అని కొంతవడి యూరకుండి] ఖేచరోత్తమా! నిన్నొకసారి చూచి యేఁగుటకే కాక మఱియొక సంగతికూడఁ జెప్పనే తెంచితిని.

విశ్వా—అదేమియో సెలవిండు.

తుంబు—వినుము. నేఁటియుషఃకాలమున నేనమరతరంగిణీ జలస్నాతుఁడనై యొడ్డునఁగూర్చుండి తపమొనరించుచుండ నొక నాగకుమారుఁడు నాకడకరుదెంచి ప్రణతుఁడై నా చేతనొక కేతకీదళముంచిపోయినాఁడు. అది వివిధపరిమళోపేతంబగుటచే దాని నెవ్వతయో ఒకయువతిపంపెనని యూహించినాఁడ. పరికించిచూడ ముత్తెపుసరులం బోలిన అక్షరపుఁబంతులుదానిపైఁ దోఁచినవి. కాని తదర్థము ఆలేకరిహృదయమువలె దురవగాహముగనున్నది. [పైకిఁదీసి] ఇదే, కనుము.

విశ్వా—[కొని,కని] అహహా! ఏమికూర్పు! [అనిచదువును.

చ. "గురువర! ఏడనున్న మదిఁ * గోర్కెయొకింతయులేదె మీవియ
చ్చరులను జూడఁ? జేడియల * జన్మఫలమ్ములు చెప్పనట్టి నే
ర్పరులరు కారె మీ? రయిన * రండు; భవన్మహిమమ్ము తోడు గాఁ
బరగును మీకు; నాకపుర * వాసులెఱుంగరొ నాగవాసముల్?"

తుంబు—చూచితే లేకరిచమత్కృతి? వెండియుఁ గ్రిందఁగనుము. కర్ణకుండలాకృతిగల యొకముద్రయున్నది.

విశ్వా—[పరికించి] అవును. కుండలాకృతి యొప్పుచున్నది. ఇది లేకరి నామసంజ్ఞ. [భార్యంగని] జీవితేశ్వరీ! మనమదనసాయక చెలియగు కుండలవ్రాసియుండునా?

కుము—అయ్యో వెడగుభ్రమ! రాక్షసాపహృతయగు మనకుమారికిఁ గుండలపరిచర్య అబ్బుటెట్లు? మనమంతధన్యు

లమా? హాపుత్రీ! [అని కుందును.

తుంబు—మఱియు, "నాకపురవాసులెఱుంగరొ నాగవాసముల్" అనునదిచూడ నాగలోకవాస్తవ్యులగు మనవారలెవరో రచించినట్లు తోఁచుచున్నది.

విశ్వా—గురువర్యా! ఈలేఖచూడ మాతనయ జీవించియున్నట్లు నాకుఁదోఁచుచున్నది. అదియెటులో నేను వచింపఁజాలను.

తుంబు—అట్లేయగుఁగాక. ఎట్లయిన భోగిపురికి నేనిప్పుడే పోయెదను. దీనికర్త నాయనుటయే కాక మీమదనసాయకా వృత్తాంతము సైతము తెలిసికొనఁగడందను.

గీ. అరయ మీర లమాయికు * లైతిరేని
బాల నీపుత్రి సుగుణ సు * శీలయేని
ధర్మమే జయమొందుట * తథ్యమేని
నమ్ముఁ డీ మాట: మీపట్టి * మిమ్ముఁ జేరు:

ఇఁకనేను బోయెదను. [కుముద్వతి నుద్దేశించి] అమ్మా! కుముద్వతీ! ఊఱటఁజెందుము. నేను బోయి వచ్చెదను.

విశ్వా—పండితోత్తమా! నమస్కరించుచున్నాఁడను.

తుంబు—స్వస్తి. మీరిఁక లోనికరుగుఁడు. మేలివార్త నేను మీకుఁ దెచ్చునట్లుగావించుటకై సర్వేశ్వరునిఁ బ్రార్థించెద. [అని నిష్క్రమించును.

విశ్వా—[భార్యంగని] ప్రేయసీ! మన కుండలము ఎవటను గానంబడమగదా?

కుము—నాథా! మనకుమారియు, గుండలము, ఏకకాలము

మటుమాయమైరఁట. వారిఁబాసు నాకు వలదు. దైవము విషాదమే నానొసట వ్రాసెను.

విశ్వా—ప్రియా! ఊఱడిల్లుము. లోనికేఁగుదము పద.

[ఇర్వురు నిష్క్రమింతురు.

స్థలము—సాకేతపురి

రంగము—పురోపకంఠము.

[గాలవ మహర్షి ప్రవేశించును.

గాల—[యోజనాపరుఁడై] స్వర్గలోకమునెల్లఁ జక్కఁబెట్టి యీలోకమున కరుదెంచిన యీరాక్షస సమూహమెచ్చటిది? వీరినాయకుఁడగు తాళకేతుఁడెవ్వఁడు? ఔరా! ఏమి వీరి దారుణము!

చ. పనివడి హోమధేనువులఁ * బట్టి వధించిరి; శిష్యవర్గముల్
దునిమిరి; మేటిమానులను * దోరపుఁజేతుల మొత్తి ముద్దగా
నొనరిచి; రంతమానక మ * హోద్ధతిఁ బర్ణకుటీరపాళి న
య్యనలుని పాలుచేసి జటి * లాంగనలన్ జెఱవట్టి రయ్యయో

కటకటా! ఇఁక మునుల పర్ణశాలలెక్కడ? ఏమెడంగనిన,

గీ. దగ్ధ పర్ణకుటీరముల్ * దళిత శిష్య
జనకళేబరములు యతి * శల్యపంజ

రములు నల్లలుఁ గుల్లు మాం * సములు దోఁచు;
మేటి మునివాటిక శ్మశాన * వాటియయ్యె.

మేము పవిత్రులము. పరాస్పృష్టులము. తపోధనులము. ఇంతియకాక రక్తమాంసములెల్ల కృశించి యెమ్ములు ప్రోఁగులవలె నున్నాము. ఇట్టి మమ్ములనుగూడ ఈసోఁకుమూఁక విడనాడక పొట్టంబెట్టుకొనుచున్నది. ఎందఱో మునులు వీరి కప్పుడే ఆహారమైరి. ఎందఱో యింకఁగానున్నారు. అహో విధికృతము! మా తపమేమయినట్లు? దాని సాయము మాకువలదా? అదియే కదా మాకాయుధము? [ఇంచుక యోజించి] ఛీ! ఛీ! ఇట్లంటినేమి? తపఃప్రయోజనమునకు అవరోధము కల్గినఁగల్గెంగాక దానిబలమును అకారణముగ నశింపఁజేయునట్టిదెద్దియు లేదు. ఒక మహావీరునితోడు మాకుండెనేని ఈ యాతుధానుల నవలీల జమునికడకు సాగనంప కుందుమా? అట్టివాని నరయుటయే ప్రస్తుతము నాకుఁగర్తవ్యము ఇంతియకాక,

గీ. ముజ్జగంబులఁ గనుమోడ్పు * ప్రొద్దులోనఁ
బవనజవమునఁదిరుగు న * శ్వమునొకండు
నా తపమ్ము మహత్త్వమ్ము * నన్ సృజించి
యతనికొసఁగెద నసురసం * హారమునకు.

ఇప్పుడు నేవచ్చినదెచ్చటికి? [పరికించి] అయోధ్యోపకంఠమునకు. [నిరూపించి] ఆకనఁబడునదియే రాచనగరు. శత్రు

జిత్సార్వభౌముఁడిప్పుడు కొలువుకూటమున నుండవచ్చును. ఓహో! మఱచితిని మఱచితిని. ఇతని కుమారుఁడు ఋతధ్వజుఁడు అతిపరాక్రమవంతుఁడని వినియుంటినిగదా? ఇఁక నా కార్యము ఫలించినట్లే. కావుననే నిప్పుడే అతని యొద్దకుఁబోయి,

గీ. వేఁడి వచ్చెద యువరాజ * వీరు నతని
తనయు మునిహంతలగు పలా * శనుల నొకటఁ
జంపుపనికయి నావెంటఁ * బంప; నాదు
మాట మన్నింప కుండునే * మనుజవిభుఁడు?

[అని నిష్క్రమించును.

స్థలము—మునుపటిదే.

రంగము—శత్రుజిత్తుని సభామంటపము.

[రాజును, మంత్రియు, సభ్యులుఁ బ్రతీహారులుఁ బ్రవేశింతురు.]

శత్రు—మంత్రీ! మన సేనానిపంపిన వార్తలు చెప్పుము.

మంత్రి—దేవా! ప్రథమదినవార్తలు ఏలికకుముందుగా నివేదించెద. నిర్జరలోకము వెలువడి ఆనాడే ప్రప్రథమమున ఒక రాక్షససేన మనరాజ్యమునఁ బ్రవేశించినదఁట. మన సైనికులు వారితోఁ దీవ్రయుద్ధమొనర్చి అనేకులను దునుమాడి తక్కినవారిని బటాపంచలొనర్చిరఁట. ఆదినమున వారలు కొల్లవెట్టిన యూరువల్లెలం దిపుడు మరలఁ బ్రశాంతినెలకొనెనఁట. మఱియు, ఆదినమున వారివలనఁ

జంపఁబడినప్రజలుఅల్పసంఖ్యాకులని తెలియవచ్చుచున్నది.

శత్రు—వారుతమ ఆగడములకు దేవలోకము చాలక మనలోకమునకుఁగూడ నవతరించిరిగదా? ఇఁకవారు నామావశిష్టులగుమాట వారినొసట వ్రాసియుండనోపు. తరువాత తరువాత?

మంత్రి—ఇఁక రెండవదినము సమాచారములు దేవర ఆలింతురుగాక. తొలినాఁడు వచ్చిన సైన్యమునకు ద్విగుణముగా ఒక మహాసేన నాకలోకమునుండి తరలివచ్చినదఁట. వారలనేక గ్రామముల ననలాహుతియొనర్చి తగుపాటి ప్రాణహానికూడ గావించినట్లు సేనాని తెలుపుచున్నాఁడు. మన సైనికులు వారితో హోరాహోరిగఁ బోరాడిరిక్కాని రాక్షసులసంఖ్య అధికమగుటచే మన సైన్యము పలుచఁబడినదనియు, సాహాయ్యార్థము మఱియొక క్రొత్తసైన్యమును శీఘ్రముగఁ బంపవలెననియు, అతఁడు గోరినాఁడు.

శత్రు—అయ్యయ్యో! రాక్షసు లింకను వచ్చుచున్నారా? సేనానికోరిన విధమున నీవు రాణువను బంపితివా?

మంత్రి—చిత్తముదేవా! వార్తవచ్చినతక్షణమే ఒక మేటిసైన్యమును బంపితిని. ఇఁక నేటివార్తలు విన్నవించెద.

శత్రు—చెప్పుము చెప్పుము.

మంత్రి—దేవా! నేఁటియుదయము నుండియు రక్కసులు కదుపులు కదుపులుగ వచ్చుచున్నారఁట. అందొక కదుపుతో రక్షోనాయకుఁడగు తాళకేతుఁడనువాఁడు వచ్చి, "త్వష్టా

వనముల నిర్మూలించి తద్వనవాసులను వధింపుఁ" డని తన యనుచరుల నాజ్ఞాపించెనఁట. వానియాజ్ఞకు లోఁబడి రాక్షసులు తపోవనములున్న యెడకుఁ బరువిడుచున్నవారఁట. ప్రస్తుతము మననగరమున కంటియున్న తపోవనమున సైతము వారలు ప్రవేశించి మౌనులను గారించుచున్నట్లు తెలియుచున్నది.

శత్రు—అక్కటా! ఎంతకష్ట మెంతకష్టము! వీరలవైఖరిఁ జూడ సింహమును దనగుహయందే ఎదిరించిన గజసమూహము విధమున నున్నది. ఇఁక మేమును రణరంగమున కరుగవలెనా?

మంత్రి—దేవా! తామేలపోవలయును? ఈ సోఁకుమూఁకను రూపు మాపుటకు యువరాజు చాలఁడో?

శత్రు—అట్లయిన విలంబము సేయక వానిని సమరసన్నద్ధు నొనర్పుము. తపోవనవాసులకు భంగపాటు కల్గుచుండ మన ముపేక్షింపరాదు.

[అంతఁ దెరలో రాక్షసనాదములు. మౌనుల ఆర్తధ్వనులు.]

శత్రు—ఏమిటి దా కోలాహలము?

ప్రతీహారి—[పోయి వెండియువచ్చి] దేవా! రక్కసులబారికి వెఱచి తమ ఆకుటెళ్లను విడిచి పారిపోవుచున్న మునుల ఆర్తరవములు. వారిని హాహాధ్వనులతో రాక్షసులు వెంటఁదఱుముచున్నారు.

శత్రు—ఏమిది? మనపురి చెంగటనే యిట్టి ఉపద్రవములా! [ప్రతీహారితో] ఓరీ? నీవుపోయి ఋతధ్వజకుమారుని శీఘ్రముగఁ దోడ్కొనిరమ్ము.

ప్రతీ—మహాప్రసాదము. [నిష్క్రమించును.

శత్రు—మంత్రీ! నీవు అప్రమత్తుఁడవై కర్తవ్యము నడపవలెను.

మంత్రి—దేవర ఆజ్ఞ.

[తెరలో దుందుభి. గాలవశిష్యుఁడొకఁడు ప్రవేశించును.]

శిష్య—మానవేశ్వరా! మాగురువరులు గాలవమునీంద్రులు భవద్దర్శనమునకై వచ్చుచున్నారు.

శత్రు—[లేచి] అహాహా! నేఁడు సుదినము. [శిష్యునుద్దేశించి] ఓయీ! వారెచ్చట?

శిష్య—[నిరూపించుచు] వీరే, కనుము.

[గాలవమహర్షి ప్రవేశించును.]

శత్రు—[కని, మ్రోఁకరించి] దేవా! నమస్కరించుచున్నాఁడను.

ఉ. పావనమయ్యె నాగృహము; * పాప విదూరుఁడనైతి; మీఱె నా
భావుకముల్ చెలంగు; భవ * బాధల నేఁదరియింతునింక; నీ
సేవ యొనర్చుభాగ్యమది * చేకుఱె నేఁటికిఁగాదె నాకు? దే
వా! వివరింపువేగ భవ * దాజ్ఞల ; నే శిరసావహింపుదున్.

గాల—[ఆసీనుఁడై] రాజేంద్రా!

ఉ. వింటివె నీకుమారుఁడతి * విక్రమవంతుఁడటంచు; నింతకున్
వింటివి కావె రాత్రిచర * బృందమొనర్చుచునున్న ధార్త్యముల్?

శత్రు—అయ్యో ! అవునవును.

గాల—

దంట భవత్సుతుండు మముఁ * దప్పక ప్రోవఁగలాఁడటంచు నా
వెంటను వానిఁదోడుకొని * వెళ్లుటకే నిపుడేఁగుదెంచితిన్.

శత్రుజిన్మహీపతీ ! రాక్షసులిప్పుడు తాళకేతుఁడను పాతాళాధిపునిప్రాపుఁగొని చెలరేఁగి వనసీమలఁ బర్ణకుటీరవాసులయి తపమొనర్చుచున్న మాయట్టి మానులను మెండుగఁ బీడించుచున్నవారు గదా ?

శత్రు—మహాత్మా !. అవును. ఇంతియకాక మూఁడుదినముల నుండియు మాసైన్యములు వారలతోఁ బోరుచునేయున్నవి. ఆహా ! రజనిచరులు త్రిజగత్కంటకులు గదా ?

గాల—వారల రాపునకోర్వఁజాలక పెక్కండ్రుమునులు నీవీటికిఁ గూఁతవేటు దూరముననున్న తమతమ కుటీరముల నెత్తుకొని యెచ్చటికోపోయిరి. కొందఱు నాకడకరుదెంచి తమకష్టములం దెలిపిరి. రాక్షసమర్దనమునకు నీతనయుఁడు ఎంతయు సమర్థుఁడని విని వానిందోడ్కొనిపోవ నేతెంచితిని. కావున నీవిప్పుడు ససైన్యుని ఋతధ్వజకుమారుని నాతోడఁ బంపవలయును.

శత్రు—మునివర్యా ! కుమారుని రణసీమకు ఇపుడెట్లును బంప

నిశ్చయించినాఁడను. వానిం దోడ్తెచ్చుటకై ప్రతీహారి యిప్పుడేపోయెను. వలయునేని వానిని మీవెంటనే కొనిపొండు. [నిర్వర్ణించి] ఇడుగో వచ్చుచున్నాఁడు.

[అంత ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత—[మోఁకరించి] జనకునకు ఋతధ్వజుఁడు నమస్కరించుచున్నాఁడు.

[అనియట్లుసేయును.]

శత్రు—కళ్యాణము పుత్రా ! కళ్యాణము. [నిరూపించుచు] కుమారా ! గాలవమునీంద్రులు నీకై చనుదెంచినారు. వారికిఁ బ్రణమిల్లుము.

ఋత—[కని, సంతసముతో] అహో ! అమోఘదర్శనులు !

[అని కేల్మోడ్చి.]

(గేయము.)

భవబంధభేదనా! గాలవతపోధనా! బందీకృతకామగుణా! పాపశోషణా!
శివసన్నిభా! వరా! ఓమునిసుధాకరా! శ్రీనాథపదాంబుజసం,సేవనోజ్జ్వలా!
రవిచంద్రతేజ! పాపాటవీదవాలనా! రక్షోజనభీషణ! వి,భ్రాజితేక్షణా!
భవదంఘ్రియుగ్మమున్, బల్మఱు నుతించెదన్, బ్రహ్మజ్ఞ! మహాత్మ! యతీ!

[వందనంబిడే.

గాల—కళ్యాణమస్తు. శత్రుజయసిద్ధిరస్తు.

శత్రు—కుమారా ! వీరు నిన్ను రాక్షససంహారణార్థము తోడ్కొని

పోవ నరుదెంచినవారలు.

ఋత్వి—అహో! ఎట్టిమహాకార్యము నావలన జరిపింపఁజూచుచున్నారు! ఇట్టి విశేషగౌరవము ఈమునీంద్రుఁడు నా యెడఁజూపఁ గారణమేమి?

గాల—[దరహాసముతో] ఓయీ రాకుమారా!

చ. నను విను; మిక్ష్వసంతతియు న * నారతధర్మనియుక్తనేలు నీ
జనకుఁడు శత్రుజిత్తు కడు * సార్థకనామకుఁ; డట్టివాని స
త్తనయుఁడవీవు; జంకుదువె * ధర్మవిదూరుల రాక్షసాళి నే
ర్పునఁ దునుమాడ? ఇష్టమఖముఁ * బ్రోచుట నీ కొక కష్టమౌనొకో?

ఋత—[స్వగతము] ఔరా! ఏమిభాగ్యము! మునిపీడనాళోలురగు దనుజుల సంహరించి నాజనకుని యశోలతికను నేను పోషింప వలసినకాల మాసన్నమాయెనుగదా? కాన సంశయింపనేల? [ప్రకాశము] మహాత్మా! తప్పక నేను మీతోవచ్చెదను. మీయట్టి మహానుభావుల ప్రాపుండిన నాకెయ్యది అసాధ్యమగును?

చ. త్రికరణశుద్ధితోడుత మ * దీయగురుండిదె పంపునంట; ఇం
తకు దమమేలి దీవెనలు * తప్పనివంట; నిశాటకోటి మా
మక నిశితాస్త్రసంహతుల * మ్రిందుట వేధ లిఖించెనంట; త
ప్పక యిఁక మీమనోరథము * పావనశీల! లభింపకుండునే?

శత్రు—కుమారా! నీవు రక్షోజనగర్వపాటనమొనర్చి నాకీర్తిఁగా

పాడవలయు.

ఋత—పితృన్నాజ్ఞతి శిరసావహించెదను.

శత్రు—ఋషివర్యా! మీయాజ్ఞను బద్ధుఁడనై మీతో నా కుమారుని ఋతధ్వజునిఁ బంపుచున్నాఁడను.

గాల—పరమానంద మొందితిని. నీకు సకలాభ్యుదయములు కల్గుఁగాత. [అని లేచును. శత్రుజిత్తును, బరివారమును లేతురు.

ఋత—[గాలవు నుద్దేశించి] మహాత్మా! మీయానతికి వేచియున్నాఁడను.

గాల—కుమారా! రమ్ము. పోవుదము. [ఇర్వురునిష్క్రమింతురు.

శత్రు—[మంత్రి నుద్దేశించి] అమాత్యా! మనమిప్పుడే మునిచంద్రుని, కుమారుని, వీడ్కొలుపవలయు. కాన సభనేటికిఁ జాలింతము. మఱియు, కుమారుని వెంటఁబంపుటకు ఒక మహాసేనను నీవిప్పుడే ఆయత్తపఱుపవలయును.

మంత్రి—మహాప్రసాదము. [అందఱు నిష్క్రమింతురు.

స్థలము—మునుపటిదే.

రంగము—పురోపకంఠతపోవనము.

[విశోకుఁడను నాగకుమారుఁడు ప్రవేశించును]

విశో—దుష్టశిక్షణమ్మునకును, శిష్టపాలనమ్మునకును మానవయువ్యుఁడు వీఁడు వెడలెనని యిచ్చటి మునీశ్వరులు చెప్పుచు

న్నారు. మఱియు వారి మొగంబులు హర్షసూచకములై నేఁడు వికసించియున్నవి. ఇంతకొలఁదికాలములో ఆశ్రమవనములందు మరలఁ బ్రశాంతి నెలకొనుటకుఁ గారణమేమి? నామిత్రుఁడగు ఋతధ్వజ రాజకుమారుని బెడిదంపుటడిదమేకదా? కనుఁడీ తపోవనలక్ష్మిని!

సీ. కడువేడ్క మునిసతుల్ * తడుపుచెంగావి వ
ల్వలఁ జెట్లపై నాఱ * వైతురిచట
హోమధేనువుల పీ * యూషతుల్యక్షీర
మునుదీయుదురు శిష్య * జనము లిచట
వేదపాఠమ్ము నే * ర్పింతురంతేవాసి
వర్గమ్ముచే మౌని * వర్యులిచట
శాస్త్రాంశములుకొన్ని * చర్చింతురిదె వీరు
విద్వత్ప్రకర్షమ్ము * వెలయ నిచట
ఆశ్రమపుఁజిల్క లెంతయు * హాయి గదుర
సామగానమ్ము నెడలేక * సలుపు నిచట:
ఇచట వటువులతో నాడు * మృగము లౌర!
మోదరసపూర మయ్యెఁ ద * పోవనమ్ము.

[పరిక్రమించుచు] ఋతధ్వజుని నేఁడుచూడవలయునను కుతూహలము నన్నువదలకున్నది. [ఆకర్ణించుట నభినయించి] అదే, క్షతాంగులగువారలనుదిండ్ల ఆర్తనాదము. సమరరంగము ఉపకం

ఠముననే యుండవలయు. ఆవంకఁ జనెదనుగాక. [పరిక్రమించి] ఆహా! ఏమిరాక్షసకళేబరములు! [నిర్వర్ణించి] ఇదుగో ఘనాశ్వారూఢుండగు నామిత్రుండు! త్రిపురాసురమర్దన మొనర్చుచున్న రుద్రునిమాడ్కి రక్తసిక్తకరవాలమును గేలనూని అల్లసోఁకుమూఁకపై బ్రవాల నురవడించుచున్నాఁడు! ఆహా! ఏమియీతని రణోత్సాహము! [మరల నిర్వర్ణించి] అదే సంకులయుద్ధ మారంభమైనది. నావయస్యుని సేనలు ఎంత తేఁకువమై పోరాడుచున్నవో! చూడుఁడీ రక్కసులగతి.

సీ. పరిపక్వతృణ రాజ * ఫలసన్నిభోత్తమాం
గములుద్రవయ్యఁగ నేలఁ * గలయువారు
ఖండితబాహులై * గర్జింపు చావేళ
మున ముందువెన్కలై * చనెడివారు
ప్రాణముల్ దెగుటఁదా * పవశాత్ములై పల్కు
లు మహార్తిచేఁ బొర్లి * రోఁజువారు
మిక్కుటంబుగ నల్లఁ * గ్రక్కుచుండియుఁ గేలఁ
బెద్రనాలఁగైకొని * విసరువారు
మరణవేదనచే మాటి * మాటి కతి భ
యంకరమ్ముగ మూల్గుచు * నష్టిహాసు
లై యదే కుప్పదెప్పలు * యాతుధాను
లహహ! క్షతదేహులైన వా * రచట నిపుడు.

[వెండియు నిర్వర్ణించి] ఆసోఁకుమూఁక నడుమఁ గనఁబడు గంభీరవిగ్రహము తాళకేతుఁడు కాకుండునా? అదిగో! శత్రువర్గమును జిందఱవందఱయొనర్చి ఋతధ్వజుఁడు వానివంకకే పరువిడుచున్నవాఁడు. ఇఁక ద్వంద్వయుద్ధమొనర్తురు కాఁబోలు. సరియే, నేననుకొనినటులే. భళిభళి! నామిత్రుఁడు దుష్టోపిరుసితో ఎంతనేర్పునఁ బోరుచున్నాఁడు! ఆహా! ఇదియేమి? వారిరువురును ఇటువైపు వచ్చుచున్నారే? ఇఁక నేనిచటఁ దడయరాదు. [ప్రాంజలియై] పరమేశ్వరా! నామిత్రునకు సమరజయమనుగ్రహింపుము. ధర్మము స్థాపింపుము. [అని ససంభ్రమముగా నిష్క్రమించును.

[తాళకేతుఁడు ప్రవేశించును. వానినిఁ దఱుముచు ఋతధ్వజుఁడు రక్తసిక్త కరవాలముతోఁ బ్రవేశించును.]

ఋత—[పేరెలుఁగుతో] ఓరీ! సాధుజనహంతా! ఎటకేఁగెదవు! నిలుము నిలుము.

ఉత్సాహము.

నిలుము నిలుము నీచుఁడా! వి * నీతిరహిత! నిన్నుఁ గన్
బలము మెఱయఁ దునిమి జముని * పాలి కంపకుందునే?
తులువ! వాని వరులనీవు * త్రుంచుటెంత? రమ్మ ర
మ్మలంతి జోద! ఇపుడె నీదు * నాగడముల మాన్చెదన్.

తాళ—[నిరసనభావముతో] ఓరీజేలా! నేను పారిపోవుచుంటి ననుకొంటివా? నీవలన నాకు భయమా?

మ. భయమా? కాదు; మదేభముల్ జెనకు నా * శ్వానంబుచందాన మ
ద్భయదాకారముఁ జూచి భీతిలక యీ * బాలుండెదుర్కొ సమి
జ్జయ మర్థించుచుఁ బోరుకంటె మతిసై * చ్యంబున్నదే యంచు నిన్
దయమై వీడితిఁ; బొమ్ము; లేనియెడఁ గ్రో * ధంబగ్గలంబౌఁ జుమీ.

ఋత—[చిఱునగవుతోఁ దనలో] ఈ తుచ్ఛుఁడు నేను శత్రుజిద్రాజ సింహకిశోరమునని యెఱుఁగఁడు గాఁబోలు. [ప్రకాశము] ఓరీ ధూర్తుఁడా! మాటలతోఁ బ్రయోజనమేమి? నీయనుచరులఁ బెక్కండ్ర మదమడంచిన నాయసిపుత్రిక నీమెడఁ గౌఁగిలింప సంబరపడుచున్నది. ఏమందువు?

తాళ—[క్రోధోద్దీపితుఁడై] అటులైన నిదె చచ్చితివి రమ్మ.

[అని ఖడ్గము జళిపించును.

ఋత—రారమ్ము. [అని యిరువురును యుద్ధము సేయుదురు తాళకేతుఁడు నేలంబడి మరలలేచును.]

తాళ—[ఆశ్చర్యముతో] ఔరా! ఏమి యీశత్రుని యుద్ధకౌశలము! వీనిని నే జయింపఁ జాలనిచో నాబ్రతుకేల? [తేఁకువతోఁ బ్రకాశము] ఓయీ! నీవిదే అస్తమించితివి. రారమ్ము.

ఋత—నేనుకాదు. రాక్షసకుల మింతటితో నస్తమించును.

[ఇరువురు యుద్ధము చేయుదురు. తాళకేతుఁడు భీతిల్లి పాతాళమునకరుగును.]

ఋత—[నిలువఁబడి, సాశ్చర్యము] ఔరా! ఏమి యాశ్చర్యము! నాధాటికి వెఱచియుఁ బరాజయమృత్యు భయమ్ములో

క్కుమ్మడి గలుగ,

క. కిటిరూపధారి యై యొం
తటిలో నహిపురికి నతి ము * దంబందుచు నా
కుటిలుఁడు సనె? హా! దైత్యులు
మటుమాయలమారులనెడి * మాట యనృతమే?

అయినను వీనిని నిర్మూలింపక విడుతునా? ఇదె వెన్నాడెద.

[అని ససంభ్రమముగా నిష్క్రమించును.

మదనసాయకము

ద్వితీయాంకము.

స్థలము—నాగలోకము.

రంగము—తాళకేతుని సౌధము.

[మదనసాయక విచారముతోఁ బ్రవేశించును.]

మద—[విచారముతో] అకటా! ననుబోఁటి మందభాగ్యలెందైన నుందురా?

క. ఎక్కడి గంధర్వపురం?
బెక్కడి పాతాళలోక? * మేగతి నిఁక నీ
రక్కసుల బారి తప్పను?
ముక్కడిదైవంబు వ్రాలు * పో యిది యహహా!

నాజీవితమంతయు స్వప్నగత వృత్తాంతమువలె నున్నది. దివిజనగు నాకు ఈనాగలోకవాసమా? ఔరా! అసురుల దౌర్జన్యము! ఈతాళకేతుహతకుఁడు నన్ను వరించునఁట! హా దైవమా!

సీ. అలవోక వాహ్యాళి * కై నాఁడు మందర
గిరి సమీపమ్మున * కరుగవలెనె?
అరిగితిఁబో వేగ * మరలి పోవక నెచ్చె
లులతో సరఃకేళి * సలుపవలెనె?

సలిపితిఁబో సాహ * సమ్మున నసురుఁడా
దివ్యస్థలమున కే * తేరవలెనె?
వీతెంచెఁబో తన * కెదిరిఁ గన్గొనక కా
వరముమై ననుఁ జెఱ * బట్టవలెనె?
కట కటా! ఇది యేమి? స్వ * ర్గమ్ము నిదురఁ
జెందియున్నదో? లేక య * జేయులనుచు
దానవుల కైదు పది సేయఁ * దలఁచెనొక్కొ?
ఔర! విధిచెయ్వు కడు దురూ * హమ్ము గాదె?

[అంతఁగుండల ప్రవేశించును.]

కుం—[తనలో] అకటా! నా చెలి మగుడఁ బ్రాంతదారియే తొక్కుచున్నది. [చేరఁబోయి] ఏమే మదనసాయకా! చెప్పినపనియంతయు మిగులఁ జక్కఁగాఁ జేయుదువే?

మద—చెలీ! ఏలనన్నిట్లొంటరిగ విడిచిపోయితివి?

కుం—ఏమిట్లనుచున్నావు? నీవేకదా నన్ను ఆరామము శృంగారించి రమ్మని పంపినదానవు? నేనరుదెంచు సరికి నీవు సిద్ధముగా నుందునని చెప్పితివి. మఱచితివా?

మద—[తనలో] వనవిహారము సంగతి మఱువనే మఱచితిని. [ప్రకాశము] సఖియా! నన్ను క్షమింపుము. నేఁడు వనవిహారము నాకు వలదు. మిక్కిలి ఆయాసముగా నున్నది.

కుం—[తనలో] మగుడ శోకదేవత నుపాసించుటకు. [ప్రకాశము] చెలియా! నిన్ను నేనెఱుంగుదు. నేఁడు నిన్ను విడిచిపెట్టుదు

ననుకొనకుము. మఱియు నీవు ఇన్నినాళ్లనుండియు నీరువోసిపెంచుచున్న చంపకలతికయు, మల్లికావల్లియుఁ గ్రొన్ననలెత్తి పుష్పాత్థులతో నీరాక కెదురుచూచుచున్నవి. నీవు రాకతీరునా?

మద—చెలీ! నీయాజ్ఞానుబద్ధను. కాని ఆయాసము కడుదుర్భరముగ నున్నది. ఒక్కసారి శయనించుట కనుజ్ఞనిమ్ము.

కుం—నీసంగతి నాకుఁ దెలియును. నీవు శయనింపవు.

మద—నెచ్చెలీ! నీయాన.

కుం—అట్లైన నొకమాఱు శయనింపుము. ఇంతలో నేనుబోయి నీయుడుపులును భూషణమ్ములును గొనివచ్చెద.

మద—అట్లే సఖీ!

[కుండల నిష్క్రమించును.

మద—ఔరా! ఈమేరునగపుత్రి నన్నెపుడు నెడఁబాయక నాకొనర్చుచున్న సంరక్షణము నెట్లు వాక్రుత్తును? ఆ హాతవిధి ఈమెను నన్నుఁగూర్పకున్నచో నాగతియేమైయుండునో? [వామకరస్పందము సూచించుచు] ఏమిది? నాయెడమ భుజ యదరుచున్నదే? ఈమందభాగధేయకుఁ గల్గు మంగళం బెయ్యది?

[అంత నాకాశమున]

గీ. తరుణి! పెడఁబాయఁ బోకుము * ధైర్యనొక;
ప్రియసఖీవ్యాజ విరహిత * ప్రేమ మనెడి

మేటి చుక్కాని నేరుపు * మెయి విపత్స
రిత్పతిన్ వేగ నీ వుత్త * రింపఁ గలవు.

క. శక్ర నిభమూర్తి యతుల ప
రాక్రమవంతుండునైన * రాకొమరుఁడిదే
ఆ క్రూరునిఁ జెండాడ న
వక్రచరిత! వచ్చు; సౌఖ్య * వైభవ మిచ్చున్.

మద — [అచ్చెరువుతో] ఏమి యాశ్చర్యము! నాకుసౌఖ్యమబ్బుటయా? నేనునమ్మఁ జాలను. ఈ గగనముపల్కు గగనకుసుమమే. అయోనాకుండలా! నీవు ఇట్టితటినాకడనుండఁగూడదా? మఱచితిని. ఆమె వచ్చువఱకును నేను ఇట్లేయుండిన ఆమెనన్నుఁదప్పక నిందించును. ఇఁక శయనించెద.

[అనియట్లు సేయును.

[అంత ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత — ఆ మాయాదంష్ట్రి పట్టిపోయిన మార్గమిదియే. నేనెచ్చటి కేతెంచితిని? [నలుకెలంకులఁబరికించి] ఏమిది? దివ్యభవనమువలెఁ దోఁచుచున్నదే? ఈస్వర్ణగృహమెవ్వరిదై యుండనోపు?

క. ఆ యాదిశేషు మందిర
మో! యింద్రుని విలసనంపు * టుప్పరిగయొ? త

న్మాయారాక్షస కల్పి
మై యొప్పెడి హేమగృహమొ? * అచ్చెరు వయ్యెన్.

[మగుడఁబరికించి] ఇట్టి దివ్యభవనము నేనెప్పుడును గని విని యెఱుంగను. అబ్బా! ఏమియిచ్చటి కాంతి యుత్కర్షము!

సీ. బంగారు తీవె లా * రం గల్గి యంపమ్ము
మించెడి హొంబట్టు * మేలుకట్టు
జ్యోతిలేకయె వింత * జ్యోత్స్న గొల్పెడు మణి
స్థగిత మౌ దీపికా * స్తంభచయము
రమ్మంచుఁ గౌఁగిలి * నిమ్మంచు లే నవ్వు
గదుర సైఁగ లొనర్చు * నుదిరి బొమ్మలు
ముకురమ్ము నన్ బోలె * మూర్తిం బ్రతిఫలింపఁ
గాఁ జేయు చల్వరా * కట్టునేల
కొలుపు బలువితముల రుచుల్ * కలసి వింత
వెలుఁగు వెల్లువ కా నిరుల్ * దొలఁగ ద్రోసి
నిలుపు నీయెడ నిత్య చం * ద్రికల నౌర!
చెలువముల సీమ యీ గృహ * శ్రీలలామ.

ఈకాంచన హర్మ్యము నిక్కముగ రక్కసునిచే నిర్మింపఁబడినదే. వాఁడిందెచ్చటనైన డాఁగియుండవలెను. కానవెదకి చూచెద. [పరిక్రమించుచు, మదన సాయకం గాంచి] ఆహా! ఎవరీచిన్నది? ఇందొంటిరిగా నిదురించుచున్నదే? [మగుడఁబరికించి] ఈ

మె ఏజాతికన్యయై యుండును?

ఆ. నాగకన్యయొక్కొ? * నరకన్యయొకొ? దేవ
 కన్యయొక్కొ? ఖచర * కన్యయొక్కొ?
 నన్ను మోహపఱుప * నక్తంచరుఁడు సృష్టి
 చేసి నట్టి గడుసు * చేడె యొక్కొ?

[దరికిఁబోయి చూచి] ఔరా! ఏమి యంగసౌష్ఠవము! ఈసుకుమారి నిమురించియు ఎంతముద్దులు గుల్కుచున్నది!

సీ. వెడవింటివాఁడు ఱు * వ్వఁగ నిటంబడి కడుఁగ్
  మురువుఁ జూపెడు పూవు * ముల్కియేమొ?
 లోకత్రయము నల * వోక జయింప నే
  తెంచిన మోహినీ * దేవియేమొ?
 సకలలోకా మోద * సంధాయిని యటంచుఁ
  బేర్గన్న గాంధర్వ * విద్యయేమొ?
 మురిపె మొప్పఁగ లస * న్మూర్తిఁ దా వహియించి
  రాజిల్లు శృంగార * రసమ యేమొ?
 అనుచుఁ జూపఱు మదిఁ గొని * యాడఁదగిన
 రూప రేఖావిలాసంపుఁ * బ్రోవనంగఁ
 బొదలు నీ విభ్రమోజ్జ్వల * మోహనాంగి;
 దీని చందంబదేమొకో * తెలియరాదు.

[మదనసాయక మెదలును. దానిఁగని ఋత.] ఈసుదతి కదలు చున్నది. నిద్రలేచును గాఁబోలు. [అని యొకవంకనిలుచును.

మద—[లేచి, పాఱజూచి] ఇచ్చట అలికిడికిఁ గారణమేమి? నె చ్చెలి యరుదెంచెనా? కుండలా! కుండలా! [పలుకదు] ఆమెయింకను రాలేదు. లేక తాళకేతుని భటులెవ్వరైన వచ్చిరా? నాకుభయమగు చున్నది. [నల్దెసలఁజూచి, ఋతధ్వజునిఁగాంచి, లేచి, సాశ్చర్యము] ఆహా! ఎవరీ దివ్య సుందరమూర్తి? ఇదిస్వప్న విభ్రమమా? నిజమా?

ఋత—[ఆమెమోము దేఱిచూచి] ఏమిది? సంజదోఁచెను కెం దమ్మి వదువునఁ గాంతిదక్కిన యీమెనెమ్మొగమున బాష్పధారా రేఖలు కన్పట్టుచున్నవి? నిక్కముగ ఈమెరాక్షసాపహృతయగు ఒక కన్యకామణి గావలయును.

మద—[మగుడ నతనిఁగాంచి, సంతోషముతో] గగనవాణి యుదాహరించిన రాజకుమారుఁడు ఇతఁడేయైయుండనోపు. కాని యీమోహనమూర్తిని జూచిన నామేను కంపమెత్తుచున్నది. కుండలరాదేమి? కుండలా! కుండలా!

ఋత—అయ్యో! ఈముద్దరాలు మిక్కిలి భయంపడుచు సహచరినిగాఁబోలు పిలుచుచున్నది. వృత్తమరయుటకునే నీమెను సమీపించినచోఁ దప్పక బిడియపడును. అయిననుజూచెదను. [డాసి]

పంచచామరము. భయం పడంగ నేల? చేల! * వద్దు; న న్వింగదే
  దయన్ వచింపుమా పలాశి * ధార్త్యముల్ సతీమణీ!

మద—[మిక్కిలి బిడియము నటించుచు] అబ్బా! ఈమోహనాకారుని యెదుట నేనింక నిలువఁజాలను. కుండల రాదు. నేనే ఆమెవద్దకేఁగెదను.

[అని నిష్క్రమించును.

ఋత—

అయో! మృగాక్షి మాఱు మాట * నాడ కేడ కేఁగె? వి
స్మయమ్ము గొల్పెనార! ఈమె * చంద; మేమిసేయుదున్?

అవురా! ఏమియీామె మాధుర్యము! ప్రత్యుత్తర మీయక క్రొక్కారు మెఱుంగుభంగి అంగనామణి మాయమైనది. [కొంత తడవాఁగి] సరియే. వాస్తవముగ ఇది శాళ్వకేతునిచే నిర్మింపఁబడిన మాయాసౌధము. ఆటకటాంకరిని ఎట్లయినఁగనుంగొని వధించినచో అన్నియుఁ జక్కఁబడును. వానికై అందంద వెదకి చూచెద. .

[అనినిష్క్రమించును.]

స్థలము—మునుపటిదే.

రంగము—సౌధాంతికోద్యానము.

[చంద్రకాంతవేదికపై విరహతాపము నటించుచు మదనసాయకయు, ఆమెయండఁ గుండలయు, ప్రవేశింతురు.]

కుండ—[స్వగతము] ఎడఁబాసియున్నది ఒక్కక్షణము. ఇంతలో ఈమెకిన్ని మార్పులు. ఆహా! దైవకైతవము! ఆదివ్యపురుషుఁడెవఁడై యుండును? [మద.తో] చెలీ! మదనసాయకా! కలఁతనిదురలో నీవు ఏదోకలఁగని యుందువు, కాని ఆదుర్గమస్థలంబునకు మనుష్యమాత్రుండు రాఁగలుగు టెట్లు?

మద—ఓసీ! నీవెంతచెప్పినను నమ్మను. నేనేమిసేయుదును? ఆ మోహనరూపుని ఆకృతి నాకిపుడు కన్నులకుఁ గట్టినట్లున్నది. అతని పలుకులు ఇపుడు నావీనులఁ దాండవమాడుచున్నవి.

కుండ—అతఁడు ఎవ్వఁడో ఎచ్చటనుండునో ఎవరికెఱుక? అట్టివానినిఁ గని నీవు మోహింపవచ్చునా? ఓసీ బాలా! నీవెంతగోలవు? నిన్నుఁ జూచిన ఉషాకన్య స్ఫురణకు వచ్చుచున్నది.

మద—చెలీ! అటులైన సంతోషమే. నీవు చిత్రరేఖవుగదా?

కుండ—చతురసంభాషణమునకుఁ గొదవేమి? సఖి! అతఁడెట్లుండునో ఇంచుక వర్ణింపఁగలవా?

మద—ఆ యనుపమాంగుని నేను వర్ణింపఁజాలను. అయినను వాని విధమిట్లున్నది.

(గేయము.)

సఖి! విను- మోహనాంగుఁడే

1 తలపై మకుటము - కలిగిన వాఁడే
చెలువగు తిలకము వాఁడే॥ స॥

2 ధనువును దొనయును - దాలిచినాఁడే
మనసిజుఁ బోలినవాఁడే॥ స॥

కుంద—[తనలో] ఈమెచెప్పినచొప్పు నిక్కువమేని అతఁడు తాళకేతునిఁజంప నరుదెంచిన శూరశిఖామణి గావలయు. చాలకాలమునుండియు ఆమొఱకుని జాడయేలేదు. మింటి పల్కుసార్థకము కావచ్చును. [ప్రకాశము] సుందరీ! అతఁడు కార్యార్థియైవచ్చినాఁడు. కావున ఎటులైనను మరల మనసౌధమునకు రాఁగలఁడు. నివ్వూఱడిల్లుము.

మద—[విరాళితో] సకియా! నీవా మదనసుందరుని ఎటులైనఁ దోడ్తేనిచో నేను తనువునిలుపఁజాలను. అట్టి సుందరుని బిగికౌఁగిటఁ గ్రీడింపఁగల మగువజవ్వనమేకదా జవ్వనము!

(గేయము)

కోమలదేహుం, డును సుకుమారుం, డగు నా పురుషుం, డెవఁడో చెలియా!
ప్రేమమలర నిపు, డతమెయిఁగనుఁగొని, ప్రియసఖి! వేగమ, తెలుపఁగదే
అతనుఁడదయుఁడయ్యెఁగా! హా! సహింపఁ జాలనే!
ఈ ప్రమద వనాంతమున కొక్కసారి యరుగు దేరా!
నిన్నుఁ గోరియున్నరమణిఁజేరదీయ రారా!
ప్రాణేశ! నిన్నుఁ జూడ కున్నఁ బ్రాణమేదురా!
హాహా! మదనుని, సుమబాణములకు, నా హృదయమ్ము దహించుఁజెలీ!

[అనిసోలిచెలి పైఁబడును.

కుంద—[స్వగతము] అన్నా! ఈసుందరి మనస్సు ఆదివ్యపురుషునియందే లగ్నమయియున్నదే? కడునసాధ్యము. [ఆమె

నుగౌఁగిలించి] చెలీ! సమాశ్వసిల్లుము సమాశ్వసిల్లుము. నీవుచెప్పిన రాజకుమారుఁడు తాళకేతుని దునుమాడక మరలిపోవఁడు. అయినను అతఁడెవ్వఁడోకనుం గొని నీయొద్దకుఁ దోడ్తెచ్చెదను. నీవుదీనికింతగా వగవనేల? ఊఱడిల్లుము. [అనుచు నామెను బైఁట చెంగుతో విసరును.

మద—[తేఱి] నేను నమ్మఁజాలను సఖీ! ఆమనోహరాంగునిమరలఁ గాంచెడి భాగ్యము నాయీపాపిష్ఠ నేత్రములకుఁ గలుగదు. అయ్యయ్యో! పాడులజ్జ! అతని ప్రియవచనములకు ఒక్కమాటయైన బదులాడకుండఁ జేసినది!

కుంద—ఏమి యధైర్యమే చెలీ! నీవట్లే అనుకొననేల? నిన్ను మోహించి అతఁడు మాత్రము విరాళినొందకుండునా?

మద—ఊరకుండుము. ఈమందభాగ్య కంతటిపుణ్యమా?

కుంద—[ఊర్ధ్వమవలోకించి] అప్పుడే ప్రొద్దు గ్రుంకు చున్నది. [చెలితో] మదనసాయకా! మనమిఁకఇంటికి మరలుదము. [పైకి నిరూపించి] చూడుము.

గీ. వచ్చు రజనీచరుండింక; * ముచ్చిలించు
నాదు వసు; విటఁ దడయంగ * రాదటంచుఁ
తనదు వసుకోటి యెల్ల గు * ప్తమ్ము చేసి
తరలు రవిసాంధుఁడిదె తత్ప * థమ్ముఁబాసి.

లెమ్ము పోవుదము. [అనిలేచును

మద—[లేచుచు బూర్వదిక్కుఁగని] చెలీ! ఆకసఁబడుచున్న

గ్ని మండలమేమియో చెప్పుము. అస్తమించుచున్న సూర్యుఁడా ?

కుండ—[దరహాసముతో, స్వగతము] ఓహో! చంద్రమండలమీమె కప్పుడే అహితమైనది. ఇదియు నొకవిరహతాప సూచకమే కదా? [ప్రకాశము] సఖియా! అదితూర్పు దిక్కు. మఱియు నతఁడు,

గీ. పాల్కడలి వెన్న; అమృతంపు * బావి; సకల
భువన హర్షాను సంధాయి * పువ్వుఁబోఁడి!
తలిరు విలుకాని చెలికాఁడ * తండు; మాకు
శీతకరుఁడు పో; నీకు ని * శాత కరుఁడు

రమ్మ రమ్మ. పోవుదము.

మద—చెలీ! అటులే.

[ఇర్వురు నిష్క్రమింతురు.

స్థలము—తపోవనము.

రంగము—గాలవమున్యాశ్రమము.

[గాలవమహర్షి ప్రవేశించును.]

గాల—[వ్యసనముతో] నేననుకొనినట్లే అయినది. యామినీచరులెల్లఁ గామరూపులే. వారలలో ఈతాళకేతు హతకుఁడు కడుజిత్తులమారి. అటుకానిచో ఋతధ్వజుని చంద్రహాసమింతకుముందే యితని కంఠరుధిరమును జవిఁగొనక యుం

డునా? ఇప్పుడైనను ఋతధ్వజుఁడు నాపనుపున మరల నాగలోకమునకుఁ బోయి అచట నేఁజెప్పిన అశ్వస్థుఁడను నాగరాజును సందర్శించును. అతఁడు దివ్యప్రభావుఁడును ఇతనితండ్రికిఁ బ్రాణమిత్రుఁడును కావునఁ దనదివ్యజ్ఞానశక్తిచే తాళకేతుఁడు దాఁగియున్న జాడ ఋతధ్వజునకుఁ జెప్పును. ఈ సింహకిశోరము ఆరక్షోమదేభమును దప్పక విదళించి యేతెంచును. ఇంతకుమించి కావలసినదేమి? కాని ఆరక్షోనాయకుని సౌధమున ఋతధ్వజుఁడు తానుజూచితినని చెప్పిన ఆచిన్నది ఎవ్వరో?

[అని యోజింపుచుండఁ దెరలో "నిఖిలలోకేశ్వరీ"! అనుధ్వని]

గాల—[తెరవంకఁగని] ఎవరో వచ్చుచున్నది? ఋషివేషధారియగు నొకగాయకుఁడు. నారదమునీంద్రులా?

[అంతఁ దుంబురుఁడు వీణ మీటుచుఁ బ్రవేశించును.]

(గేయము.)

1 నిఖిలలోకేశ్వరీ! నిత్యకళ్యాణి! నత
సుఖభుగిన మకుటరుచి * మండిత పదాంబురుహే!

2 శైలరాట్సుతే! సుహా * సౌఖ్య శాంతిప్రదా!
కాళీ! సద్భక్తజన * కల్పవల్లీ! శివా!

గాల—[వానింగని అచ్చెరువుతో, దనలో] అహో! నేఁడెట్టి సుదినము! తుంబురులరుదెంచిరే? ధన్యోస్మి ధన్యోస్మి! [ప్రకాశము] దేవవరాసీ! దయచేయుఁడు. ఈపీఠము నలంక

రింపుఁడు.

తుం—[ఆసీనుఁడగును]

గాల—మహాత్మా! తమరాకకుఁ గారణమేమి?

తుం—మునీశ్వరా! నాగలోకమునకుఁబోవు నుద్దేశముతో నేని ప్పుడు వచ్చుచున్నాఁడను. [కేతకీదళముదీసి వానిచేత నుంచి] దీనినిఁ గనుము.

గాల—["గురువర! ఏడనున్న" అనుపద్యముఁ జదివి తనలో] వియచ్చరులకు నాగలోక వాసమబ్బుటకుఁ గారణమేమి? త్రిలోకకంటకుఁడా తాళకేతుఁడు ఎవ్వరినైన బ్రుచ్చిలితో డ్తెచ్చి యుండవలెను. [ప్రకాశము] మహాత్మా! రక్షోజన కోలాహలముతో నిండియున్న నాగలోకమునకుఁ దామిట్టితఱి నరుగుచున్నారు.

తుం—అవును. ఎటులైనఁబోయి ఆలేకరి యెవరో తెలిసికొనవలెను. మఱియు,

మానినీ వృత్తము.

కావరమొప్ప నొకానొక నీచపుఁ * గర్బురుఁడెత్తుక పోయెను వి
శ్వావసుఁడన్ సఖు ముద్దులపట్టిని * సన్నుతగాత్రిని; జెప్పితినే
నే విధిగాఁజని యామె యుదంతము * నెట్టులొ తెత్తునటంచు; నిఁకం
బోవలె జాలము సేయక శేషుని * ప్రోలికిఁ; గార్యము లిట్టివి సూ.

గాల—[తనలో] ఋతధ్వజుఁడా హేమగృహమందుఁ గాంచిన కన్యామణి ఈమెయే కావలయును.

తుం—మునివర్యా! ఋతధ్వజుఁడను రాజకుమారుఁడు ఒక మహావీరుని సాయముచే రాక్షసులను సంహరించుచున్నాఁడని వింటిని. ఆమహర్షి నామంబేమి?

గాల—[తనలో] అయ్యో! ఈమహాత్ముఁడు నన్నెఱుఁగఁడు. [ప్రకాశము] మహాత్మా! గాలవుఁడు.

తుం—వానినిఁజూచుటకై ఈతపోవనవాటి కరుదెంచితిని. అతఁడెచ్చటనున్నవాఁడు?

గాల—[దరహాసముతో] మహాత్మా! తమసముఖముననే. నేనే గాలవుఁడను.

తుం—[అచ్చెరువుతో, కౌఁగిలించి] మహనీయా! క్షమింపుము. నేను తమ్ము నెన్నఁడునుం జూచియుండలేదు. ఇఁక నాకార్యములు ఫలించినట్లే.

గాల—మహాత్మా! మీదయకై కృతజ్ఞుఁడను. తాము భోగిపురి జేరునప్పటికి ఋతధ్వజుఁడు రక్షోనాయకుని దునుమాడును. రాక్షస నిర్మితమగు నొక హేమగృహమున దాముపదిం చిన కన్యామణి యుండనోపు.

తుం—సంతోషము సంతోషము. నేఁడు శుభసుదినము. ఇఁక నేను బోయివచ్చెద.

గాల—ఆమెను దోడ్కొని తాము మరల నొకసారి నాయాశ్రమమున కరుదేరఁ బ్రార్థించుచున్నాఁడను.

తుం—తప్పక-తప్పక తోడ్కొనివచ్చెదను. నేఁబోవుచున్నాఁడను.

[అని "నిఖిలలోకేశ్వరి!" అని పాడుచు నిష్క్రమించును.

గాల—[కొంతవడి నిలిచి, ఉత్సాహముతో] సెబాసు! బాగుగ నున్నది.

క. వే వచ్చు ఋతధ్వజుఁ డిపు
డే వానిఁ మనిమి; ఆమె * నితఁ డారసి తో
డ్తే వచ్చును; వారిని సం
భావించు విధమ్ము నాకు * స్పష్టంబాయెన్.

నాసంతోషము తక్కుఁగల మునిపుంగవుల కెఱింగింప వలెను. ఇదె పోయెద.

[అని నిష్క్రమించును.

స్థలము—నాగలోకము.

రంగము—అరణ్యము.

[తూర్యకేతుఁడు పథికవేషధారియై యొక గుహయెదుట నాసీనుఁడగును.]

తూర్య—ఈకుఱ్ఱఁడెవ్వఁడో మనుష్యమాత్రుఁడు కాఁడు. అయిన చోఁ ద్రిజగద్భ్రమణుఁడగు నాయన్నకు ఈగతియేల కల్గును? మునులందఱును ఇతనిని మర్త్యలోకేశ్వరుని పట్టియని అభినందింతురు. కాని యితఁడు వారల తపఃఫలంబనుకొనియెదను. [ఎడమకన్నదరుట సూచించి] ఓసీ వామనేత్రమా! అనుభవింప సిద్ధముగనున్న దుస్థితిని నీవు వెండియు సూచింపనేల? ఇఁక నీగండము తప్పుట బహుకష్టము. నాయన్నయు ధైర్యము దక్కియున్నవాఁడు. ఆసింహ

కిశోర మీగుహకు రాకుండునా?

[అంత ఋతధ్వజుఁడును, విశోకుఁడును బ్రవేశింతురు.]

తూర్య—ఇదె వచ్చినాఁడు. నేను విశ్రమించుట నభినయించెదను. [అని యట్లు సేయును.

విశో—[ఋత. తో] మిత్రమా! జనకుఁడు చెప్పిన అరణ్యమునకే మనమిప్పుడరుదెంచితిమి. [నిరూపించి] ఆకనఁబడునదియే తాళకేతుఁడు డాఁగియున్న మాయాగుహయనుకొందును. [వెండియు నిరూపించి] వయస్యా! కనుకనుమా గుహాద్వారము నొద్దఁ గావలియున్న మాయాపథికుని.

ఋత—ఈమాయావియే కాఁబోలు వాని తమ్ముఁడగు తూర్యకేతుఁడనువాఁడు?

విశో—సందియమేమి? జనకుఁడు మనకిట్లే కదా చెప్పెను? నీవతనిని వంచించి లోనికరిగితివేని అందు నిజరూపమున డాఁగియున్న తాళకేతుఁడు నీచేతఁ జచ్చినవాఁడే. మిత్రమా! నేను బోయెదను. నీవు కర్తవ్యము నడపుము.

[విశోకుఁడు నిష్క్రమించును.

ఋత—[తనలో] వీని నేయుపాయముచేనైన వంచింపవలయును. [తటిసి, ప్రకాశము] అయ్యా! మీరెవరు?

తూర్య—నేను బాటసారిని.

ఋత—మీదేశం బెద్ది?

తూర్య—నా దేశము కడుదూరమున నున్నది. మీకిచట నేమికా

వలయును?

ఋత—[చిఱునగవుతో] అయ్యా! నేఘను దూరదేశమునుండియే వచ్చుచున్నాడను. మిక్కిలి అలసితిని. మీతోడ నేనును శయనింపవచ్చునా?

తూర్య—వలదు వలదు. మీరు సుకుమారులగు రాజపుత్రులవలెఁ దోఁచుచున్నారు. మీరీ వనమున విశ్రమించుటకు అనువగుస్థలము నేను చూపింపఁగలను. నాతోడవత్తురా?

ఋత—వలదు. నాకయి మీరేల శ్రమపడవలయును? అయ్యా! మీప్రయాణ సామగ్రి ఈగుహాయందుంచితిరేమి?

తూర్య—[వెల్లఁబడి] లేదు లేదు. నాకును భయమగుచున్నది. ఇందొక దుష్టమృగమున్నటులు దోఁచుచున్నది. మన మిచట నిలువరాదు. పోదము పదండు.

[అని యతనినిఁ జేయిబట్టిలాఁగును.

ఋత—[చెయి విదల్చుకొని] అయినచో దానిని సంహరించి వచ్చెదను. మీరిచ్చటనే నిలుండు. [అని గుహలోని కరుగును.

తూర్య—రాక్షస కులమునకు అవసానకాలము దాఁపురించినది. పాపఫల మనుభవింపక తీఱునా?

ఉ. సాధుల సన్మునీశ్వరులఁ * జంపిన పాపము, మానికాంతలన్
బాధలఁబెట్టి బిట్టు చెఱ * పట్టిన పాపము, నెల్లరన్ మను
ష్యాధములంచుఁ జిత్రవధ * సల్పిన పాపము, రిత్తవోవునే?
సాధనమేమి? అన్న యమ * సన్నిధికేఁగుట సిద్ధ మిఙ్క్యెడన్

[అని యెలుఁగెత్తి]

అన్నా! చచ్చితివి. చచ్చితివి. [అని నిష్క్రమించును.

[గుహలోఁ గలకలము. ద్వంద్వయుద్ధ సంభ్రమము.]

ఋత—[రక్తసిక్తకరవాలముతోఁ బ్రవేశించి] ధూర్తుఁడు మడిసినాఁడు. ఇంతటితో రాక్షసధార్త్యము లంతరించినటులే. ఈయుదంతము గాలవ మునీంద్రుల కెఱింగింపవలయు.

[అని ససంభ్రమముగా నిష్క్రమించును.

స్థలము—మునుపటిదే.

రంగము—తాళకేతుని సౌధము.

[మదనసాయక ప్రవేశించును]

మద—నామనమున సంతోష విషాదములు పెనఁగొనియున్నవి.

గీ. క్రూరదైత్యుని మన్మన * శ్శోరుఁ డెలమిఁ
జంపె నని మది యెంతయు * సంభ్రమందు;
మఱియుఁ బనిదీఱునని తాను * మరలి పోవు
నో యటంచును దత్తఱ * మొందు మనము

దైత్యనాయకుఁడు సంహరింపఁబడుటకేమి? కుండల యనినట్లు మాకిప్పుడు దయామయుఁడగు అశ్వధ్వజుని సమాదరణము లభించుటే గొప్పశుభము. మఱియు, నేఁడదేమియో కాని,

గీ. సరవిఁ బెంపుడు చిల్కలు * శారికలును
బాడుచున్నవి వేడ్కతో; * భవనమందు
నిండు దోఁచెడు; మద్వామ * నేత్రమవరు
చున్న దిప్పు; డదేమి కా * నున్న దొకో?

కుండల—[దడ దడ ప్రవేశించి] ధన్యులము సఖి! మన జాబు ఫలించినది. తుంబురు లరుదెంచినారు.

మద—[అచ్చెరువుతో] నిజమే? ఏమిచిత్రము! వారెచ్చట?

కుం—[నిరూపించుచు] వీరే, కనుము.

[అంతఁ దుంబురుఁడు ప్రవేశించును.]

మద—[వినమ్రయై] గురువర్యా! నమస్కారము.

తుంబు—మీయమోఘ వచనము శీఘ్రముగానే సఫలమగుఁ గాక. మహానీయా! ఈపీఠము నలంకరింపుఁడు.

[తుంబురుఁడాసీనుఁడగును.

మద—[చెలితో] సఖి! వీరినిఁజూడ నాజనకుని జూచినట్లే యున్నది.

కుం—ఇతఁడు నీతలిదండ్రులను జూచియే వచ్చినాఁడు.

మద—[తుంబురు నుద్దేశించి] గురువర్యా! నాజననీ జనకులకు సేమమా?

తుం—అవును. వారుక్షేమముగానే యున్నారు.

మద—[బాష్పనయనయై] నన్నెప్పుడైనఁ దలంతురా?

తుం—బాలా! ఏమియిట్లనెదవు? నిన్నే తలఁచుకొనుచు అమిత శోకమున ఇర్వురును మూలపట్టినారు. ముఖ్యముగ నీ జనని,

గీ. తనకనుంగవ నీరు సం * ద్రమ్ము గాఁగ
మేను యానముగాఁ దాని * పైనిఁ దేలి
యాడెడుఁ; గడింది నిట్టూర్పు * లను తుపాను
గాలులకు నామె యేమి కాఁ * గలదొ యింక?

ఇంతలో మీరు పంపిన కమ్మ నందికొని వారికడకరిగితిని. నీతండ్రి దానింజూచి అనుగునఁ గుండల చిహ్నముండుటచే నీచెలికత్తె పంపెననియే ఊహించినాఁడు. మీసేమ మరసి వచ్చెదనని నేనిచ్చటికి వచ్చుచుండఁ దాళకేతుఁడు ఋతధ్వజుఁడను ఒక రాజకుమారునిచే మడిసెనను వృత్తాంతము త్రోవలో నాకర్ణించితిని. నేనిచ్చటికివచ్చి మీరిరువురును ఒక నాగరాజు సంరక్షణమున క్షేమముగ నున్నారను సంతోషపు వార్తయు వింటిని. అతని కుమారుఁడే నన్నిచ్చటికిఁ దోడ్కొని వచ్చినాఁడు. నాకన్నులు చల్లగ మిమ్ముల నిర్వురను జూడఁగల్గితిని. నాఆగమనము సఫలీకృతమైనది. నేఁడు కడు సుదినము.

మద—[తనలో] ఔరా! ఏమిపున్నెము! నిక్కముగఁ దాళకేతునిఁ జంపిన రాజకుమారుఁడు నేను జూచిన యతఁడే. [చెలితో] కుండలా! అసురనాయకునిఁ జంపిన ఆరాజకుమారుని వృత్తాంతము వీరినేల యడుగవు?

కుం—సఖీ! నీవుంచుము. నేనంతయు అప్పుడే తెలిసికొంటిని. నీకు వెనుకఁ జెప్పెదనులే.

మద—సఖీ! నీ యిష్టము.

తుం—బిడ్డలారా! మన మికఁ బ్రయాణమై మనలోకమునకుఁ బోవుదమా?

కుం—అట్లే యొనర్తము. కాని యీదినములలో మన మీలోకమును నిరపాయముగ దాఁటియేఁగఁగలమా?

తుం—ఏఁగకేమి? పుత్రీ!

గీ. త్రిభువనమ్ముల మును సంత * రించినట్టి
దైవతారాతి మాయాంధ * తమస మిపుడు
చండమూర్తి ఋతధ్వజా * ర్కుండు వొడమఁ
గచ్చువిచ్చురయ్యె; భయమేమి * కల్గు మనకు?

వినుము. మన మిచ్చటనుండి బయలుదేఱి మర్త్యలోకమున గాలవుఁడను నొక మహర్షి ఆశ్రమమున విడియుదము. సత్ప్రభావుఁడగు ఈ గాలవుఁడే తొల్లి ఋతధ్వజునకు మూఁడు లోకములు దాఁటఁగల "కువలయాశ్వము" ను సృజించి యిచ్చినాఁడు. ఇతఁడు మనల నెంతయు నాదరించును. వెనుక మనపురి కరుగవచ్చును. మన మిఁక బయలుదేఱుటయే కర్తవ్యము.

కుం—గురువరు నాజ్ఞ. అట్లేకానిండు. [తెరవంకఁగని] ఇదుగో అశ్వస్థుఁడు! మాపాలిఁటి భాగ్యదేవత!

[అంత నశ్వస్థుఁడు ప్రవేశించును.]

అశ్వ—[తుంబురు నుద్దేశించి] మహనీయా! నన్ను క్షమింపవలయును. నేను పూజాదీక్షనుండఁగాఁ దాము విచ్చేసినారని వింటిని. బిడ్డలనుఁ జూచుటకుఁ దాము అత్యాతురులై యుందురని మావిశోకునిఁ దమతోఁ బంపితిని. చూచితిరా మీబిడ్డలను?

తుం—చూడకేమి? నేఁటి కీభాగ్యము నీకరుణచేతనే కదా కల్గినది?

అశ్వ—కుండల పంపిన జాబు తమకందియుండునని తలంచెద

తుం—అదియే నన్ను ఈయెడకు రావించినది. అనితరసాధ్యమగు ఆపని అట్టి విషమదినములలో నీకుమారుఁడు పూనకున్న నాకీభాగ్య మెన్నఁడైనఁ గల్గునా? "పరోపకారార్థ మిదం శరీర" మ్మను ఆర్యోక్తినిఁ బాలించుటకే కాఁబోలు నీసత్కుటుంబ మవతరించినది?

అశ్వ—మహాత్మా! ఏమియిట్లందురు? విధియెవ్వరికైన ఆచరణీయము కదా?

తుం—మహోపకారులు ఇట్లే యందురు. కాని నాగాధిపా! నేఁడు మాసంతోషమునకు మేరలేదు. నీఋణమెవ్వరును దీర్పలేరు. వీరినినా వెంటఁ దోడ్కొనిపోవుటకిఁక ననుజ్ఞయేనా?

అశ్వ—మీబిడ్డలే కదా? నాయనుజ్ఞ కావలయునే? అవశ్యముగఁ దోడ్కొని పొండు.

కుం—అయ్యో? ఎట్లు పోఁగలుగుదుము? నీకు మే ముపకార

బద్ధులముగదా? ఇంతియకాక మాలోకమునకుఁ బోవు నుత్సాహముకంటె మిమ్మెట్లు విడిచి పోవుదుమను విచారమే మాకిపుడు మెండుగ నున్నది.

అశ్వ—విచారమేమి పుత్రీ! మరల శీఘ్రముగానే మనము కలయుదుము. ఆసన్న కళ్యాణయగు ఈ మదనసాయక మోమునఁ జక్రవర్తినీ చిహ్నములే చూపట్టుచున్నవి. ఋతధ్వజకుమారునకు ఈమె అర్ధాంగ లక్ష్మి కాఁగలదు. అపుడు వారిద్దఱును నామందిరముననె వధూవరులగుట దైవము వ్రాసిపెట్టినదియే.

కుం—[అపవారించి, మద. తో] వింటివా చెలీ! ఇతని అమోఘ వాక్యములను? అప్పుడు నే నేమంటిని?

మద—[అపవారించి, ఆమెతో] అబ్బా? నన్నేమి చెప్పుమందువు? నామనమున సంతోషపూర మిపుడు పొంగి పొరలి పాఱుచున్నది. నాకేమియుఁ దోఁచకున్నది.

తుం—[అశ్వస్థునితో] అయ్యా! నీ యాశీర్వచనమే తప్పక ఫలించునుగాక. నీకతన మాకందఱకుఁ గళ్యాణమయ్యెను. మాకింక నేమి కొదవ?

అశ్వ—ఇఁకనాలసింపనేల? మహాత్మా! నామందిరమునకు విచ్చేయుము. బిడ్డలిర్వురితోఁ దామునేఁడు నాయాతిథ్యము స్వీకరింపవలయును. నేఁడే మిమ్ముఁ బ్రయాణము చేయింతును. రండు. బిడ్డలారా! రండు. [అందఱు నిష్క్రమింతురు.

మదనసాయకము

తృతీయాంకము

స్థలము—తపోవనము.

రంగము—గాలవాశ్రమము.

గాల—[ప్రవేశించి] అహో! ఏమి నాభాగ్యము! కారణవశమ్మున నొక పర్వతగుహా గృహమందు ఒక్కుమ్మడిఁ జొచ్చిన రవిశశిరేఖల్వలె రాక్షసకులము నంతరింపఁజేసి వచ్చిన ప్రతాపశాలి ఋతధ్వజ రాజకుమారుఁడును, దానవధూర్త్యాలంబు పాలఁబడియుఁ గ్రొమ్మెఱుఁగు దేఱిన పైఁడిబొమ్మ నాఁబరగు సుగుణముల ప్రోవు మదనసాయకయు, నాయాకుటెంట వెలుఁగొందుచున్నారు. వారి దాంపత్యమెంత అనుకూలముగ నుండును. వారు వచ్చిననాఁట నుండియు నా నివాసము ఎలనవ్వులకును, చతురసంభాషణమ్ములకును, యౌవన విలసమ్ములకును, ఇరవైనది. ప్రేమము వెల్లి విరియునట్లు వారు నెఱపు క్రీగంటిచూపులును, అన్యాపదేశముగ వారొనరించు మనోహర భాషణమ్ములును నామనస్సున కెంతయు నిర్వృతిఁగూర్చుచున్నవి. మదనసాయక చక్కని మోమున మాత్రము దరహాస నిశ్వాస పరంపరలు ఎల్లప్పుడు దోఁచుచుండును. ప్రియునిఁ గనినపుడు దరహాసమును, జననీజనకులు

స్మృతికి వచ్చినప్పుడు నిశ్వాసమును గలుగ నోపు. ఆమె మోమున నొదవిన అవి రెండును వర్ణనాతీతములుగదా!

గీ. హాసమును బోల నైతిఁగా * యనుచు బిట్టు
వగచి యూర్చిన కరణి ని * శ్వాసమొదవు;
సుందరా స్యోద్భవం బయ్యు * సుడియుఁ గాలిఁ
గూడు నూర్పంచుఁ గేరు నాఁ * గులుకు నగవు.

రాకొమరుఁడు నాతో నేదేనిఁ బ్రసంగించుచున్నవేళ అతని కడగంటిచూపు వెన్నెలలను మదనసాయక దృక్చకోరములు తనివిదీఱఁగ్రోలుచుండును. అట్టితఱి దన నేమఱి చెలికత్తె కనినచో బిడియపడి ఆమె కొదలవంచును. పూజావేళను నాయొండనుండి మదనసాయక ఉపచారము లొనర్చుచుండు సమయమున ఋతధ్వజుఁడు చాటుననుండి నగుమొగముతో ఆమెనే కనిపెట్టుచుండును. అదినేను గంటినని అతనికిఁ దోఁచినచో నప్పుడె మెల్లనఁ దఱిసి నిజభావము మాటుపఱచుచు, “మహనీయా! నాకెపుడు పోవ ననుజ్ఞనిచ్చెద?” రని యడుగును. వారి వృత్తమీరీతి నున్నది. నిజముగా వారొండొరులు మోహించినారు. కావున నాకోర్కె నెఱవేఱుట మిగులఁ సులభము. మఱియు, వారిరువును, నాయాశ్రమమునకు వచ్చి అప్పుడే చాలదినములాయెను. ఇఁక వారి నిచట నట్టెయుంచఁజనదు. కర్తవ్యము నడపెదను. [అని కొంతవడి యూఁగి] మునులను సందర్శించి వచ్చెదమని ఋతధ్వజుఁడును, దుంబురుఁడును బోయి చాలతడవయ్యెను. పుష్పములు

గోసికొందుమని చెప్పి మదనసాయకయు, గుండలయు, బోయిరి. వారెవ్వరును యింతవఱకు రారైరి. ఇఁక వారికై నేనేపోవలయును. [ఊర్ధ్వమవలోకించి] అప్పుడే పొద్దుగ్రుంకుచున్నది. కావునఁ గాల్యకృత్యములు దీర్చికొనిపోయెదను.

[అని నిష్క్రమించును.

స్థలము—మునుపటిదే.

రంగము—వనాంతరము.

[ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత—ఔరా! అతిసాధువులగు ఈమునీశ్వరులకా అంతటి యగచాట్లుసంభవించెను? ఇప్పుడు వీరి సంతోష మేమనవచ్చును? తొల్లి రామునకు దండకారణ్యవాసులువలె వీరలు నేఁడు నాకొనర్చిన సత్కారమును, నాయెడఁజూపిన వాత్సల్యమును, నేను వర్ణింపఁజాలను. ఇట్టి పవిత్రమూర్తుల దర్శించుటచే నాజన్మము సఫలమైనది. సజ్జన సంతోషము అమృత తుల్యము గదా?

సీ. ఇతఁడు బాలుండయ్యు * ఋషి వర్గమున కేడు
గడయయ్యెనని సంబ్ర * పడు నొకండు
గర్వితాసుర మహా * కాదంబినీప్రభం
జనుఁ డహో! కనుఁడంచుఁ * జాటు నొకఁడు

శత్రుజిద్రాజేంద్ర * పుత్రుండు గోత్రభి
త్పుత్రుఁడయ్యెనని యు * ప్పొంగు నొకఁడు
ప్రాణమ్ములెటో గూటఁ * బడియె నేఁటికి వీని
చే మా కనుచు సంత * సించు నొకఁడు
ప్రేమ దొలుకంగ నన్నది * వించు నొకఁడు
వత్స! నావింప వగుమను * వాఁ డొకండు:
ఇట్టి సాధుల వర్ణన * మేరికైన
సకల శుభముల నొసఁగూర్పఁ * జాలదొక్కొ?

మఱియు నేఁడు తుంబురుఁడు వారికతిథియే అయ్యెను. [పరిక్రమించుచు] ఇది తపోవనాంతర్భముగదా? ఇచ్చటఁ గూడ అప్పుడే వసంతుఁడు ప్రవేశించినాఁడు.

గీ. మునికుమారులు నాటిన * పూవుఁజెట్లు
విరిసె నన్నియు; మావులఁ * బికచయమ్ము
రుతము లొగి నేచె: మలయ మా * రుతము వీచె;
వట్టిమ్రా నొక్కటియును గ * న్పట్ట దిందు.

[మరలఁబరిక్రమించుచు] సకలకుసుమ సౌరభమ్మును జూఱగొని అతి మందముగ వీచుచున్న ఈమలయానిలము నాశ్రమము నపనయించుచున్నది. కావున నిచటఁ గొంతతడవాఁగి గాలవాశ్రమమునకు మరలెదను. [నిరూపించి] ఇందొకవితర్ది కనఁబడు-

చున్నది. దీనిపై నాసీనుఁడనయ్యెద. [అని యట్లుచేసి, కొంతవడికి] ఆహా! మదనసాయకా! నీవు ఎంతచల్లని వేళజ్ఞప్తికి వచ్చితివే? నీవు నాకు లభింతువా? లభింపవు. నాయది వెడగుభ్రమయే. కాని గాలవుని విధముఁజూడ నాకు ఆసవదలకున్నది.

ఉ. పాపము ముగ్ధ నిక్కముగ * బాలిక; నెచ్చెలి యామె భావమున్
దోఁపఁగ నీయదేమియును; * దుంబురుఁ డాత్మపురంబుజేర నెం
తో పరితాపమున్ గొనుచు * నుండె; నతండును బోవు నింక; నా
తాపసివైఖరిన్ గనినఁ * దప్పయు వింతయె కొల్ప నద్దిరా!

తరుణీమణీ! నీయసమాన రూపరేఖా విలాసములు ఎన్నినాళ్ళుగనినను దనివిదీఱకున్నది. నిన్నువరింప కుంటెనేని నాజవ్వన మెందులకు? నిన్ను ఎన్నితడవలు గాంచితినో?

ఉ. సుందరి కేళికాసరసిఁ * జొచ్చి విహార మొనర్పఁ దమ్మి తూం
డ్లం దినువేడ్క నంచలు పొ * లంతుక బాహులడాసి వేసలిన్
ముంపఱఁ గాంచుటం జెదరి * పోవును మబ్బను భ్రాంతి; మచ్చెముల్
సందడి దక్కి యామె కను * లన్ సరి పోలమి డాఁగు నద్దునన్:

ఓహో! ఏమియామెబెళుకుంగనులకాంతి యుత్కర్షము!

సీ. చిమ్మచీఁకటి గల రేయి * చిగురుఁబోఁడి
బయట విహరించుతఱి నామె * నయనయుగళి
కొలుపు చంద్రికలోనఁబ * క్షులు రుతంబు
సేయుఁ గడచెఱు గాఁబోలు * రే యటంచు.

పుష్పములు గోసికొని కుండల నాకంటె ముందు బోయి నది. నేనే యూరక జాలముచేసితిని. [నిర్వర్ణించి] సంజప్రొద్దు కూడ అతిక్రమించును. కావున దడ దడఁ గొన్ని పూవులఁగోసి కొని మున్యాశ్రమమునకుఁబోవలయు.

[అని యట్లొనరించుచుండును.

ఋత—[తనలో] ఆహా! ఈమెయిపుడు ఒంటరిగానే యిచ్చట నున్నది. మఱియుఁ బువ్వులఁ గోసికొని వేగమే పోవును. నేనీమెతో సంభాషించుటకు ఇదియ సమయము.

[అని బయటకు వచ్చును.

మద—[వానిని గని, యొడి జాఱవిడిచి] ఏమిది? ఈమోహన మూర్తి యిచ్చటనున్నాఁడే? ఏమిచిత్రము! వీనిని గనిన నాతనువు కంపించుచుఁ జెమ్మటలూరుచున్నది. చెలియు ఆశ్రమమునకు మరలెను. ఇఁక నేనెటకేఁగుదును?

[అని యాపలవంచును.

ఋత—[దరహాసముతో] మరల ఈమెసిగ్గుఁగొనుచున్నది. కావున నేనీమెను జేరఁబోక కొంతవఱకు అన్యాపదేశముగ సంభాషించుటే కర్తవ్యము. [కోవెల నుద్దేశించి] ఓసీ పికమా! నీవాచెలితో ఇట్లు వచింపుము.

చ. బిడియపడంగరాదనుము; * ప్రీతి వహింపు మటంచుఁజెప్పు; మె
ప్పుడు చెలితోడ నొంటరిగ * ముచ్చట లాడెడి భాగ్యమబ్బు; నె

న్నఁడు తరళాక్షికిన్ గలుగు * నాపయిఁ బ్రేమయటంచు నాత్మ సం
పడి పడుచుంటినంచనుము; * ధర్మముకాదను మిట్లు సేయఁగన్.

మద—[స్వగతము] ఆహా! ఈ మోహనాకారునకు నాపైఁ బ్రేమ పెల్లిదముగ నున్నది. వీనికి నేనెట్లు బదులాడుదును? [అని కొంతవడికి] ఓ పికరాజమా! నీవిట్లు బదులు చెప్పుము.

చ. వెరవునఁ గ్రూరదైత్యు నొక * వ్రేటునఁ బీచమడంచి యెంతయుం
గరుణ మదీయ జీవములఁ * గాచిన వీరకుమారు నెన్నఁడున్
మఱువఁగఁ జాల నంచనుము; * నా యభివందనముల్ వచింపు; మె
త్తెఱఁగుననైన వానికి వి * ధేయ నటంచును జెప్పు మర్మిలిన్.

ఋత—[దరహాసముతోఁ దనలో] నిక్కముగ సుందరిరాగసక్త హృదయయే. అయిన వెండియుఁజూచెదఁగాక. [మరలఁబికము నుద్దేశించి] వనప్రియమా! నిజముగ నాసుందరి నాకు విధేయయేని,

గీ. మనసు దీఱఁగఁ దన తోడ * మాటలాడఁ
బూనితిన యె నిపుడు తొల్లి * తా నొనర్చి
నటులు సేయునో లేక సుం * తయినఁ బ్రేమ
గలిగిన విధమ్ముఁ జూపునో * తెలిసికొనుము.

మద—[తనలో] నాఁటినావర్తన మీసుందరమూర్తి మనస్సు నొప్పించినది. మఱియు నా ననుఁబ్రొయి పల్కులితని కేమి

రుచించును? అయ్యయ్యో! ఈపాటులజ్జ నన్నింకను వదలకున్నది. [ప్రకాశము] పక్షిరాజమా!

గీ. చతుర సంభాషణము సల్ప * నతని కపుడు
సరిగ బదులాడుటకె నేను * జాల నసుము;
నాఁటి నా వర్తనమును దాఁ * బాటిగొనక
నేఁడు దానికి నన్ను మ * న్నింపు మనుము.

ఋత—[తనలో] బాగుగనున్నది. ఇఁక నామెను జేరఁబోయెదఁ గాక. [అని సమీపించి] మనోహరాంగీ! బిడియపడకుము. తొల్లి తాళకేతుని ప్రాసాదమున నిన్ను గనిననాఁటనుండియు నామనము నీయందు లగ్నమైయున్నది. కాని నీవపుడు బేల వగుటచే నీతోసంభాషించుటకు అదను చిక్కుట లేదు మరల నాయదృష్టవశమున నీవుగాలవాశ్రమమున కరుదేర నిన్ను వెండియుఁగను భాగ్యము నాకబ్బెను. నీవిచటికి వచ్చిననాఁటనుండియు నీతో మంతనమున నెపుడు మాట్లాడుమనను కుతూహలముతో నున్నవాఁడను. అది నేఁటికిగ్గదా సమకూడెను? చెలీ! నీవు ఈదినములలోనాపై నెఱపుచున్న ప్రేమ దొలుకు చూపులును, భావగర్భిత దరహాసములును, ఎన్నఁటికైన మఱువఁగలనా? కాని ప్రేయసీ! ఇన్నిదినముల నుండియు,

గీ. కనుల సంభాషణమ్ము లే * కలిగె మనకు;
నాత్మ పరిరంభసౌఖ్యమే * యబ్బె మనకు;

ఇపుడు సరసోక్తులకు సెల * వీయ వలయు
నింపు మీఱంగ ననుఁ గౌఁగి * లింప వలయు.

[అనియాశ్లిష్టమభినయించును.

మద—[ఇంచుక వారింపుచు, దనలో] అయ్యో! నేనేమనుదానను? మోహము ఎదుటకు వచ్చిన సంభ్రమము గొల్పుచున్నదే? నాకేమియుఁ దోఁచదు. [ప్రకాశము] ఆర్యా! నీవు నాకుభయత్రాతవుగదా? నిన్ను నేమోహింపవచ్చునా?

ఋత—అహా! ఏమి యిట్లందువు? తరుణీమణీ!

గీ. ఆర్తలగు తరుణులు తమ * యార్తి దీర్చు
నట్టి పురుషులఁ దొలిఁ బెండ్లి * యాడలేదొ?
నాఁడు తనుఁ గోరిన యయాతి * తోడ, "బ్రోచి
తీవు; నా తండ్రి" వనియెనే * దేవయాని?

మద—పోనిమ్ము. దేవతాంగనలను మర్త్యులు మోహింతురా?

ఋత—సుందరీ! ఇట్లు వాదింపఁజొచ్చితివేమి? నిన్ను నేను మోహింపఁగూడదా? మీ దేవతాంగనలు మర్త్యులను వలచినఁ దప్పిదములేదో?

గీ. ఎట్టు లూర్వశి తొల్లి మో * హించెఁ గ్రీడి?
నెటులు మేనక వలచె నా * జటిల వర్యు?
నిట్టి పనులను దేవత * లెన్నియేనిఁ
జేయ వచ్చునొ? నరు లట్లు * సేయరాదొ?

ఇంతియకాక,

గీ. దేవతా కన్యనంట కంసు * కావరమున
దైత్యుఁ డంట కొనిపోయెఁ బా * తాళమునకు;
వాని నేఁ జంపి చెలిఁ గొని * వచ్చితి నంట:
ఆమె యిట్లను నంట: హా! * యేమి వింత!

మద—[స్వగతము] హా! ఏమి నా వెడగుఁదనము! ఆర్యపుత్రుని మోహించియు, మోహింపనటులు వ్యర్థ వాదముసేయుచు అతనిని జిన్నవుచ్చుచుంటినే? మఱియు, ఇతని చతురోక్తులు నామదికి విహ్వలత గొలుపుచున్నవి. ఇపుడు చెలియైన నాపజ్జనుండిన నాహృదయ మార్యపుత్రుని కెఱింగించునేమో? కానిమ్ము. ఇట్లనెదనుగాక. [ప్రకాశము] ఆర్యపుత్రా! నాయవివేకపుఁ బల్కులు మన్నింపుము. నీకు విధేయనంటినిగదా? ఇంతకును,

గీ. నన్నెపుడు నేమఱక తన * కన్నపుత్రి
లాగు కనుచున్న సకియుఁ, గా * లవుఁడు, మాకు
గురువరుఁడు దేవమాని తుం * బురునిఁ దొట్టి
పెద్ద లున్నారు; వారి య * భీష్ట మేమొ?

రుత—[స్వ] "ఆర్యపుత్రా!" అనుచున్నది. ఈమెకు నాపై ననురాగమున్నదనుట నిస్సందేహము. కాని మిగుల లజ్జావతియు, గోమలహృదయయు, అగుటచే దనమనస్సును ఇంతను

దాఁచిపుచ్చుచున్నది. [ప్రకాశము] ప్రేయసీ! నీమాటలు నాకెంతయు దురవగాహముగానున్నవి. జ్ఞానవంతులమగు మన మనోభీష్టముల సంసిద్ధికిఁ బెద్దలసాధనమేల?

గీ. ఒండొరుల నాత్మఁ బ్రేమించి * యున్నవారు
తమ్ము దామె వరింత్రు; పె * ద్దలకుఁ దమ య
భీష్టములు ముందు దెలుపరు; * వినవొ సకియ!
పెద్ద లీ కొంట బొమ్మల * పెండ్లికైన?

పేశలాంగీ! కొఱగాని ప్రసంగములతో నన్నిట్లనాదరణచేసి మరుబారి కప్పగింతువా? ఇది నీకుఁ బాడియా? ఇఁక నే నెట్లు తాళుదును?

చ. తివిరి మనోజుఁ డేయు నతి * తీవ్రశరమ్ముల సైఁపఁజాల కే
నువిదరో! నీదుప్రాపుఁ గొని * యుండఁగ నయ్యయొ! ఇప్డు నీ కనుం
గవ నునుఁజూపుటమ్ము లధి * కమ్ముగఁ జిచ్చువితాన నన్ని వే
కవిసి దహించు; మర్త్యుఁడను * గావున నే మనఁజాలఁ; బ్రోవుమా.

(గేయము)

తరుణిరో! స్మరశర, ధాటికి ధైర్యము, * దక్కె నిదే నీపాల్పడితిఁగా;
శరణాగత ర, క్షణమును నీ వికఁ * సల్పక తీఱదుసుమ్ము సఖీ!

మద—

బాలిక నేఁ గడు, గోలను నీ విటు * పల్కుట పాడియె? రాజసుతా!
వీలా నన్నిటు వేఁడెదు? నీ కొక * హిత మొనరింపఁగ జాలుదునే?

ఋత—

కులుకుచు బిగి కౌఁగిలి నా * కొసఁగుము చెలియ! తనూతాపంబారన్
చలమూనక యధరామృత మిడి నా * స్మరదాహమ్మును దీర్పఁగదే.

మద—

వేశ్యాజనములకుఁ బాల్పడితినో * బాలిక నంచు నెఱుంగవో కో?
చాలుఁజాలు నీ చెయ్వులు; నీతో * సంభాషించుటె నేరముపో.

ఋత—[వ్యసనముతో] హా! ఎంతపని చేసితిని! నాయనుతాపములో నీమెముద్దరాలను మాటయే మఱచితిని. కావున ఈమెమరలఁ దనప్రాంతదారియే త్రొక్కుచున్నది. అయ్యో! నేనెంత వివేకహీనుఁడను! మరలఁ జెలి యెట్లు సమాహితయగును? ఈమెహృదయము నెండియు నెవ్వఁడు రాగసిక్తమై సహజకోమలత్వమును బ్రకటించును? అంతదనుక ఈ విరాళి నెట్లు సహింతును? ఇఁకనాకేమి మార్గము?

క. మనవైరులఁ గొగఁటార్చితి;
మునమే కూర్చినిఁ గడంగి * ముజ్జగముల; కీ
సుదతికి నైనే నిపుడా
మదనుని చేఁ జిక్కి యింక * మ్రందఁగ వలసెన్.

[అని విన్నవోవును.

మద—[తనలో] అయ్యో! ఈపాడుచెవులు ఎట్టిమాటలను వి

నుచున్నవి! నేనెందు కార్యపుత్రుని నోనాడితిని? నే నెంతకఠిన హృదయను? ఆర్యపుత్రుని పరిదేవన మెట్లు చూడ సహింతును?

ఋత—[వగచుచు] నాధైర్యము శీర్ణమై మానమున దీనభావమే పొడముచున్నది. పచ్చవిల్తుఁడు పెచ్చువెఱిగి నన్ను వ్రేల్మిడిలో నిర్జింపఁ జూచుచున్నాఁడు. ఇఁక నామొఱకుని బారి వలన నన్నెవరు రక్షింపఁగలరు? ప్రేయసితక్క? [ప్రకాశము]

గీ. కలికి! నిను నాఁడు చెనఁటిర * క్కసుని వలనఁ
గాచితిని గానో? నీ వెఱుం * గవో కో? దాని
కిపుడు ప్రత్యుపకృతిగ న * న్నీ స్మరాఖ్య
కర్బురుని వాతఁ బడ కుండఁ * గావరాదె?

మద—ఆర్యపుత్రుని దీనాలాపంబులు నేనిఁక వినఁజాలను. నాకనుల నీరు గ్రమ్ముచున్నది. ఇదియంతయు ననుఁ గూర్చియే కదా? ఇఁక నేవతనినిఁ జేరఁబోవక మానను [అని దడదడపోయి వానిహస్తముపట్టి]

గీ. రమణ! మ్రొక్కెద నా దుండ * గము క్షమింపు
మిన్నినాళ్లుగ నీకయి * యెటులు నే న
లరిగితినో యది దైవ మె * ఱుంగు; నింక
నేను నీ దాన; నీ పాద * మాన సుమ్ము.

ప్రియా! సమాశ్వసిల్లుము. నన్నుఁ గైకొనుము.

[అని కౌఁగిలించును

ఋత — [సంతోషముతోఁ, దనలో] ఆహా? ఏమినాభాగ్యము? [ప్రకాశము] మోహనాంగీ? నీదయకు నేఁగృతజ్ఞుఁడను. నా యనుతాపము దీర్చితివి. నన్నుధన్యునిఁ జేసితివి. నేఁటికి గదా. నాయభీష్టమునెఱవేఱెను. నిన్నిదే కైకొంటిని. రమ్ము రమ్ము. నన్ను మరల బిగియారఁగౌఁగిలింపుము.

[ఒండొరులు కౌఁగిలింతురు.

ఋత — [కొంతవడికి] మనోహారిణీ? మనము ఎటకేనిఁ బోవుదమా?

మద — ప్రియా? ఎచటికిఁ బోఁగలము గాలవాశ్రమమునకుఁదప్ప? ఇంతియకాక ప్రొద్దుగూడఁగ్రుంకుచున్నది. కాని ఈవసంతసమయమున ఈ వనాంతరమెంతరమణీయముగ నున్నదో చూచితే? కావున మనము ఇచటనేఁ గొంతతడవుండి ఈ వసంతశోభను దిలకింతమా?

ఋత — అటులేకానిమ్ము. [వారిరువురు పరిక్రమింతురు.

మద — [ఒకవంక నిరూపించుచు] అబ్బా! ఈపొదరింట నెన్ని శారికలున్నవి! ఆర్యపుత్రా! ఇచటి శారికల కలకలము వింటివే?

ఋత — [దరహాసముతో] బాలా! నీవు గోలవే అయ్యదికలకల-మూదువా! శారిక లేమనుచున్నవో నీకుఁ దెలియదా?

క. గాటపు మోహముచే స్మర
ధాటికి లోఁబడిన నూత్న * దంపతు లిపుడీ
తోఁటకు వచ్చిరి; పెండిలి
పాటలు పాడంగ వలయుఁ * బదరే యనెడిన్.

మద — [మరలఁ బరిక్రమించి] మనోహరా! కనుము కనుమా పిక దంపతులక్రీడ!

గీ. అల్ల ననిచిన చంపక * వల్లిపైని
విడిసి యతి మందగతి నిప్డు * వీచు చల్ల
గాలి లత నూఁపఁగాఁ గెంపు * కంటి జంట
రాగ మెసలార నుయ్యాల * లూఁగు నహహా!

ఋత — చెలీ! నీయంతఃపురములో బంగారు తూఁగుటుయ్యేలలలో మనమెట్లు క్రీడింపవలయునో ఇప్పుడీ పికరాజములు మనకు నేర్పుచున్నవి. నేర్చికొందము రమ్ము. వానినొకింతఁ దఱియుదము. [అనియామెను లాగును.

మద — [వ్రీడాదరహాసములతో నిరాకరించుచు] ఆర్యపుత్రా! వేఱొకచక్కి కరుగుదము. ఇచటి వింతల నరసితిమి గదా? [ఇరువురు పరిక్రమింతురు. మద.] ప్రియా! ఇచటి కోలాహలమేమి? నామది దిగులుచెందుచున్నది.

ఋత — [చిఱునగవుతో] భయంపడకుము చెలీ! ఇది తుమ్మెదలఝుంకారముగాని మఱియొకటికాదు. పూవులు ఈతావు

నఁ గుప్పతెప్పలుగ నుండుటచే వానియందల తేనెఁద్రావుచున్న మదాళులు ఇందు కదుపులు కదుపులుగ నుండి గానము సేయుచున్నవి.

మద—ఇదియు నొకగానమే?

ఋత—[దరహాసముతో] కాకేమి? ఇయ్యది,

గీ. మధువు గొని కొని కనకంపు * విధము మఱచి
యొల్ల కొమ్మలఁ దా మాత్ర * యింపు చొండొ
రుల నెగిచి కొంచు మధుపాన * బలముఁ జూపు
మధుప సంతతి సంగీతి; * మందయాన!

మద—ప్రాణేశ్వరా! ఈ మధుపగానము నాకువలదు. ఇంకొకయెడకేఁగుదము. [అనిపరిక్రమించి] ఆహాహా! ఇచ్చటి పూవుంగుత్తులు ఎంతమనోహరముగ నున్నవి? [నిరూపించి] ఆర్యపుత్రా! ఈమంజరిని గల సుమముల కూర్పు గంటివే?

గీ. పువుల నన్యోన్య మొక కొన్ని * కవుఁగిలించు;
గొన్ని యొండొంటి ముద్దులు * గొనెడి; నెలమిఁ
జార్చుఁ గొని మరంద బా * ష్పముల నొర!
విరులు దెల్పెడు నూతన * ప్రియుల సరణి!

ఋత—[దరహాసముతో] జీవితేశ్వరీ! నీవు క్రమముగఁ బ్రోడవ

గుచున్నావులే. ఇప్పుడు వసంతునిచే నలంకరింపఁ బడిన ఈవనసుందరి యొయ్యారము వర్ణింపఁగలవా?

మద—[సిగ్గుఁగొని యూరకుండును.]

ఋత—రారమ్ము. వర్ణింపుదము. [అనియట్లుసేయుదురు.

(గేయము.)

ఆహాహా! వనకామిని మనో, భవశరనిధి యగుటఁ గడుఁ
బ్రియమునఁ జను, దేరదు నిదే, గౌరవమునై, పురుషతిలక సహితయై
కుంద రదన - కుసుమహాసన
కోకిల వాణి - మయూర విలసన
భ్రమర చికుర - పల్లవాధర
మంజులాంగి - సుకుమారియునై
చెలువు గుల్కుచు - వలపు లొల్కుచు
నాడుచుఁ బాడుచుఁ
దారుచుఁ గేరుచు॥ ఆ॥

ఋత—ప్రాణేశ్వరీ! వనవిహారము సల్పి మనమిద్దరము మిగుల డస్సితిమి. కావున, ఈవేదికపైఁ గూర్చుండి శ్రమదీర్చుకొందము రమ్ము.

[ఇద్దరును వేదికపైఁ గూర్చుండుదురు.

[అంతఁ జంద్రోదయమగును.]

ఋత—కనుము ప్రేయసీ! మింటఁజందురుఁడు ఎంతస్వచ్ఛముగ వెలుఁగుచున్నాఁడో? వెండిపూఁత పూసినట్టులు ఈవృక్షాగ్రములపై అతని కరము లెంత దట్టముగఁ బ్రసరించి యున్నది! మఱియు నిపుడు కమ్మని చల్లగాలి ఇచటి పూవుంజెట్ల నొరసి వీచుచున్నను వాని దొక యాకైన నల్లాడుటలేదు. ఆహా! ఈరేయి ఎంతకమనీయముగను, సుఖప్రదముగను, ఉన్నది!

గీ. ఇట్టి రాతిరి ప్రియునికై * యెరియుచున్న
యా వరూధిని పూఁచిన * మావి క్రింద
నిలిచి వీడిన నిడుద వే * నలి మొగానఁ
జేర్చి కుందుచు నిశ్వసిం * చెనని తలఁతు.

మద—

గీ. ఇట్టిరేయి సఖీజన * మెల్ల గొలువఁ
బ్రమద వనమున నొక విరి * పాన్పుఁ జేరి
రాజహంసము నా కల * రాజ హంసుఁ
గూర్చి తెపుడంచు దమయంతి * గుందకున్నె?

ఋత—

గీ. ఇట్టి రాతిరి చిత్రాంగి * యట్టె వచ్చి
పిట్ట నడిగెడు నల రాచ * పట్టిఁ గాంచి

బిట్టు వలచుడు నతఁడు చే * పట్టకున్న
బిట్టు వగచెడు శశికాంత * కుట్టిమమున.

మద—

గీ. ఇట్టిరేయి విరహతాప * మెసక మెసఁగఁ
జలువరా తిన్నెపైఁ జేరి * సకిని గాంచి
స్వప్నమునఁ దాను గాంచిన * సరస వరునిఁ
దోడి తెమ్మని యుష చాల * వేఁడియుండు.

ఋత—[దరహాసముతో]

ఉత్సాహము. ఇట్టి రేయిఁ దన వయస్య * నేమఱించిపో మనం
బిట్టలట్టె చలింపఁ దోఁట * కేఁగుదెంచి యాత్మలో
గుట్టు దాఁపలేక మునిని * కోల యీ ఋతధ్వజుం
జెట్ట పట్టెనంట! ఈ వి * చిత్రముం దలంపరే?

మద—[దరహాసముతో]

ఉత్సాహము: ఇట్టిరేయి నొక్కబోఁటి * హృదయమీ ఋతధ్వజుం
డట్టె చూఱకొంచుఁ బెండ్లి * యాడుమంచు నామెఁదా
బిట్టు ప్రేమడించినట్టు * వేసముల్ ధరించి హా!
ఎట్టకేల కియ్యకొల్పె; * నింక నేమి సేయునో?

[గాలవుఁడు ప్రవేశించి వారున్నస్థితి నూహించి చాటున నిలుచును.]

ఋత—[ఆమెను ముద్దుగొని] ప్రాణేశ్వరీ! అట్లనకుము. ఆ జాబిల్లిసాక్షిగ నిన్నే వలచియున్నాఁడను.

మద—[దరహాసముతో] నిలుకడలేని ఆజాబిల్లియా నీవలపునకు సాక్షి? అతనికివలెనే నీవలపునకుఁగూడ వృద్ధిక్షయము లున్నవో?

ఋత—క్షమింపుము సఖీ! నీవెట్లుప్రమాణము చేయుమన్న అట్లే చేయుదును.

మద—[నిర్వర్ణించి] ఆర్యపుత్రా! ఎవరో యిటువచ్చుచున్నారు.

[అని లేచును. ఋతధ్వజుఁడు నిర్వర్ణించును.

[అంత గాలవుఁడు వెలికి వచ్చును.]

గాల—[అచ్చెరువుతో, స్వగతము] ఏమిది? నాబిడ్డలు ఇప్పుడే గాంధర్వవిధిని వరించిన నూత్న దంపతులవలెఁ దోఁచుచున్నారే? నాయభీష్టమును ఇట్టిదియేకదా? ఆహా! నేఁడు నానేత్రముల కెంతటి మహాపర్వము సమకూడినది! [వారిని దఱియుచు, ప్రకాశము] వత్సలారా! మీకై నేనెంత వేచియుండినను మీరు రాకుండుటచే ఏమియుఁ దోఁచక నేనే మిమ్ములను వెదకికొంచు వచ్చినాఁడను. వచ్చినందుకు నాకనుల కిజవ్రదీఱినట్లు మిమ్ముల నిర్వురను ఒకయెడనే కనుఁగొనఁ జాలితిని. మీయన్యోన్యానురాగ మింతకు ముందే యెఱింగి మీదాంపత్యమునే నేను యోజింపు

చుండ మీయభీష్టము దీర్చుకొనుచు నాయభీష్టసిద్ధియు సాధించితిరి. అయిననేమి? రండు రండు.

[అని యిరువురల కేళ్లుపట్టి]

ఉ. అండజయాన తా వలచె * నంగజసన్నిభమూర్తియైన భూ
మండలనాయకాత్మజుని; * మానిని నెంతయుఁ బ్రేముడించె నీ
తండు నయారె! వీరల య * థావిధి పెండిలి యింతలోనఁ గ
న్పండువుగాఁగఁ జూడఁగల * భాగ్యము నాకు లభింప కుండునే?

ఇర్వురు—[గాలవునకు నమస్కరింతురు.]

గాల—కళ్యాణము కళ్యాణము బిడ్డలారా! మీకు అనంతకళ్యాణ మగుఁగాక. రేయి మట్టుమీఱుచున్నది. రండు. మన ఆశ్రమమునకు మరలుదము.

ఇర్వురు—మహాప్రసాదము.

[అందఱు నిష్క్రమింతురు.

మదన సాయకము

చతుర్థాంకము.

స్థలము—తపోవనము.

రంగము—వనాంతికము.

[మునివేషధారియై తూర్యకేతుఁడు శిష్యవర్గముతోఁ బ్రవేశించును.]

(గేయము.)

దినమణితేజ! మహా, తపోధన!

1 నిర్జిత హృదయ జ * నిత షడ్రిపుగణ!
ధూర్జటి సన్నిభ! * దురిత విదారణ!॥ ది॥

2 సంతత వేద వి * చారణ చణమతి!
చింతా తంతు * చ్ఛేదన నిరతి!॥ ది॥

3 విశ్వజన సుసే * విత పద! సదయా!
శాశ్వత పదవీ * సంస్థిత హృదయా!॥ ది॥

తూర్య—[తన్ను దాఁజూచుకొని] వేసము బాగుగ నమరినది. కుఱ్ఱలు మునికుమారులను లెస్సగ ననుకరించుచున్నారు. [నిరూపించుచు] ఈ పర్ణశాలయు యథోచితముగ నున్నది. లోపము ఎందును గానరాదు. కాని ఈ కపటవేష మెందులకు ధరించినట్లు? అన్నను జంపిన ఋతధ్వజరాజ

కుమారునిఁ గన్నొఱంగుటకుఁ గదా? అది యెట్లు సాధ్యమగును? కాకేమి? అతఁడెంత వాఁడైనను మాయోపాయమునకు లోఁగకుండునా? నాయన్న ఆమిషమగు ఆ గంధర్వ కన్యను మాకులము సంతరింపఁ జేసినందులకుఁ గానుకగా ఋతధ్వజునకు గాలవుఁ డొసంగెనఁట. వారిరువురును వధూవరులై అయోధ్య జేరుకొనిరఁట. కాని ఋతధ్వజుఁడు గాలవమునిదర్శనార్థము మరలఁ జనుదెంచునని ఆకర్ణించితిని. అది నిశ్చయమేని నా ఆకుటెంటికతఁడు రాకుండ గాలవ మున్యాశ్రమమునకుం బోఁజాలఁడు. కావున, అతఁడు వచ్చువఱకును నేను ఇచటనే తాపసవృత్తితో వేచియుండెద. అతనిపైఁ గలకసిదీర్చుకొనుటకు మేటి యుపాయ మొకటి యున్నది. మీఁదెట్లుండిన నుండనిమ్ము. కార్యము బహు జాగరూకతతో నిర్వర్తింపుదును గాక. [శిష్యుల నుద్దేశించి] ఛాత్రులారా! మీ పాఠమును మగుడ వల్లెవేయుఁడు.

శిష్యులు—చిత్తము.

[అని పైగేయమును మరలఁ బాడుదురు.

తూర్య—మంచిది. మనమందఱము ఇచటఁ గూర్చుండి తపోనిష్ఠ నభినయింతము రండు.

[అందఱట్లు సేయుదురు.

తూర్య—[కొంతవడికి లేచి, నిర్వర్ణించి] ఓహో! ఏమిది?

ఋతధ్వజుఁడు ఇప్పుడే వచ్చుచున్నాఁడే? రానిమ్ము రానిమ్ము. నాచిత్తము చలింపదు. వానిని ఉచితరీతిని గారవించెద.

[అని కూర్చుండును.

శిష్యులు—[కొందఱు నిర్వర్ణించి, లేచి] దేవా! మాకు భయమగుచున్నది. మమ్ముఁ బంపివేయుఁడు.

తూర్య—[కసలుచు] ఛీ నిర్భాగ్యులారా! కూర్చుండుఁడు కూర్చుండుఁడు. మీలో నెవఁడు మాటాడినను వాని నుఱుము చేసెద.

[అంపఱు దపము నటించుచుందురు.

[అంత ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత—[అలసట నభినయించుచు] అబ్బబ్బా! ఈ ప్రయాణశ్రమము ఎంత దుర్భరముగ నున్నది! మానగరమునకు అనతిదూరమున నుండెడి గాలవాశ్రమము ఇప్పుడతి దూరమగుట రాక్షసుల కతముననే కదా? మఱియు, అది యింకను దవ్వులనే యున్నది. కావున నేఁడిచట శ్రమదీర్చుకొని మరలఁ బ్రయాణము సాగింతును. [నిర్వర్ణించి] ఇది తపోవనాంతికము గదా! ఇచట ఈ మున్యాశ్రమ ముండుట నా యదృష్టమే. మునియు ఛాత్రాన్వితుఁడై యోగనిద్ర నున్నవాఁడు. వానినెట్లు సమీపింతును?

[అని వానిచెంత నిలుచును.

తూర్య—[తెలివి నభినయించి, శివస్మరణచేసి, చూచి, లేచుచు] ఏమిది? ఋతధ్వజుఁడా? ఇతఁడు ఋతధ్వజుఁడేనా? హా! ఏమిభాగ్యము! రాజకుమారా? రమ్ము రమ్ము. నీకు స్వాగతమే? [అని వానిని జేరఁదివియుచు]

గీ. స్వాగతమె రాక్షసేభ హ * ర్యక్షమునకు?
స్వాగతమె మాని హృత్సరో * జాత రవికి?
స్వాగతమె శిష్టరక్షణో * ద్యోగ రతికి?
స్వాగతమె శత్రుజిద్భూమి * పతి సుతునకు?

వత్సా! గారమ్ము. ఇచట సుఖాసీనుఁడవు కమ్ము. [అందఱు గూర్చుండిన వెనుక] వత్సా! మమ్ముల నందఱను మరలఁ జూడ నీకు మనసు పుట్టెనే? అధీశ్వరుఁడు సేమముగా నున్నవాఁడే?

ఋత—మహానీయా! తమదయచే మాకందఱకుఁ గుశలము.

తూర్య—సంతోషము సంతోషము. కుమారా! నీ యాగమన ప్రయోజనము వినఁగోరుచున్నాఁడను.

ఋత—మౌనీంద్రా! గాలవాశ్రమమునకుఁ బోవుచు ఇచటకి వచ్చితిని. నాయథావిధి వివాహమునకు ఆ మునిపుంగవుఁడు చనుదెంచును. కాని నేను అతనిని స్వయముగఁ బిలువవలెనని తొల్లి యతఁడాజ్ఞాపించె. జనకుని పంపున నేనిపుడతనినిఁ బిలువఁ బోవుచున్నాను.

తూర్య—[సంతోషము సూచించుచు] ఓహో! ఋతధ్వజ రాజకుమారుఁడు గంధర్వకన్యను జెట్టపట్టనున్నాఁడా? ఏమి పున్నెమేమిపున్నెము! వత్సా! తొల్లినీవు సభార్యుఁడవై గాలవ మునీంద్రుని ఆశ్రమమునుండి వెడలు నవుడు నేను అచటినుండియును మిమ్ములను అభినందింపనైతిని. నేఁడు నిన్నుఁ జూచుటచే నాకనులకఱవుదీఱె.

ఋత—మునివర్యా! తాము ఈవనాంతికమున ఆశ్రమమునిర్మించుటకుఁ గారణమేమి?

తూర్య—[స్వగతము] అన్నా! చిక్కుతటస్థింపదుగదా? ధైర్యమా! నన్నెడఁబాయకుము. [ప్రకాశము] ఏమిచెప్పుదును తొల్లి రాక్షసులు చెలరేఁగి ఆయాతపోవనంబులంగల నాబోంట్లను గాఱియ వెట్టుచుండిన దినములలో నేను నా శిష్యబృందముతో ఎటకేనిఁ బోవుదునని ప్రాణములు బిడికిటఁబెట్టుకొని ఇచటికి వచ్చునప్పటికి నీబాహువప్రగుప్తి మాకు సమకూడెను. అయినను నాఁటనుండియు నేనిచటనే ఒకపర్ణగృహము నిలుపుకొని కాలము గడపుచున్నాఁడను. ఇప్పుడిప్పుడే కదా తపోవనములు యథాస్థితి నున్నవి? కాని కుమారా! నేఁడు నీవు నాకు అతిథివిసుమా? నీవిపుడెట్లును గాలవాశ్రమమునకుఁ బోవంజాలవు.

ఋత—మహాత్మా! అటులేకానిండు. ఇచటికి గాలవాశ్రమము ఎంతదూరముండును?

తూర్య—క్రోశద్వయమునకుఁబైగా నుండును. నేనుతఱచుగా ఆమునికడకుఁ బోయివచ్చుచుందును. కాని నీవిచటఁ గొంతవడి విశ్రమించినచో అనాయాసముగ బోఁగలుగుదువు. నేనును గాలోచితములఁ దీర్చి యిప్పుడేవచ్చెదను. మనమారగింతము. [శిష్యులనుద్దేశించి] వటువులారా! మీరు వైశమ పోయి రుచ్యములగు కందమూలఫలమ్ములు సమృద్ధముగఁగొనితెండు. నేఁడొక రాజనందనుఁడు మనకు విందయ్యెఁ గదా?

శిష్యులు—చిత్తము దేవా! [అని నిష్క్రమింతురు.

తూర్య—వత్సా! నాయభీష్టమొకటి నీవు దీర్పవలయు.

ఋత—తప్పక నెఱవేర్చెదను. అదేమియో ఆనతిండు.

తూర్య—వత్సా! వరుణ జపము చేయుదునని నేను ఎన్నినాళ్ళనుండియో ప్రయత్నించుచున్నాఁడను. కాని నేఁటివఱకది నెఱవేఱదయ్యె. ఏమియన, దదాచరణమునకుముందు స్నానాదిక్రియలు శూన్యకంధరముతోఁ జేయరాదు. మాబోంటి తాపసులకుఁ గంఠహారములు లభింపవుగదా? నేఁడు నీవిచటి కరుదెంచుటచే ఆజపమొనర్పవలెనని మనము కుతూహలపడుచున్నది. కావున నీగ్రీవమందలి మౌక్తికహారమొకసారి నాకొసంగుదేని సఫలమనోరథుండనయ్యెద.

ఋత—భాగ్యమా? ఇదేకైకొనుఁడు.

[అని మౌక్తిక హార మతనికిచ్చును.

తూర్య——[కైకొని] ధన్యోస్మి ధన్యోస్మి! నేడు గదా నామనో రథం బీడేఱును? కుమారా! నీవు మార్గాయాసముచే మిగుల బడలితివి. ఈకుశాస్తరణముపై నేను వచ్చువఱకు శయనింపుము. నేను ఈయంతిక సరోవరమ్ముననే కృతస్నాతుఁడనై జపమొనర్చి వైళంబ వచ్చెదను.

ఋత——మునివరు నాజ్ఞ.

[అని శయనించుట నభినయించును. తూర్యకేతుఁడు నిష్క్రమించును.

స్థలము——సాకేతపురి.

రంగము——మదనసాయకాంతఃపురము.

[కృతస్నాతయు, నిర్మలవస్త్రధారిణియునై మదనసాయకయు, ఇద్దఱు చెలికత్తెలును బ్రవేశింతురు.]

ప్రథమసఖి——ఏమే మదనసాయకా! నీకనులు ఎఱ్ఱగనున్నవి.? తలయంటుకొనినపుడు సంపెఁగనూనె కన్నులకు దిగెనో?

మద——లేదుసఖీ! నిన్నరేయి నిద్దుర పట్టినదికాదు.

ద్వితీయసఖి——అవును. యువరాజు తన చెంతలేక మదనసాయకకు ఎట్లు నిదుర పట్టును?

మద——ఎకసక్కెములాడకు చెలీ! నిన్ను బతిమాలెదను.

ప్ర——నీకు నిద్రపట్టకుండుట కేమికారణమే?

మద——చెలీ! నిన్నరాత్రి ఒక దుస్స్వప్నముంగంటిని. అది యిప్పుడు తలఁచుకొనిన ఒడలు జలదరించుచున్నది. నిన్న నీవు తుఱిమిన సిగదండ పట్టుసడలి నాశయ్యపైఁబడినట్లును, అదియొక సర్పమై నాప్రక్కనుజేరి నాహృదయముఁ బొడిచినట్లును, గలవచ్చినది. ఇదియేమిపాపమే? ఆర్యపుత్రునికేమియు నపాయమువాటిల్లి యుండదుగదా?

ద్వి——సఖీ! నీవూరకుండుము. కలఁత నిదురలోఁ గలలకుఁగొదవేమి? నీప్రాణేశ్వరుఁడింటికి వచ్చినగాని నీవు మగుడ సమాహితవుకావు. నాకుఁదెలియును.

మద——నీవెప్పుడును ఇట్లేయుందువు చెలీ! నాగుండెలిపుడు ఎట్లదరుచున్నవో చూడుము. [అనియామెచేయి దివియును.

ద్వి——[చేయిలాఁగికొనుచు] వలదు చెలీ! యువరాజు నేఁడో ఱేపో చనుదెంచును గదా? అతనితో ఒకరేయి నీస్వప్నవృత్తాంతము చెప్పి నీగుండె లదరుట అతనిని జూడు మనుము.

ప్ర——[ద్వితీయ నుద్దేశించి] ఏమిమోటుతనమే? నీవుండుము. [మద. నుద్దేశించి] మదనసాయకా! నీవప్పుడు మమ్ముల ను లేపరాదా? నేచెంగటనే పండుకొంటిమిగదా?

మద——మీకేల నిదుర చెఱుపవలెనని యూరకొంటిని. కాని

చెలీ! గాలవుని దోడ్కొని ఆర్యపుత్రుఁడు సురక్షితముగఁ జనుదెంచునా?

ప్రి—భయంపడకు చెలీ! అసహాయ శూరుఁడగు నీజీవితేశ్వరునకా భంగపాటు వాటిల్లుట? ఇంతకును స్వప్నములను ఏలపాటింతువు సఖీ!

మద—పోనిమ్ము. కానియేమే? వివాహమునకై రాజబంధువులందఱును అప్పుడే వచ్చియుండిరను నా జననీజనకులు ఇంకను రాలేదు? నాకెన్నియో బుద్ధులు చెప్పి నన్ను విడువలేక విడిచి పోయిన కుండలయు, దుంబురుఁడును వారిని గలియుటలేదో? లేక వారు నాపైఁ గినుక వహించిరో? మందభాగ్యను!

ప్ర—ఓసీ! నీవెంతగోలవే? నీవివాహమునకు నీతలిదండ్రులు ఏల రాకుందురు? వారికి నీపైఁ గోపమెందులకు?

ద్వి—మగనిపై మక్కువచేఁ దలిదండ్రుల నొప్పరికించి అతని వెంటఁ బోయినందులకు వారు కోపగింతురని మదనసాయక భ్రమపడుచున్నది. ఇంతకు దక్క నేఱుకారణము కానరాదు.

ప్ర—[ద్వితీయ నుద్దేశించి] బాగుగ జెప్పితివిలే. ఇట్టి కోపకారణము ఇంతకుముందెన్నఁడెఱుఁగను. [మద-నుద్దేశించి] సఖీ! నీ జననీజనకులు నేటికి రావలయునని రాణిగా రనుచుండ వింటిని. ఎందువలననో నేఁడు సైతము రాలేదు. కాని వారు నీపెండ్లినాఁటికైన దప్పక వత్తురు. చూడుము.

ద్వి—నేఁడు మన మదనసాయక పెండ్లికూఁతురగునని వారెఱుంగరా? కాని చెలీ! అడుగమఱచితిని. నేఁటి యుత్సవము నాగలోకమున జరుగుననియు, మనమందఱము నచటికిఁ బోవుదుమనియుఁ జెప్పియుంటివే? ఏల అట్లు జరుగలేదు?

ప్ర—ఇందుల కధీశ్వరుఁడే కారణము. రాజకుటుంబమందలి అన్ని వివాహములకును ప్రారంభోత్సవము నాగలోకమున నొక నాగరాజు మందిరమున జరుగుట తాతలనాఁటనుండియుఁ దప్పని ఆచారమై యున్నదఁట. అందువలననే నేఁటి ఉత్సవమునకు రాజకుటుంబమును దోడ్కొని పోవుటకు ఆ నాగరాజు కుమారుఁడు కూడ వచ్చియుండెనఁట. కాని వివాహము సమీపించుటచేఁ బ్రయాణమునకుఁ జాలినంతవ్యవధిలేదని రాజుగారు వానికిఁజెప్పినట్లువింటిని.

ద్వి—అయ్యో! నాగవాసమును జూతునని ఎంతో వేడుక పడుచుంటిని గదే? అదివింతలకును, వినోదములకును బుట్టినిల్లఁట.

ప్ర—మనమేమి చేయఁగలము?

[అంత వస్త్రాభరణములతో నిండిన యొక్క పళ్లెరముతో వేఱొక చెలికత్తె ప్రవేశించును.]

తృతీయ—వినుఁడు వినుఁడు. మదనసాయక కిదే శుభవార్త. రాణిగారు ఆమెతో నిట్లు చెప్పుమనిరి. "తమ కుమారి నేఁడు ధరించుటకై ఈయమూల్య వస్త్రాభరణములు

ఇప్పుడే విశ్వావసుఁడును, కుముద్వతియుఁ బంపించినారు. కొన్ని ప్రతిబంధకములచే వారిరువురు నేఁటికిరాఁజాల కుండిరి. కాని వివాహదినమునాఁటికిఁ దప్పక వత్తురు." అని. మఱియుఁ దమకుమారిని దీవించిరనియు, ఆమెను జూచుటకు వారు అతికుతూహల పడుచుండిరనియుఁ గూడఁ జెప్పుమనిరి. ఇంతియకాక, ఈ యుడుపులును, సొమ్ములును దక్క వేఱొండు మదనసాయక నేఁడు ధరింప వల దనియు, ఆనతిచ్చిరి. మదనసాయకా! వీనినిఁ బరిగ్రహించి రాణిగారి ఆజ్ఞ నెఱవేర్పుము.

[అని పళ్లెర మామెకడ నుంచును.

ద్వి—చెలిమోము ఇప్పుడు కదా వికసించినది? [మదన. నుద్దేశించి] చెలీ! మదనసాయకా! వీనినిఁ గైకొనవేమి?

ప్ర—సఖీ! నేను జెప్పితినిగదా నీతలిదండ్రులు తప్పక వచ్చెదరని? నేఁటికి వచ్చుటకు ఏదియో ప్రతిబంధక ముండుటచే ముందుగా ఈ భూషణాంబరములు పంపినారు. వీనిని ముందు గైకొనుము.

మద—చెలుల ఆజ్ఞ..అట్లే కైకొందును. [అని వానిని ధరింపుచుఁ, దృతీయతో] ఓసీ! నీవు పోయి దేవిగారికి నా నమస్కృతుల నర్పించుచు వారి ఆజ్ఞ శిరసావహించితి నని చెప్పుము.

తృ—అటులే చెప్పెదను. [అని నిష్క్రమించును.

మద—చెలులారా! నేఁడు నాకు ఎంతయు సుదినము. కాని ఏలొకో నామనము ఆర్యపుత్రుని మీఁదికే పరువిడు చున్నది?

ప్ర—ఊరకుండుము సఖీ! నీకంతయు మేలే యగును.

[అంతఁ బుష్పచందన మాల్యాది పూజా ద్రవ్యములతో నింకొక చెలికత్తె ప్రవేశించును.]

ప్ర—[నిర్వర్ణించి] ఇది యేమి? చందన మాల్యాదులు ఈమె యిచటికిఁ గొని వచ్చుచున్నదే?

ద్వి—చెలి కాత్యాయనీ పూజ సలుపుటకుఁ గాఁబోలు.

తురీయ—[ప్రవేశించి] యువరాజపత్నికి రాణిగారిట్లు చెప్పుమనిరి. "ఒక మునీశ్వరుఁడు మదనసాయకను జూడ నరుదెంచు చున్నవాఁడు. వారికి యథోచిత సపర్యలొనర్చుట కై పూజా ద్రవ్యములు పంపఁబడినవి. వీనిని గైకొని మానిని యథావిధి సత్కరింప వలయును." అని.

[అని వానిని మదనసాయక యెదుట నుంచును.

ప్ర—[సంతోషముతో] ఎంత పుణ్యమే సఖీ! నేఁడు నీకు ముని సందర్శన లాభము!

ద్వి—చెలీ! ఇఁక నీ దుస్స్వప్నమునకు వెఱఁగందకుము. మహాత్ముల దర్శనము సకలదోషముల నివారించును గదా?

మద—[తురీయ నుద్దేశించి] ఓసీ! మునీంద్రుఁడు అప్పుడే యరుదెంచు చున్నవాఁడా?

తురీయ—[నిరూపించుచు] వీరే, కనుము.

[అంత మునివేషధారి తూర్యకేతుఁడు ప్రవేశించును. అందఱు లేతురు.]

మద—మునిచంద్రా! మదనసాయక ప్రణమిల్లుచున్నది.

[అని యట్లు సేయును.

తూర్య—కళ్యాణము బిడ్డా! కళ్యాణము. [తనలో] ఇది ఆచార్యోక్తి గదా?

చెలులు—మునిపుంగవునకు మా దండప్రణామములు.

[అని యట్లు సేయుదురు.

తూర్య—కళ్యాణము కళ్యాణము. దీర్ఘసుమంగల్యోభవ!

మద—మహనీయా! ఈ యాసనము నలంకరింపుఁడు.

[తూర్యకేతుఁడు కూర్చుండును

మద—

[చెలుల సాయమున నతనినిఁ బుష్పాదులతోఁ బూజించును.]

(గేయము.)

తాపసేంద్రా! మిమ్ముఁ గనుంగొన, ధన్యనహో! కడు ధన్యనహో!
జన్మము సార్థకి మయ్యె మునీశ్వర! ధన్యనహో! కడు ధన్యనహో
ముక్తిసతీ హృదయేశ్వర! మౌనీ!
దురితారణ్య దవానల! మౌనీ!
శంకర సన్నిభ! సదయా! మౌనీ!
తావక సేవకురాలనిదే - కరుణాభరణా॥ తా॥

తురీయ—[సపర్యయైన వెనుక] అమ్మా! దేవిగారు నా రాకకెదురు చూచుచుందురు. పని వినియెదను.

మద—పొమ్ము. [తురీయ నిష్క్రమించును.

మద—[తూర్యకేతు నుద్దేశించి] మౌనీంద్రా! మీ యమోఘదర్శన ప్రాప్తిచేఁ గడు పవిత్రురాలనైతిని. మీ రాక సమస్త దోష నివారణమును, సర్వమంగళ సంధాయకమును, గదా?

తూర్య—[తనలో] ఈ నిండు జవరాలి మోముఁజూడ నా పన్నగడ విఱుగఁబడి హృదయము చెదరుచున్నది. [ఆలోచన నభినయించి] అయినను ధైర్యవృత్తి విడువను. అనాసుర వర్తన మొల్లను. [ప్రకాశము] పుత్రీ! ఈ మందభాగ్యుని రాక అట్టిదై యుండిన ఎంత బాగుండును?

మద—[ఉలికిపడి] మునివర్యా! ఏమి యిట్లనెదరు? నా ఆర్యపుత్రుని విషయమై కాదు గదా?

తూర్య—పుత్రీ! నీ ఆర్యపుత్రుని వద్దనుండియే వచ్చుచున్నాఁడను. అతఁడే నన్ను నీ కడకుఁ బంపినాఁడు.

మద—[ఆశ్చర్యముతో] హా! ఏమిదింత! ఆర్యపుత్రుఁడు నాకుఁదన వర్తమాన మంపు టేమి? అతఁడు ఇంకను గాలవాశ్రమముననే ఉండెనా?

తూర్య—బిడ్డా! ఏమి వచింపుదును? అతఁడు గాలవాశ్రమమును జేరుటయే లేదు. అతఁడు ప్రయాణ మొనర్చుచుండ

మార్గమునఁ దొల్లి అతనిచే సంహరింపఁబడిన తాళకేతుని తమ్ముఁడగు తూర్యకేతుఁడను రాక్షసుఁడు ఋతధ్వజుని మార్కొనెను. వారిరువురకును ఘోర సంగ్రామము జరిగినది.

మద—నా ప్రాణేశ్వరుఁ డారక్కసుని వధించెనా ?

తూర్య—అట్లయిన ఏమి విపరీతమున్నది ? ఆ చెనటి రక్కసుఁడు ఉక్కసెడక తన యన్నం జంపిన కోపము మనమ్మున రగులుచుండ అతితీవ్ర యుద్ధ మొనర్చి నీ మగని జయించినాఁడు.

మద—[విచారముతో] అయ్యో ! ఏమి విపరీతము ! ఆర్యపుత్రునికిఁ బ్రాణోపద్రవము గలుగలేదు గదా ?

ప్ర—[అపవారించి, ద్వితీయతో] ఇదేమిటిదమ్మా యీ మబ్బులేని పిడుగు ?

ద్వి—[అపవారించి, ప్రథమతో] ఏమి పాపమో తెలియదు. నా పాదములు వణఁకుచున్నవి.

తూర్య—పుత్రీ ! నాకు నోరాడకున్నది. వారిరువురును ద్వంద్వయుద్ధ మొనర్చి ఒకరి నొకరు లెస్సగా హింసించుకొనిరి. అందు ఋతధ్వజునకు గాయములు మెండుగఁ దగిలెను. రాక్షసులు మరలఁ దపోవనమునఁ బ్రవేశింప నున్నారను భయముకలిగి మేము మా ఆశ్రమములను విడిచి నలు కెలంకులఁ బరువిడుచుండఁ బాప మాతఁడు దూరమున

సన్నుఁగని చెయిసన్న చేయఁగాఁ బ్రాణానిలావశిష్టుఁడైన నీ ప్రాణేశునిడాసితిని. అంత నతఁడు తనస్థితి నాకుఁ జెప్పి తన కంఠమందలి మౌక్తిక హారమును దీసి ఎట్లయిన అయోధ్యకుఁజని నీ కొసంగుమని ప్రార్థించి ప్రాణములు విడిచినాఁడు. అట్లే కానిమ్మని ప్రాణములపై ఆస వదలి ఏకా యకీ ప్రయాణము లొనర్చి నేఁడు నీకడకు రాఁగలిగితిని. [తీయుచు] ఇదే, ఈ హారము గైకొనుము.

[అని యామె కిచ్చివేయును.

మద—[కొని, కని] హా ! ఆర్యపుత్రా !

[అని మూర్ఛిల్లి నేలవ్రాలును

ప్ర—[విచారముతో] హా చెలీ చెలీ ! ఎంత మందభాగ్యవు ! మాకేమి మార్గము ? [ద్వితీయతో] ఓసీ ! నీవు వైళమ పోయి యువరాజపత్ని మూర్ఛిల్లినదని దేవితోఁ జెప్పుము. ముందొక వీవనయుఁ, బన్నీరును దెచ్చిపెట్టుము.

ద్వి—ఆలాగే. [అని పోయి, కొంతవడికిఁ దెరలోనుండి] వీవన కనఁబడ లేదమ్మా !

ప్ర—[మదనసాయకను పైఁటచెంగుతో విసరుచు] బల్లపైనే ఉన్నదిగదే ? క్రిందఁ బడినదేమో చూడుము.

ద్వి—[తెరలోనుండి] ఎచ్చటను గానరాకున్నది.

ప్ర—సరే ! నేను వచ్చుచున్నాను. నీవు దేవియొద్దకుఁ బొమ్ము.

ద్వి—[తెరలోనుండి] అట్లే. [ప్రథమసఖి నిష్క్రమించును.

తూర్య—[లేచి] నిక్కముగ ఈమెహృదయము వ్రక్కలైనది. ఈ అమితశోకము సహించి తనువు నిలుపఁజాలదు. నా యభీష్టము నెఱవేఱినది. నాపన్నుగడ సాగినది. సంతోషము సంతోషము. ఇఁక నేను నాపర్ణశాలకుఁబోయెద. [హారము మదనసాయక చేతినుండి లాఁగికొనుచు] ఈ హారము మరల ఋతధ్వజున కిచ్చివేయవలెను గదా? హారమా! నీ కెంతయుఁ గృతజ్ఞుఁడను. ఒకసారి నాగ్రీవముఁగూడ అలంకరింపుము. [అని కంఠమున ధరించుచుఁ దార్యకేతు నుద్దేశించి] అన్నా! నీతమ్ముఁడు నీ ఋణము దీర్చినాఁడు. వానిని దీవింపుము.

[అని నిష్క్రమించును.

స్థలము—తపోవనము.

రంగము—తూర్యకేతుని పర్ణకుటీరము.

[నిద్రితుఁడు ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత—[ఉలికిపడి లేచి] ఛీఛీ! ఏమిపాడుకల!

ఉ. చక్కని చుక్క నా మదన * సాయక కేళి వనంబులోన నేఁ
డొక్కతె పూలు గోసి కొను * చుండ నిశాటుఁ డొకం డదెట్టులో

అక్కడి కేఁగుదెంచి చెలి * యక్క విశిఖబాణముచేత నొంపఁ దా
నక్కట! నేలఁ గూలె నఁట * "హా ప్రియ!" అంచు నిదేమిపాపమో!

అయ్యో! ఇట్టి దుస్స్వప్నము నాకెన్నఁడును రాలేదే? నా ప్రాణేశ్వరికి ఎట్టి యపాయమును వచ్చియుండదుగదా? మగుడ నగరికి మరలుదునా? [ఇంచుక యోచించి] అట్లు చేయరాదు. అదియే అమంగళసూచకమగును. ఇంతకును ఇదియొకస్వప్నము. మనోవికారము. దీనికేమి? ఏలాకో? మునీశ్వరుఁడు ఇంకను వచ్చుట లేదు? నేఁడు నాప్రయాణము గతి యేమి? [తెరవంక నిర్వర్ణించి] ఇరుగో వచ్చుచున్నారు.

[అంతఁ దూర్యకేతుఁడు ప్రవేశించును.]

తూర్య—[వానిని దఱిసి] కుమారా! ఇప్పుడే వచ్చుచున్నాఁడను. నీకతన నేఁడు నాకు మనోభీష్టసిద్ధి అయినది. ఇదే నీ హారముఁ గైకొనుము. [అని హారముఁ దనమెడనుండి తీసి]

గీ. మా ఋతధ్వజ రాజతు * మార వర వి
భూతి చిహ్నాల నల గ్రీవ * మునఁ దనర్చ
నీ సరమ్మున నిపుడు స * న్యాసి విమల
కంధర విభూతి చిహ్నాలు * గ్రాలె నార!

[అని యిచ్చివేయును.

ఋత—[అందికొని] మునివరు ననుగ్రహము. మునీంద్రా! ఇఁక నాకు సెలవొసంగిన గాలవాశ్రమమునకుఁ బోయెద.

తూర్య—ఇదియేమి కుమారా! భోజనము లేకయే ప్రయాణమా?

ఋత—మునీంద్రా! నే నిప్పుడే ఆరగించితిని. తమ జపము పూర్తి యగుట విలంబమగుననియు, ముందుగ నేనుభుజించుటకుఁ దమ రానతిచ్చితిరనియుఁ జెప్పి తమశిష్యులలో నొకఁడు ఇప్పుడే నన్ను భోజనపరితృప్తుం జేసెను. తాము ఇంకను రాకుండుటచే మరల శయనించితిని.

తూర్య—[స్వగతము] సెబాసు! నాశిష్యుఁడు ఎంతగడుసరి! నా పనుపు ఎంతబాగుగ నెఱవేర్చినాఁడు. ఇఁక నితఁడు శీఘ్రముగ నా ఆశ్రమమునుండి తరలుటయే మంచిది. లేనిచో ప్రసంగవశమ్మున ఎట్టియనుమానమునకుఁ జోటుచిక్కినను దప్పక నాకుఁ బ్రాణహాని కల్గును. కావున ముందితనిని వీడ్కొల్పి ఆవల నారగింతునుగాక. [ప్రకాశము] కుమారా! నాజపముదీఱువఱకుఁజాలదడవగునని నిన్ను ముందుగ భుజింపుమంటిని. నీవట్లొనర్చి నామాట మన్నించితివి. నీవిఁకఁ బ్రయాణమగుము. ప్రొద్దుగ్రుంకకమున్నే గాలవాశ్రమమును జేరుదువు.

ఋత—మునివరునాజ్ఞ. పోయివచ్చెదను.

తూర్య—వత్సా! నాకనులకు నిన్ను మరలఁగనుభాగ్యము ఎప్పుడబ్బును?

ఋత—మహనీయా! గాలవునిఁదోడ్కొని మరలఁ దమ యాశ్రమమునకు వచ్చెదను.

తూర్య—సంతోషము సంతోషము. [తనలో] అంతదనుక నా యాశ్రమము ఉండినగదా?

ఋత—మునీంద్రా! నాకు సెలవొసంగుఁడు. ఇదేనా ప్రణామము.

[అని ప్రణమిల్లును.

తూర్య—నా అమోఘాశీర్వచనము. కుమారా! పోయిరమ్ము.

[ఋతధ్వజుఁడు నిష్క్రమించును.

పాపము. నా కయిలాటపుఁజేతలు ఇతని కేమియుఁ దెలియవు కదా? ఇతఁడు పరాక్రమవంతుఁడఁట. నా ధీవిశేషము ముందఱ ఇతని పరాక్రమ మేమయినట్లు? "ఉపాయములేనివానిని ఊరు వెడలఁగొట్టు" మన్న విధమున నాయన్న నాయంతటి ఉపాయశాలి కాకయేకదా పరలోకమున కరిగినాఁడు? ఇపుడు ఈ ఋతధ్వజుఁడు గాలవునిఁ దన వివాహమునకుఁ దోడ్కొనిపోవునఁట. కాని తానుఇలుసేరువఱకు తనప్రియురాలు యమసదనము చేరునని యెఱుంగఁడు. ఓహో వెడగుఁదాపసులారా! మీ పొగడ్తలకు ఉబ్బెడు ఈవెడగుఁ గుమారుని గతి ఏమిచెప్పెదరు?

ఉ. దానవ వారి వాహ పృష * దశ్వుఁ డటంచును రాక్షసేభ పం
చాననుఁడంచు రాత్రిచర * శైల దివస్పతి యంచు మీర లీ
మానవనాథ పుత్త్రుఁ బలు * మారు నుతింతురు గాదె? ఇప్డు ప్రా
ణానిలశిష్టయైన సతి * నాతని కెట్టులు తేర్చి యిత్తురో?

ఇఁక నీ యాశ్రమము నాకేల? [పర్ణశాల నుద్దేశించి

ఆశ్రమమా! మాయమగుము. [పర్ణశాల యదృశ్యమగును.]
ధన్యోస్మి ధన్యోస్మి! [అని నిష్క్రమించును.

స్థలము—నాగలోకము.

రంగము—అశ్వస్థుని మందిరము

[విశోకుఁడు ప్రవేశించును.]

విశో—[వ్యసనముతో] అహహా విధికృతము! మిత్రుని అభ్యుదయమునకు సంతసించి అనుశ్రుతాచారము బట్టి మా మందిరమున జరుగనున్న అతని వివాహప్రారంభోత్సవమునకు జనకునిపంపునఁ జక్రవర్తికుటుంబమును బిలువఁబోయిన నేను మిత్రుని మరణవార్తతో మరలి రావలసి వచ్చెనదికదా? ఓ అయోధ్యాపట్టణమా! నీ కెంతలో ముండమోఁపితన మబ్బెనదే? నీపౌరులలో నెవరిమోము చూచినను మేరలేని విషాదమునే సూచింపుచున్నదిగదా. వారి అన్యోన్యసంభాషణమే తఱచు వినవచ్చుటలేదు. ఒకవేళ మాటలాడిరో, "సార్వభౌముని కెట్టి కష్టము వాటిల్లినది!" "త్రిజగద్భీషణుఁడగు యువరాజునకు ఎట్టి అపమృత్యువుకల్గెను!" "ఆహా! యువరాజపత్ని

ఎంత మందభాగధేయ!" అను పలుకులుతప్ప వేఱు ప్రసంగ మెందును వినరాదుకదా? సరియే. నాకర్తవ్యమేమి? దివ్యజ్ఞానియగు నాజనకున కీవార్త తెలిసియే యుండును. కాని నావిధి నేనొనర్పవలెను. ఇఁక నాతని వద్దకుఁ బోవుదునుగాక. [నిర్వర్ణించి] అతఁడే యిటు వచ్చుచున్నాఁడే?

[అంత నశ్వస్థుఁడు ప్రవేశించును.]

అశ్వ—విశోకా! అయోధ్యకుఁ బోయివచ్చితివా?
విశో—జనకా! అవును.
అశ్వ—సార్వభౌమునిఁ జూచితివా?
విశో—చూచియేవచ్చినాఁడను. కాని, అతనితో సంభాషింపలేదు.
అశ్వ—తనయుఁడు మృతినొందెనని కలగుండుపడియున్నవాఁడుగదా?
విశో—జనకా!

గీ. రాజనందన మరణ వా * ర్తా శతఘ్ని
తాఁకు వడినంత నలపుర * నాక శ్రీలి
జనము శోకాబ్ధిలోఁబడి * మునిఁగి తేలు
చుండఁ దన్నాయకుఁడు కల * గుండు వడఁడె?

ఇంతియకాక మఱియొకవింత. కుమారుని మరణవార్త తొల్లి తమకుఁ దెలుపక మదనసాయకకుఁ దెల్పితిమి యనియు.

దాను దెచ్చినహారముతో మరల నతఁడు మాయమగుటేమి యనియు, మునిమాటలను అంతగా విశ్వసింపక సార్వభౌముఁడిపుడు తేఁకువగల కొందఱుభటులను గాలవాశ్రమమునకుఁ బంపినాఁడఁట.

అశ్వ—వారేమివార్తనుగొని తెచ్చిరి?

విశో—నేఁటి యుదయమేకదా వారు పోవుట? ఇంకెవ్వరును రాలేదు. వచ్చినను మేలివార్తను దేఁగలరే?

అశ్వ—తనయా! నేనిపుడే సార్వభౌమునిఁ జూడఁ బోవలయును. ఋతధ్వజుఁడు సేమముగానే యున్నవాఁడు. నీవుచెప్పిన కపటమునియే ఱేనిని వంచించి సంక్షోభమొదవించెను. నీవును రమ్ము. పోవుదము.

విశో—[ఆశ్చర్యముతో] హా! ఏమివింత యేమివింత! నా సఖుఁడు క్షేమముగా నున్నాఁడా?

అశ్వ—అవును. నేనిప్పుడు దివ్యదృష్టిని దెలిసిన విషయము వినుము. తూర్యకేతుఁడను ఒకరాక్షసుఁడు మునివేషధారియై మాయాకుటీర మొక్కటి కల్పించుకొని గాలవమహర్షిని జూడఁ బోవుచున్న యువరాజును సంభావించి ఆతని కంఠహారమును ఎట్లో సంగ్రహించి తన మాయాబలముచే మదనసాయకా శుద్ధాంతమునకుఁజని, ఆమెతో "నీ మగఁడు రక్కసులచేఁ జిక్కి మృతినొందినాఁడు. నిదర్శనముగ అతనికంఠహారమును దెచ్చితిని. కైకొమ్ము" అని చెప్పగా దానింగని ఆమె మూర్ఛిల్లెను. అంతట,

ఆ మణిహారముతో మరలఁ దనయాశ్రమమునకు వచ్చి ఋతధ్వజుని వీడ్కొలిపెను. ఋతధ్వజుఁడు ఇపుడు గాలవాశ్రమముననే ఉన్నవాఁడు. ఇదియంతయు ఒక గడుసు పన్నుగడ. రమ్ము రమ్ము. పోయి సార్వభౌముని మగుడ ఆనందసాగరమునఁ దేల్పుదము.

[అని విశోకునితో నిష్క్రమించును.

స్థలము—సాకేతపురి.

రంగము—రాజప్రాసాదము.

[శత్రుజిన్మహారాజు ప్రవేశించును.]

శత్రు—[విచారముతో] గాలవాశ్రమమునకుఁ బోయిన భటులు ఇంకెవ్వరునురాలేదఁట. సరియే. వచ్చెదరు. వచ్చిననేమి? నా ఋతధ్వజకుమారునిఁ దోడ్తెత్తురా? వాని క్షేమసమాచారమైనఁ గొనితెత్తురా? లేదు లేదు లేదు- నాకుఁ దెలియును; నాకుఁ దెలియును. వారు తెచ్చెడిది మరల మరణవార్తయే. మా ఋతధ్వజుఁడు చనిపోయినాఁడా? తుదకు అసురులు వానిని జయించిరా? హా! హా! హా! ఎంతపనియయ్యెను! ఎంతపనియయ్యెను!

హా కుమారా! నిరుపమశూరా! రూపజితమారా! నీకా దుర్మరణము? సాధుజనావనోత్సాహివై త్రిజగత్కంటకులగు రాక్షసుల నెల్లను రూపు మాపి నా కీర్తికి వన్నె దెచ్చుచుంటివని నేను ఎంతయో మనమున నుప్పొంగుచుండ ఇపుడీ పాపరక్కసుఁడు ఎక్కడ నీకు దాఁపురించినాఁడు? హతవిధీ! శూరశిఖామణి యగు నా చిట్టితండ్రిని దుడుకొక పొలసుదిండిచేతనా చంపింతువు? ఓహో! ఏమి నీ ధీజడిమ? ఓయీ పుత్రరత్నమా! గాలవుఁడు నిన్ను వెండియుఁ దనయాశ్రమమునకు రావించుట నీ చావుకొఱకా? ఓయీ గాలవమునీంద్రా! నీకిదే నమస్కారము. నా తనయుని బ్రతికింపుము. తొల్లి నీవేకదా నాకుమారుని అసురసంహారమునకు వెంటఁగొని పోయితివి? ఓ సకలమునిపుంగవులారా! ఇదే నాప్రణామ మందికొనుఁడు. నాఋతధ్వజునిఁ బునర్జీవితుని జేయుఁడు. రాక్షసభయ మెడలించి మిమ్మెల్ల నందఱను బ్రోచినవాఁడు నా కుమారుఁడేకదా? వానిని బ్రతికించితిరేని మరల మిమ్ములఁ బ్రోవఁగలఁడు. కావున మీతపస్సులనెల్ల ధారవోసియైన నాకుఁ బుత్రదాన మొసంగుఁడు- ఓహోహో! ఏమి నా వెడగుఁదనము! వీరా నా కుమారుని బ్రతికించుట? అట్లయినచో నాకు ఈ ఘోర మరణవార్త ముని యేల తెచ్చును? దుర్భ్రమ దుర్భ్రమ!

వీరు కేవలము మందబుద్ధులు. వాక్శూరులు. అయినను నాపాపమునకు వీరి ననవలసిన పనియేమి? హా! ఎంత పనియయ్యెను? ఓసీ మదనసాయకా! నీవెంత యదృష్టహీనవే? నాకుమారుని మరణముకంటె నీస్థితిఁ దలఁచుకొనిన నాహృదయము నీరై పాఱుచున్నది గదే బిడ్డా! సుగుణములప్రోవా! సౌందర్యరాశీ! హా! ఏమిచిత్రమగు బ్రహ్మసంకల్పము! ఎంతదైవోపహతుఁడను! ఎంత పాపాత్ముఁడను! ఎంత మందభాగ్యుఁడను!

[అని నిటలము గేలిపైనునిచి నిశ్వసించుచుండును.

[అంతఁ బ్రతీహారుఁ డొకఁడు ప్రవేశించును.]

ప్రతీ—[స్వగతము] వీరెవరో ఉత్తమవంశ్యులవలెఁ దోఁచుచున్నారు. కాని ఏలిక దర్శనము ఇప్పుడే చేయుదురఁట. సార్వభౌముని ఆజ్ఞ వారికి నేనెంతదీనతతో విన్నవించినను నామాటలు సరకుగొనక "పోయి ఏలికకు మారాక దెలియఁబఱుపుము. భయపడవలదు" అనియే చెప్పుదురు. నాకేమిమార్గము? సరియే. ఏలిక సన్నిధికేతెంచితినిగదా. ఇఁక నేమైనఁ గానిమ్ము. కాని యిచటనే నిలువంబడెద. ఏలిక నన్ను ఎపుడు కన్నులెత్తిచూచిన అప్పుడే తెలిపెదఁగాక. [అని నిలువఁబడును.

శత్రు—[కొంతవడికి, నిర్వర్ణించి] ఓరీ! కుమారునివార్త లేమైనఁ దెచ్చితివా?

ప్రతీ—[తత్తఱిసి] లేదు దేవా! నేను ద్వారపాలకుఁడను. గాలవాశ్రమమునకుఁ బోయినవా రింకను రాలేదు.

శత్రు—ప్రతీహారుఁడవా? నిన్నెవరు రావించిరి?

ప్రతీ—[కరములు ముకుళించి] దేవరవారు మన్నింపవలెను. దేవరకుఁ జిరపరిచితులఁట. నాగలోకవాసులఁట. అశ్వస్థుఁ డను నతఁడును, అతనికుమారుఁడును, ఏలికదర్శనమునకై వచ్చి హజారమున వేచియున్నవారు. కుమారుని సమాచారము రూఢిగఁ దెలియువఱకును దాము ఎవ్వరికిని దర్శనమీయరని వారితో నెంతచెప్పినను నామాట బెడ చెవినిబెట్టి 'పోయి మారాక ఏలికకు విన్నవింపు' మనియే చెప్పిరి. కార్యగౌరవము ఎట్టిదోయనిభయపడి తమ సన్నిధికి రా సాహసించితిని. అటుపైని ఏలికచిత్తము.

శత్రు—ఓరీ! ఎవరు వచ్చినారని చెప్పితివి?

ప్రతీ—దేవా! నాగలోకవాసియగు అశ్వస్థుఁడును, అతని కుమారుఁడును.

శత్రు—[ఉలికిపడి] అశ్వస్థుఁడా? నా ప్రియమిత్రుఁడా? ఓరీ! వానిని వెంటనే కుమారునితోఁ బ్రవేశపెట్టుము.

ప్రతీ—దేవర ఆజ్ఞ. [అని నిష్క్రమించును.

శత్రు—దివ్యజ్ఞానియు, మహాయోగియు, మహామంత్రవేత్తయు నగు నామిత్రుని నాగరాజును గనుటచే నామతి నేఁడు కొంత నిర్వృతిచెందును. రానిమ్ము రానిమ్ము.

[అని నిర్వర్ణించును.

[అంత నశ్వస్థుఁడును, విశోకుఁడును ప్రవేశింతురు.]

శత్రు—[లేచి] మిత్రరత్నమా! ఈమందభాగ్యునిఁ జూడ వచ్చితివే? రమ్ము. ఇచట సుఖాసీనుఁడవుకమ్ము. [విశోకు నుద్దేశించి] కుమారా! నీవయస్యుని జూడ నేతెంచితివా? నేఁడు ఈమందభాగ్యునిసత్కారమే నీవు గ్రహింపవలయు. ఇచటఁ గూర్చుండుము. [అందఱు గూర్చుండినవెనుక, అశ్వస్థు నుద్దేశించి] మిత్రమా! నీకుఁ గుశలమే? ఈ పాపాత్ముని ఏల చూడ నరుదెంచితివి?

అశ్వ—సఖా! ఏమి యిట్లనెదవు? నీయట్టి పుణ్యాత్ముఁడు వేఱొకఁడు నాకుఁ గానరాఁడు. మఱియు, మనకు అందఱకుఁ గుశలముకాదా?

చ. కుశలము పో ఋతధ్వజున * కున్ సఖ! గాలవు నాశ్రమమ్మునన్;

శత్రు—[లేచుచు, నివ్వెఱఁగుతో] ఆఁ! ఆఁ! ఏమియేమియేమి?

అశ్వ—[లేచుచు, మరల నదియే చదివి, పిమ్మట]

కుశలము నీకు నీ హితుల * కున్ సఖ! ఇష్టభవద్గృహమ్మునన్;

కుశలము నాకు నాసుతున * కున్ సఖ ఇష్ట త్వదీయ సన్నిధిన్;

కుశలము కాదె మత్ప్రియస * ఖుం డిపుడేలఁగ నెల్లవారికిన్?

శత్రు—మిత్రమా! చెప్పుము చెప్పుము. కుమారుఁడు సేమముగా నున్నాఁడా?

అశ్వ—అవును సఖా! నీవు విచారింపకుము. అతఁడు ఇపుడు గాలవుని సన్నిధి నున్నవాఁడు.

ఆ. తూర్యకేతుఁడనెడి * తులువ దైత్యుఁ డొకండు
మానియగుచు నీకు * మాఱుఁ డరుల
చేతఁ జిక్కె ననుచుఁ * జెప్పె; దబ్బర సుమ్ము;
దీనిఁగంటి యోగ * దృష్టి నిపుడు.

శత్రు—ఓహోహో! ఏమి యద్భుతము! ఏమి మోసము! రాక్షసుఁడు నా అంతఃపురముఁ జొచ్చెనా? ఏమివింత! వయస్యా! నేను ఆమాయావిని విశ్వసింపకయే కుమారునికై గాలవాశ్రమమునకు భటులను బంపినాఁడనుజుమా? కాని వారెవ్వరును ఇంకనురారైరి.

అశ్వ—మిత్రమా! ఋతధ్వజుని దోడ్కొనియే వారు వత్తురు. గాలవమహర్షికూడ వానితో వచ్చును. కావున నిర్ణీత దినముననే కుమారుని పరిణయోత్సవంబు నిర్వర్తింపుము.

శత్రు—వయస్యుని ఆజ్ఞ. ఔరా! నేఁడెట్టిసుదినము! నామిత్రుని గంటిని. నాపుత్రుని క్షేమవార్త వింటిని. నాసంతోషమును ఎట్లు మఱుఁగు పఱతును? ఓరీ! ప్రతీహారీ! వేగ మిటురమ్ము.

ప్రతీ—దేవా! వచ్చినాఁడను.

శత్రు—ఓరీ! నీవువైళమపోయి అంతఃపురపాలకులతో, "కుమారుఁడు క్షేమముగ గాలవాశ్రమమున నున్నవాఁడు. కొండొకకపటతాపసిమాటలు మమ్ముమోసపుచ్చినవి." అని మా మాటలుగ దేవితోఁ జెప్పుమనుము. మదన

సాయకకు ఈయుదంతము దెలిపి వెంటనే సమాహిత నొనర్పుమనుము. వెనుక గోపురపాలకుని కడకుఁ బోయి ఇదేవార్త పట్టణమందంతటను శీఘ్రముగఁ జాటింపుమనుము. పదపడి కుమారుని వివాహమునకై అరుదెంచిన మా బంధుమిత్రులకు అందఱకును ఈవార్తయే నీవు స్వయముగఁబోయి వేర్వేఱుఁగ నెఱింగింపుము. పొమ్ము. నేఁడు మాకువలెనే అందఱకును ఒక్కమాఱుగా అమితానందము కలుగవలయు.

ప్రతీ—ఏలిక ఆజ్ఞ. పనివినియెదను.

శత్రు—పొమ్ము. వేగమ పొమ్ము. నీకొలువు పేఱొకని కప్పగింపుము. మఱియు నేఁడు మాదర్శనము ఎవ్వరికిని దుస్సాధము కాఁగూడదు.

ప్రతీ—మహాప్రసాదము. [అని నిష్క్రమించును.

శత్రు—మిత్రమా! నిన్ను జాలకాలమునకుఁ గంటిని. పరమేశ్వరుని రాకవలె నీరాక నాకు ఎంతయు మంగళప్రదమైనది. నేఁడు నాకు మిక్కిలి సుదినము. రమ్ము కూర్చుండుము. కుమారా! నీవును గూర్చుండుము. వయస్యా! నీవు నాకుఁ బుత్రదానమొసంగితివి. నీయభీష్టమే కానిమ్ము. వచ్చినబందుగులు ఎవ్వరునుబోలేదు. నాపాలిఁటి భాగ్యదేవతవు నీవును దోతెంచితివి. కుమారుని వివాహకార్యము తప్పక నిర్వర్తింపుదము. కాని మిత్రమా! ఋతధ్వజుని మరల ఎప్పుడు చూతును? వానికై పోయిన

సేవకులు ఇంకను రారేమి? వివాహదినముకూడ సమీ
పించుచున్నదే? మరల గాలవాశ్రమమునకు భటులను
బంపుదునా? [అని యోజింపుచుండ]

[ఒక వృద్ధకంచుకి యింకొకవైపునుండి ప్రవేశించును]

కంచు—[స్వగతము] ఎటులీఘోరవార్త సార్వభౌముని కెఱిం
గింతును? నేఁటికి ఈ ముసలికాలమునకు దైవము నాకు
ఎట్టిపని గల్పించెను? అక్కటా! గోరుచుట్టుపై రోఁకటి
పోటువలెఁ గుమారుని మృతికై మున్నే సంక్షోభించు
చున్న ఏలిక హృదయము ఈ దుర్మరణవార్తచే మఁగుడఁ
గలంపవలసి వచ్చినది. కానిమ్ము. విధి ఆచరణీయము
గదా? [నిర్వర్ణించి] సార్వభౌముఁ డిచ్చటనేయున్నాఁడు.
అయ్యో! నా నాల్క తడఁబడుచున్నది.

[అని నిలువఁబడును.

శత్రు—[నిర్వర్ణించి] ఎవరావచ్చుచున్నది? కంచుకియా? [వాని
నుద్దేశించి] ఓరీ కంచుకీ! ఏలవచ్చితివి? దేవి సమాశ్వసిల్లి
నదా?

కంచు—[కరములు ముకుళించి] దేవా! ఈమందభాగ్యుని ఏలిక
క్షమిం- క్షమింపుదురుగాక. దేవి- దేవిగారే నన్నిపుడు
ఏలిక సన్నిధికిఁ బుత్తెంచిరి.

శత్రు—ఏమోయి నీ తడఁబాటు? ఏమివార్త దెచ్చితివి?

కంచు—దేవా! రాజ్ఞిగారు ఏలిక కిట్లు నివేదింపుమనిరి. "యువ
రాజపత్ని—మదనసాయక—

శత్రు—[లేచుచు] ఏమి మదనసాయకకు? కుమారుని క్షేమవార్త
నామెకు వినిపించిరా?

కంచు—" — మదనసాయక ఇప్పుడే ప్రాణములు విడిచినది."
శుద్ధాంతము ఘూర్ణాయమానమై యున్నది.

శత్రు—[అత్యాశ్చర్యముతో] మదనసాయకా? అయ్యో!
అయ్యో! అయ్యో! [అని యాసనముపైఁ గూలిపడును.

అశ్వ—హా! ఎంతకష్ట మెంతకష్టము!

విశో—ఆహా! వయస్యునికి ఎంతటియాపత్తు! హా సుహృద్రత్నమా!

[అని కుందును.

శత్రు—[కొంతవడికి, కంచుకి నుద్దేశించి] ఓరీ! నీవేమంటివి?
మదనసాయక చనిపోయినది? ఋతధ్వజుఁడు సేమముగా
నున్నాఁడు? తొల్లి ఋతధ్వజుఁడు చనిపోయెనా? అప్పుడు
మదనసాయక సజీవయా? తుదకు విధి చేతి కీల్బొమ్మ
నైతినా? నాప్రాణమున కింక నిర్వృతి లేదా? కుమారుని
అర్ధాంగలక్ష్మి ఇట్లయ్యెనా? [అని కన్నీరు నించును.

అశ్వ—[శత్రుజిత్తు హస్తములు పట్టుకొని] మిత్రమా! నీవిట్లు
చేయఁజనదు- సమాశ్వసిల్లుము.

శత్రు—వయస్యా! నేను పాపాత్ముఁడను. నేను దైవోపహతుఁ
డను. నా మోము చూడకుము.

అశ్వ—మిత్రమా! విధినిర్ణయమిట్లుండ లాఁతిరీతిని ఎట్లుజరుగును?
సర్వంసహాచక్రమునేలెడి నీవు ఇట్లు శోకింపుచుండిన ఎవ్వ
రోదార్పఁగలరు? సమాశ్వసిల్లుము. అసురుని ధూర్త

వచనంబులు పాపమా అతికోమలహృదయను దుర్భరమై మరణమొదవించినవి. ఆహా విధికృతము!

శత్రు—మిత్రరత్నమా! మందభాగధేయుఁడను. నీవు నాకు దైవమవు. పుత్రశోకము వాపితివి. నాకొడుకును నాకొసంగితివి. అటులే నాకోడలిని నాకు అనుగ్రహింపుము. ఈ మేటి విపత్తును గడదేర్పుము.

అశ్వ—[తనలో] అహో మానవేశ్వరుని కొందలపాటు! [ప్రకాశము] సఖా! ఊఱడిల్లుము. విధి బలీయము కాదా? అటులే కానిమ్ము. ఊఱడిల్లుము.

[అంత నొక చేటి ప్రవేశించును.]

చేటి—జగదీశ్వరులు ఈ దీనురాలి విన్నప మాలింపవలయు. మదనసాయక మరణముచే దేవిగారిదుఃఖము ఇనుమడించినది. ఇంతలోఁ గుమారుని క్షేమవార్త తెలిసినది. అప్పటినుండియు శోకము ముమ్మరమై దేవిగారు కోడలిపైఁబడి మోఁదుకొనుచు రోదనముసేయుచున్నారు. ఇంతవఱకును ఆమె కొంచెమైనను దెప్పిఱిల్లలేదు. మే మెవ్వరమును దేవిని బట్టఁజాలకున్నాము. కావున ఏలిక శీఘ్రముగ విచ్చేయవలయును.

శత్రు—హా దైవమా! నీపరిపంథినగు నాకు ఇంకను ఎట్టి యుపద్రవములఁ గూర్పనెంచితివో? కానిమ్ము కానిమ్ము. [లేచుచుఁ, జేటితో] చేటీ! అంతిపురికి దారిఁజూపుము.

చేటి—దేవా! ఇటు యిటు.

[శత్రుజిత్తును, గంచుకియు, జేటియు నిష్క్రమింతురు.

అశ్వ—అక్కటా! ఈ చక్రవర్తి దీనవృత్తిగనిన హృదయము నీఱగుచున్నది. ఈమహానీయుఁ డిపుడు తన్నుఁదామఱచి యున్నాఁడు. ఇతనికి వెండియుఁ జిత్తవృత్తి కుదురుటెట్లు?

విశో—జనకా! సార్వభౌముఁడు కోడలి ననుగ్రహింపుమని వేఁడగా అట్లేయంటివి. నీవచనము అమోఘముకదా?

అశ్వ—[కొంతవఱకాలోచించి, తనలో] సరియే. భూపతి యను తాపము బాపెడి మార్గమే ఆలోచింపుము. నా ప్రియమిత్రుని ఆర్తము దీర్పఁజాలని నామాహాత్మ్యమెందులకు? [ప్రకాశము] తనయా! నీయిష్టమే యగును లెమ్ము. సార్వభౌముఁడు మరల వచ్చువఱకును సౌధాంగణమున నుండుము రమ్ము. [అని విశోకునితో నిష్క్రమించును.

మదనసాయకము

పంచమాంకము.

స్థలము—నాగలోకము.

రంగము—అశ్వస్థుని మందిరము.

[విశోకుఁడు ప్రవేశించును.]

విశో—[విచారముతో] అకటకటా! వయస్యుఁడు ఎంతటిలో వాడి వత్తలయినాఁడు. అవును. వహ్ని లేకయే చిత్తమును దహింపఁజేసెడి భార్యావియోగ దుఃఖము ఎవరి నట్లు చేయదు? అందు తనకుఁ గూర్చెడిసతి గతించెనేని ఇఁకఁ జెప్పనేమున్నది? మదనసాయకను దలఁచుకొనుచు ఋతధ్వజుఁడు ఒడలుమఱచి ఆక్రందించుచుండ నాకనుల వెంట నశ్రుకణములు తమంతటఁదామే రాలఁజొచ్చినవి. సార్వభౌముఁడును, ప్రధానులును, పరిచారకులును దన్నెంత ప్రతిమాలినను రాచనగరు ప్రవేశింపక తొల్లి మదనసాయక విహరించెడి ప్రమదావనమున విడిసియున్నవాఁడు. గాలవముని తప్ప అన్యులెవ్వరును దనయొద్ద నుండుటకు ఇయ్యకొనలేదు. మాని యూఱడింపులచే అతనికి ఒక్కింతయైన దుఃఖోపశమనమయినట్లు కానరాదు. అతని పరిదేవన మెవరు చూడ సహింతురు? వయస్యుఁ డిట్టి

స్థితియందుండునని జనకుఁ డెఱుంగఁడా? అయ్యయ్యో! వయస్యుఁ డెన్నఁడు మరలఁ బ్రసన్నత నొందునో కదా? జనకుని కతనిపై ఎప్పుడు కరుణగల్గునో కదా? ఆహా! కళత్రనష్ట మెంతకష్ట మెంతకష్టము! పగవానికైన అట్టి కష్టము రాకుండునుగాక.

సీ. ఇంటఁబండుకొని న * ష్టేట మేల్కొనినట్లు,
లవనన గృహదీప * మాఱినట్లు
కష్టార్జితంబు దొం * గల పాలఁబడినట్లు,
లాలయోత్సంగమ్ము * కూలినట్లు
ప్రాణమిత్రుఁడు చెల్లె * నను వార్త వినినట్లు,
లఱుశరీరము దగ్ధ * మైనయట్లు
దారి మిట్టెంప ఛ * త్రము తునకలైనట్లు
గొప్ప చీఁకటి బావి * గూలినట్లు
లుండునందురు భార్యావి * యోగ మొండె
నట్టి వాని మనమ్మున * కట్లు గాన
నెవనికైనఁ గళత్ర వి * హీన వృత్తి
కంటె వేఱొండు చెప్ప దుః * ఖమ్ము గలదె?

ఈ యుదంతము జనకుని కెఱింగించి అతనిని నామిత్రుని జూచుటకుఁ బ్రయాణముచేయింతునుగాక. [అని నిష్క్రమించును.

స్థలము — సాకేతపురి.
రంగము — ప్రమదవనము.
[ఋతధ్వజుఁడు ప్రవేశించును.]

ఋత —

సురుచిర వృత్తము.

హా! నయోవిలాసినీ! అ * హా! సతీమణీ!
భావజాంగనా సమాన! * వామలోచనా!
జీవ మెట్లు వాసి తీవు * జీవితేశ్వరీ!
దైవ మయ్యె నీవు నాకు * దాయ యయ్యెఁగా.!

ఇది స్వప్నావస్థకాదా? ప్రేయసి నిజముగఁజనిపోయినదా? నన్ను శోకాబ్ధినిఁ గూలఁద్రోసినదా? ఇపుడు నేను ఎచ్చటనున్నాఁడను? కడలినడుమనా? కాదు కాదు. బడబానల మధ్యమున. అయిన నేనేల ఇంకను గతాసుఁడనుగాలేదు? [నిర్వర్ణించి] కాదు కాదు. ఇది ప్రమదవనము. మదనసాయక ప్రమదావనమిది. చెలి యింకను రాదేమి? చెలీ! మదనసాయకా! ఓహోహో! ఏమి నా భ్రాంతి! చెలి యెట్లువచ్చును? ఆమె మృతిఁబొందెనని అందఱు చెప్పుచున్నారుకదా? నన్నుఁగూర్చియేకదా ప్రాణేశ్వరి ప్రాణములు విడిచినది? నాకిది ఆజన్మాంత దుఃఖకారణముకదా? అయ్యయ్యో! గాలవుఁడెంత వెంగలి! నే నెట్లయిన ఆముద్దుగుమ్మను మఱువవలెననికదా అతనియాశయము. అది యెట్లుజరుగును? వెండియు, ఈ వసంతసమయమున ఈ ప్రమదావనవాసముచేఁ జెలి నాకుఁ దలఁపునకు రాని నిముసమేలేదు.

సీ. ఒకవంకఁ గనుపట్టు * వికచపుష్పౌఘమ్ము,
చెలియ లేనగవు నే * స్మృతికిఁ దెచ్చు;
నింకొక్క ఘోషఁదోఁచు * నిందిందిర శ్రేణి,
యొలనాఁగ తుఱుము నే * స్మృతికిఁ దెచ్చు;
వేఱొక్క చక్కఁగ * న్పించు పల్లవకోటి,
మెలఁతకైదోయి నే * స్మృతికిఁ దెచ్చు;
మఱొకచో నగపడు * మంజరీ పుంజమ్ము,
లతివ బాహువుల నే * స్మృతికిఁ దెచ్చు;
శిరసు పైకెత్తి సతికాని * స్మృతికివచ్చు;
శిరసు వంచినఁ దరళాక్షి * పెఱుఁదు లొకట
స్ఫురణ కరుదెంచు; గాన నే * కరణి నాదు
ప్రాణ నాయిక నే మఱు * వంగ నేర్తు?

పేశలాంగీ! నీ యుపవనము విడిచి యేఁగుదునా? అట్లయిన నా హృదయతాపము దీఱునేమో? ఏమనుచున్నావు? తీఱదనియా? అవును నిజమే. ముమ్మాటికి నిజమే. నే నిచటనే ఉండునుగాక. ఆహా! చెలి ఎన్నఁడైనఁ నిచ్చోటవిహరించెనా? ఆమె నవయౌవన విలసనంబుల నేనెన్నఁడైనఁ జూచితినా?

సీ. కాలందియలు ఘల్లు * ఘల్లని మ్రోయఁగా,
నసియాడఁ బూఁదోఁట * కరుగుదెంచుఁ;

జాపుఁగోపు లెసంగ * సుమముల నొకకొన్ని,
ద్రుంచి తా నలవోఁక * దుఱుము సిగను;
చనవుచేఁ దనబాహు * ఘనప్రావాలు శుకరాజ
ములఁ గవుంగిటఁ జేర్చి * ముద్దులాడు;
గండుగోయిల తన * గానమ్ము చాలించి,
వినురీతి నద్దాని * ననుకరించు;
గునియుచు నట్టున పిట్టల * గులుకు లాఁడి
పైఁట జాఱఁగ నెగిచి తాఁ * బట్టు గొన్ని;
ఇట్టి లే జవ్వనపుఁ జెయ్వు * లింక నకట!
చూడఁ బోవు నొకో నాదు * పాడు కనులు.?

[లేచుచు] ఈయమితతాపము సైఁపఁజాలను. నామనము ఉబ్బణంగినది. శరీరమున మంటలు వొడముచున్నవి. గాలవుఁడరుదెంచువఱకును ఎటకేనిఁ బోయెదఁగాక. [పరిక్రమించుచు] నెచ్చెలీ! నిన్ను వెండియుఁ జూడజాలనుగదా?

గీ. పూవుఁదోఁటను దాఁగిలి * మూఁత లాడ
నేఁకరుదు గదె? ఇపుడల్లె * యే నగమ్ము
చాటునుండియొ కులుకుచు * సరగ వచ్చి
లే నగవు తోడ ననుఁ గౌఁగి * లింప రాదె?

అయ్యో! ఇది వట్టిభ్రమ. సకి యిఁక రాదు. కట్టడి రక్కసుఁడు ఆమెను బొట్టం బెట్టుకొనెను. ఇఁక నలఁతికాలములో నేనే

ఆమెకడ కేఁగెద. [మరల బరిక్రమించుచు] ఆహాహా! ఎట్టివి స్ఫురణకు వచ్చుచున్నవి! [నిరూపించుచు]

ఉ. ఇచ్చటఁగాదె యొక్కపరి * యింతి వయస్యలఁ గూడి యేవియో
ముచ్చట లాడుకొంచుఁ గడు * ముదుల్గు గుల్కెడు పూవుటెత్తులన్
గ్రుచ్చుచు నుండు వేళ నిట * కున్ జను దెంచిన నన్నుఁ జూచి తా
నచ్చెరు వంది చంగున న * యస్యల చాటున కేఁగి నిల్చె? హా!

[వెండియుఁ బరిక్రమించుచు] ఇది శశికాంత వితర్దికదా? అయ్యయ్యో! నా కనులకిది ఎంత ఘోర ప్రదర్శనము!

ఉ. ఈ నెలరాతి తిన్నెపయి * నెన్నియొ సారులు నాకవుంగిటన్
మానుగ నొప్పి తా నిసువు * మాడ్కి మొగమ్మును నా మొగమ్ముపై
నానుచు వేడ్క నా యనున * యమ్ములకుం బ్రతి చెప్పకుండ నా
మానవతీ లలాము గరి * మమ్మున నా సరసన్ వసింపదే?

అక్కటా! ఈ యెలదోఁట నింకనేఁ గ్రుమ్మరఁజాల. ఇందెందుఁ జూచినను బైదలి స్మారక చిహ్నములే తోఁచుచు నాకు హృద్భేదన మొనర్చుచున్నవి. మగుడ యథాస్థానమున కేఁగెదను గాక. [అని యట్లొనర్చి, ఆసనము దడివి] అయ్యో! ఇది యేమి? తొలి నా తనుస్పర్శచే దీని కొదవిన వేడిమి ఇంకను బాయలేదే? నే నిచట నెట్లుపవసింపుదు? మరల ఆ చలువరాతికడ కేఁగుదునా? దానిపై గూర్చుండినచోఁ గొంత తాపము తీఱు నేమో? ఇస్సీ! తీఱదు తీఱదు. ఉపశమిల్లుటకు నాది విరహతా

పము కాదు. మరణవేదన. ఇఁక నెచటి కేఁగుదును? సరియే. ఇచ్చటనే ఈ లేఁబచ్చికపైఁ గూర్చుండెద. [అని యట్లొనర్చి] ప్రేయసీ! మదనసాయకా! నీవు లేక నేను కల్లగదా? ఇఁక నేను ఏల జీవింపవలెను? నీ యందుకు నన్ను నైళమ కొనిపొమ్ము. లేనిచో, ఈ మనోవ్యథ తీఱు మార్గమే లేదు.

ఆ. తాప మోపఁజాలఁ * దరుణి! నిక్క గవియ నా
డెంద మిప్పు డురస * డించు చుండె;
గాన నొక్కసారి * కలకంఠమున నన్నుఁ
బిలువ రాదె "రమ్ము * ప్రియ!" అటంచు?

[అంత నొక కోయిల గూయును.]

ఋత — [ఆలకించి] అదే! లలితాంగి పిలుచుచున్నది. నేను వోయెద. [మదనసాయక నుద్దేశించి] సుందరీ! ఇదే వచ్చుచున్నాఁడను వచ్చుచున్నాఁడను.

[అని యొక దెస కరుగుచుండును.

[అంత గాలవుఁడు ప్రవేశించును.]

గాల — [వానిహస్తములఁ బట్టుకొని] కుమారా! ఏమిది? ఆశ్వ సిల్లుము. ఆశ్వసిల్లుము. [అని యతనిఁ గౌఁగిలింపుచు, దనలో]

ఆ. "ఆశ్వసిల్లరాదె?" * అనుదుఁ బల్కులు వీని
నకట! కాని యెట్టు * లాశ్వ సిల్లుఁ?
గస్తి పేరిఁటి తల * గాము రాజకుమార
చంద్రు నిత్తటిని మె * సంగు చుండ?

కుమారా! నిన్ను నే విడిచి యున్నది ఒక్కనిముసము గదా? ఇంతలో నిట్లయితి వేమి?

ఋత — అయ్యో! నాప్రాణేశ్వరి నన్నుఁ బిలుచుచుండ నీవేల నన్నుఁ బోనీయవు?

గాల — [స్వగతము] నిజముగ ఇతనికి మతి చలించుచున్నది. [ప్రకాశము] కుమారా! ఊఱడిల్లుము. నీప్రాణేశ్వరి నిన్నుఁ బిలుచు టెట్లు? పక్షుల కలరవమ్ములకు అట్లు భ్రమసి యుందువు. రమ్ము రమ్ము. నీ యాసనముపైఁ గూర్చుం డుము. [అని యతని నాసీనునిఁ జేయుచు]

ఆ. సోఁకు మూఁకఁ జదిపి * లోకత్రయమును ము
దంబురాశిఁ దేల్చి * నట్టి రాజ
తనయుఁడిపుడు శోక * వనధి మునిఁగి యుండె;
దైవ నిర్ణయమ్ము * తప్పునెట్లు?

ఋత — [లేచుచు] నన్నిచటఁ గూర్చుండు మనుదువా? ఇది మదనసాయక విరిదోఁట కాదా? మమ్ము నిర్వురను నీవే కదా సతీపతుల నొనర్చితివి? మేమిపుడు కలిసియుండ వలదా? మహాసీయా! నీకును దాయనైతినా?

గాల — [స్వగతము] హా దైవమా! సుకుమారమూర్తియగు ఈ యువరాజునకు ఎంతటి యిక్కట్టు తెచ్చితివి? ఇతనిని నేనెట్లు ప్రకృతిస్థుని జేయుదును? హా తూర్యకేతుహాతకా! ప్రజ్ఞ యున్న నీయదికదా? ఆ గుహాగృహాముస కెదుట

ఋతధ్వజుండు ముందు నిన్ను సంహరింపక విడిచినందులకు ఎంతపనిం జేసితివిరా? [ప్రకాశము] కుమారా! విగతాసువైన మదనసాయకనుగూర్చి నీవు ఇంతగా విలపించుట పాడియా? నీకుం జిత్తవిభ్రమముకూడం గల్గుచున్నది. కావున నన్ను వినుము.

ఋత—నిన్నేల వినవలయు? నాజీవితేశ్వరిని స్మరింప వలదనికదా చెప్పెదువు?

గాల—వత్సా! అట్లు కాదు. ఇపుడు నీకు—

సీ. శీర్ణహృదయులం దెల్పు ప్ర * సిద్ధ గుళిక
వనట తూపుల నాంపు హృ * త్స్వర్గరాజ
మాపదాఖ్య సురభి యిదు * నట్టి క్షీర
మైన తత్త్వ పరిజ్ఞాన * మే నొసంగెద.

ఋత—[వెడ వెడ నగుచు] ఇది బాగుగనున్నది. నన్ను వెడగు ననుచున్న ఓ వెడగుమానీ! ఇది చెప్పుము.

క. నీ తత్త్వ పరిజ్ఞానము
నా తరుణీమణిని గూర్చు * నా వెండియు నా
కీ తతి? నటు కాదే నే
లా? తగులం బెట్టుకొనుట * కా? అది నాకుఁ?

నీ వేదాంతజ్ఞానము నీయొద్దనే ఉండనిమ్ము. నాకువలదు.

గాల—[తనలో] అయ్యో! కుమారుని మనస్థితి ఇపుడెంత విప

రీతముగ నున్నది? [ప్రకాశము] కుమారా! నీవు నిజముగ వెఱ్ఱిడి వగుచున్నావు. అందువలననే నామాటలు నీతల కెక్కకున్నవి.

ఋత—నిజమే. నాయథార్థస్థితిని నీవిపుడు ఎంతలెస్సగఁదెలిసికొంటివో అట్లే నీమాటలు నేనిపుడు పాటించుచున్నాఁడను.

గాల—అయ్యో! ఏమి యిట్లనియెదవు?

ఋత—నీకనుభవవేద్యము కానివిషయము నీకేమి తెలియును?

ఆ. నీవు నన్నుఁ బోలి * యౌవనాస్యంత వేని
యువతి నొల్లు వలచి * యుంటివేని
ఆమె యిచట నీకు * నై చచ్చి పడెనేని
దెలియునేమొ నాదు * స్థితి యొకింత.

గాల—కుమారా! నీవిట్లనుట ఉచితమా? నీకుం బ్రత్యుత్తర మీయంజాలను. కర్మఫలమునకు వగవంబనిలేదు. నీవు ఎట్లయిన ధైర్య మూనవలయు.

ఋత—[వానిని వినక] అప్పుడు నీవు ఏమిచేయుదువో చెప్పెదునా? [పచ్చికపై నాసీనుండగుచు]

సీ. హా! సతీ! యనుచు నవని సా * ష్టాంగ మెఱగి
అశ్రుజలముల నభిషేక * మూడఁ జేసి
తలఁచు నిట్టూర్పులనెడి చా * మరము లొసంగి
దుఃఖదేవత కీ వొన * ర్తువు సపర్య.

గాల—అయ్యో వత్సా! తుదకు నీ విట్టి డైతివేమి? నిన్నుఁ జూచిన నాకు వెఱపగుచున్నది. లెమ్ము లెమ్ము. [అని లేవఁ దీయుచు, నిర్వర్ణించి] ఎవరో యిటు వచ్చుచున్నారు.

[ఋతధ్వజుఁడు నిజాసనముపైఁ గూర్చుండును.

[అంత నొక ప్రతీహారుఁడు ప్రవేశించును.]

ప్రతీ—కుమారా! సార్వభౌముఁడు సపరివారుఁడై నిమ్ముఁ జూడ నరుదెంచుచున్నవాఁడు.

ఋత—ఉచితాసనముల నర్పింపుము.

[ప్రతీహారి యట్లొనర్చును.

[అంత శత్రుజిత్తును, అశ్వస్థుఁడును, విశోకుఁడును, రాజపరివారమును ప్రవేశింతురు. ఋతధ్వజుఁడు సతాసనుఁడై యుండును]

శత్రు—[అందఱుఁ గూర్చుండిన వెనుక] మిత్రమా! చూచితివా కుమారుఁ డెట్లు కళదప్పియున్నాఁడో!

అశ్వ—అవు నవును. విధి బలీయము.

శత్రు—[గాలవు నుద్దేశించి] మునీంద్రా! కుమారుని చిత్తవృత్తి యిపు డెట్లున్నది?

గాల—ఏమిచెప్పుదును? నాకు భయముగొల్పుచున్నది. కుమారుఁడు ఇంచుకయు స్వస్థచిత్తుఁడు కాలేదు.

శత్రు—[విచారముతో] అయో! ఇఁక నేమిదారి? [ఋతధ్వజుని దఱిసి బుజ్జగించుచు] పుత్రా! సమాశ్వసిల్లుము సమాశ్వసిల్లుము. నీవిట్లు సర్వభోగ విముఖుఁడవై అప్రా

జ్ఞునివలె అహోరాత్రములు ఒక తరుణికై పరితపింప నగునా? ఊఱడిల్లుము. [నిరూపించుచు] వీఁడె నీమిత్రుఁడు విశోకుఁడు నిన్నుఁ జూడవచ్చినాఁడు. వానితో సంభాషింపుము. మఱియు, ఈమహానీయుని గనుము. నీస్నేహితుని తండ్రి. నాకుఁ బ్రాణసఖుఁడు.

ఋత—జనకా! మీరందఱు నన్నుఁ బరామరిసించుట కేల రావలయును? మదనసాయక లేక నాకీలోకము * శూన్యము కదా?

శత్రు—తనయా! నీవిట్లనకుము.

గీ. దైవ నిర్దిష్టమైన కృ * త్యమ్ము జరిగి
తీఱఁగవ పుత్ర! విను నీకుఁ * త్రిభువనైక
మోహినులఁ దెచ్చి చేతు ను * ద్వాహ మిపుడు:
గొడ్డువోయెనె జగతి యా * కోమలితోడ?

ఋత—జనకా! నీవు భ్రమపడుచున్నావు.

గీ. లాఁతి సైఁపలు లెంతటి * లేఁత వయసు
వారలైన నెంతటి రూప * వతులునైన
నెంత గుణవతులైన నా * యింతి సాటి
కారు; పోలరు పతి కాలి * గోరికైన.

అశ్వ—[స్వగతము] ఔరా! ఈరాజతనయున కాసుందరిపై ఎంతమక్కువ! [ప్రకాశము] రాజనందనా! ఏమియిట్లుందువు?

గీ. మంటిపాలైన నతి యెటు * వంటిదైన
వనరుహేక్షణ నామె వెండియు * వచ్చునయ్య?
కాన ప్రాజ్ఞుడవై ధైర్య * మూనుటొప్పు;
చెలిని స్మరియింప వనము బ్ర * హ్మాలము కాము.

ఇంతియకాక,

గీ. ధరణి స్వామిన కేక పు * త్రకుడ వంట;
పండితుడవ వంట; ఎనలేని * బంట వంట;
ఈ విపత్తును సైరింప * వేని పల్లి
చంద్రులది కాదె వెత? దొర * తనము చెడదె?

ఋత—మహనీయా! నాప్రేయసి నాకై చనిపోయినది. ఆమెను మఱచుట దుస్సాధ్యము. ఆమె నగుమొగము నొకసారి కనినగాని నామనస్తాపము తీఱదు.

శత్రు—అయ్యో! కుమారుని వెడగుదనము! ఇంక నేనేమిచేయుదును? కుమారు డెట్లు సమాహితుడగును?

గాల—మానవేశ్వరా! మదనసాయక రూప పటమునైనను సంగ్రహింపవైతివి. దానినిగనియైన గుమారుడు ఒకించుక ఊఱట చెందునేమో?

ఋత—మందభాగ్యుడను. నాకు అట్టిపున్నెమైన నిపుడేల చేకుఱును?

శత్రు—కుమారా! అట్లనకుము. నేనే మందభాగ్యుడను. నేనే అపరాధిని.

అశ్వ—అట్లయిన వినుము. [శత్రుజిత్తు నుద్దేశించి] మిత్రమా! నాడు నే నిచటికి వచ్చినప్పుడు శిల్పియొకడు నాతో వచ్చియుండెను. అతడిపుడు తన విద్యానైపుణి దేటంబడునట్లు మదనసాయకా విగ్రహమొండు రచించియున్నాడు. అది యిపుడు నామందిరమున నున్నది. నాకుమారుడు దానిని యువరాజున కర్పించుటకే నిశ్చయించియున్నాడు. యువరాజు సమ్మతించెనేని అతనిని నావెంటగొనిపోయి దానిని గనబఱచెదను.

ఋత—[ఆసనము నుండి దిగ్గనలేచి] మహనీయా! ఇదే వచ్చుచున్నాడను. నీకు గృతజ్ఞుడను. నాప్రాణేశ్వరిని ఏరూపమునైన నొక్కసారి చూచెదను గాక.

గాల—[ఋతధ్వజుని హస్తములు పట్టుకొని] కుమారా! ఏల ఆత్రపడెదవు? నీవిట్టిస్థితిలో ఎట్లు ప్రయాణముసేయగలవు?

ఋత—నాబహిఃప్రాణమైన మదనసాయకను జూడబోవుట నాకేమి కష్టము? నీవు నన్ను ఆటంక పెట్టవలదు.

శత్రు—[ఋతధ్వజునితో] కుమారా! తాళుము. [అశ్వస్థునితో] సుహృద్రత్నమా! మిగుల నసిచెడియున్న కుమారుని ఇపుడు పయనమొనర్చుట నాకిష్టములేదు. ఆవిగ్రహమును ఇచటికే రప్పింపగోరెదను.

అశ్వ—అది నూతనముగ నిర్మింపబడినది. దాని రంగు లింకను ఆఱుటయే లేదు. కావుననే మేము దానిని దోడ్కొనిరాలేదు.

శత్రు—అయిన మేమందఱము గుమారునితో వచ్చెదము.

అశ్వ—అంతటి భాగ్యము నాకబ్బునా? అప్పుడుకదా నామందిరము పవిత్ర మగును?

శత్రు—[ప్రతీహారి నుద్దేశించి] ఓరీ ప్రతీహారీ! నీవు వైళమ పోయి ప్రధాన మంత్రితో మాప్రయాణ సమాచారము చెప్పి వాహనముల సిద్ధపఱుపు మనుము.

ప్రతీ—మహాప్రసాదము. [నిష్క్రమించును.

శత్రు—[తనయు నుద్దేశించి] కుమారా! రమ్ము. మన మింకఁ బ్రయాణ సన్నద్ధుల మగుదము. [లేచుచు నితరుల నుద్దేశించి] మనమందఱము నగరులోని కేఁగుదము. రండు.

[అందఱు నిష్క్రమింతురు.

స్థలము—నాగలోకము.

రంగము—అశ్వస్థుని మందిరము.

[మదనసాయక ప్రతిమ ప్రోల అశ్వస్థుఁడు ప్రవేశించును.]

అశ్వ—మదనసాయక ప్రతిమ యయ్యెఁగదా! అద్దిరా నావశ్య విద్యా ప్రభావము! ఇఁక భర్తృదారకుఁడు ప్రాయోపవేశ మొనర్చునా? ఔరా! నేఁడునాకు ఎట్టి సుదినము! నేఁడు నాకు ఎంతటి సంతోషమబ్బును!

[అంత విశోకుఁడు ప్రవేశించును]

విశో—జనకా! సార్వభౌముని యొక్కయుఁ, బరివారముయొక్క

యు, వాహనములు మన మందిరమును సమీపించు చున్నవి. వారిని మన మిపుడు యథోచితముగా సంభావింప వలయునుగదా?

అశ్వ—అప్పుడే వచ్చుచున్నారా? [ప్రతిమపై యవనిక దీర్చి] రమ్ము. వారి నెదుర్కొందము. [అనుచు నర్థోక్తిలో] కాని విశోకా! నీవు ఇచటనేయుండి ఉచితాసనముల నేర్పఱుపుము. నేను బోయి వారిని దోడ్కొనివచ్చెదను.

[అశ్వస్థుఁడు నిష్క్రమించును. విశోకుఁడు ఆసనములఁ దీర్చును.

[అంత శత్రుజిత్తును, ఋతధ్వజుఁడును, గాలవుఁడును, అశ్వస్థుఁడును, రాజ పరివారమును బ్రవేశింతురు.]

శత్రు—మిత్రమా! అశ్వస్థా! అదేమియోకాని నేఁడు నామనము నిర్వృతిఁజెందుచున్నది. ఇది నీమందిర మాహాత్మ్యమో లేక నీ సమాదరణమాహాత్మ్యమో?

అశ్వ—వయస్యా! నీ విట్లనరాదు. నీయట్టి సర్వంసహాధినాథుఁడు నాగృహమున కేతెంచుట తొలిబాముున నే నొనర్చిన నోములు ఒక్కటఁ బండినట్లుకదా? నాపుట్టువు సార్థకమైనట్లు కదా? [నిరూపించుచు] సార్వభౌముఁడు ఈ యాసనము నధిష్ఠింపనగును. కుమారునకును, మునివరునకును, ఇవే యాసనములు. రాజపరివారము ఆయాఆసనములపై నాసీనులగుదురు గాక.

శత్రు—మిత్రమా! నీకు శ్రమయిచ్చుటకే మేమందఱము వచ్చితిమి. కూర్చుండుటకేమి? మేమిపుడు మదనసాయకా

విగ్రహమును జూచుటకుఁగదా వచ్చితిమి? నీమందిరమునం దున్నవిచిత్రములఁ బెక్కింటిఁ గనితిమి కాని అదియెందును గానరాలేదు. దానింగనుటకై కుమారుఁడు ఉవ్విళ్లూరుచున్నవాఁడుగదా?

అశ్వ—సఖా! నీకోడలి విగ్రహమును రచించిన శిల్పకారుని పని నేర్పు వర్ణింప నలవికాదు. దానినిఁ జూచిన వారెల్లరు జీవప్రతిమయని భ్రమపడుచున్నారు. అందువలనఁ దక్కిన విచిత్రములవలె దాని నుంచలేదు. నీవుకూడ అట్టి పనివానితనము ఇంతకు మున్నెన్నఁడును జూచియుండవు. అది యిచటనేయున్నది. మీరందఱు గనవచ్చును. విచ్చేయుఁడు.

[అని తెరయెత్తి మదనసాయకను జూపును. అందఱు చూచి నిశ్చేష్టులగుదురు.

చూచితివా నీకోడలిని? [ప్రత్యుత్తర మీకుండుట గని] ఓహో! మీరందఱు నివ్వెఱపడియున్నవారు. విగ్రహసౌష్ఠవము మీమనముల నాకర్షించిన దనుకొనియెద. అట్లైన మేలే. [ఋతధ్వజు నుద్దేశించి] కుమారా! నీప్రియురాలి ఆకృతి యిందొప్పుచున్నదా?

ఋత—[కనికని]

క. ఇదె నా సతి! ఇదె నా సతి!
ఇదె నిజముగ నాదు జీవి * తేశ్వరి! [మద. నుద్దేశించి] తరుణీ!
బ్రదికితి బ్రదికితి; నిన్నేఁ
గదియించెదఁ; దాపమోపఁ; * గనుము కను మిదే.

[అని యామెను గౌఁగిలింపఁబోవును.

గాల—అయో! రాజసూనుని పామరత్వము!

అశ్వ—[ఋతధ్వజుని నాఁపుచు] రాకుమారా! తాళుము తాళుము. ఇది మదనసాయక ప్రతినిధికాని మదనసాయక కాదు. ఇంతకును విగ్రహము అతినూతనముగ స్థాపింపఁబడినది. నీ విపుడు దాని నంటుదువేని రంగులు చెడిపోవును.

ఋత—[విచారముతో] అయో! నేను మోసపోయితినా? ఈమె నాహృదయేశ్వరి కాదా? హా హా!

[అని ఒక యాసనముపైఁ గూలును.

గాల—[వానిని బుజ్జగించుచు] కుమారా! ఆశ్వాసిల్లుము. నీవు మరలఁ బ్రాంతిదారిని త్రొక్కెదవా? లెమ్ము. ఏలిక నిలువఁబడియున్నాఁడు. [అని లేవదీయును.

శత్రు—[కొంతవడికి] మదనసాయక! సజీవ! హా! ఇదివిభ్రమమా! [గాలవు నుద్దేశించి] మునిపుంగవా! మదనసాయక యిట్లే కదా ఉండును? ఔరా! ఏమి యా శిల్పకారుని బుద్ధి కౌశలత!

క. నలువయె తన టంకములోఁ
పల నెలకొని యుండవలయుఁ * బ్రతిమ నిటులు తా
మలుచుటకు; గాని యెవ్వని
కలవి యిటు సజీవ మాన * వాకృతిఁ దేరన్?

అయ్యో! ఇట్టిసౌందర్యవతియగుకోడలు నాకేలదక్కును?

గాల—ఇట్టి అద్భుత శిల్పచాతుర్యము ఇంతకు ముందెన్నఁడును గనివినియెఱుఁగను. ఔరా! నరునికి ఎయ్యదియసాధ్యము?

ఋత—మహానీయా! నీవు ఆ శిల్పిచే నాప్రాణేశ్వరి ప్రతిమకు ఏల ప్రాణము పోయించినావుకావు? నేనిట్లు పరితపింప వలెననియా?

అశ్వ—కుమారా! మదనసాయక కృతిచే మీయిర్వురిమనమ్ములును మున్నే సంక్షోభించుచున్నవి. ఇప్పు డామె విగ్రహమును గనిన ఒక్కింతయైన నూఱటజెందుదునుకొంటిని. కాని మీరు వెండియు నిట్లగుదురనియెఱుంగను. కాఁబట్టి మీయనుమతిని యవనిక నవరించెద.

[అని యట్లు చేయఁబోవును.

ఋత—[వారింపుచు] అయ్యో వలదు వలదు. నేనిఁక విలపింపను. నాప్రేయసిని గనుచు నేను ఇట్లే ఊరక నిలువఁబడి యుండెద.

అశ్వ—కుమారా! చూపఱకు ఇది చేతనప్రతిమ యను భ్రమ గొల్పునని అప్పుడే చెప్పియుంటినిగదా? అట్లే మీరును మోసపోవుచున్నారు. మీరింకను గనుచుందురేని ఇది కదలుచున్నదని కూడ అనుకొందురు. మరలఁ జూతురు లెండు. [అని తెర దీర్చఁబోవును.

శత్రు—[వారింపుచు] మిత్రమా! ఉండుముండుము. మేమెన్నఁడును అట్లూహింపము. ఈమనోహర విగ్రహమును

ఎంత చూచినను దనివి దీఱకున్నది. [గాలవు నుద్దేశించి] యతివర్యా! చూడుము చూడుము.

క. హా! యేమిఁ యింత! చూపిన
దీయువిదె యీరీతి నే ప్రతిమ యైనది? గం-
ధోయుతము జీవకళల నెసఁ
గాయవు; మఱియందుఁ జపల * భావము దోఁచున్.

గాల—రాజేంద్రా! అకల్పిత భ్రాంతి నొదవించినప్పుడుకదా కళవన్నె కెక్కును? నిక్కముగ ఇది విశ్వకర్మ నిర్మితమని తోఁచెడిని. లేనిచో దీని యందు సజీవత్వము ఎట్లుపొడమును?

శత్రు—మఱియు ఆహా స్తములది సహజారుణిమ కాదా?

అశ్వ—ఇఁక నేను తెర సరిదీయుటయే మేలు. నామిత్రుఁడిపుడు భ్రాంతి వివశుఁడై మైమఱచి యున్నవాఁడు. ఈ విగ్రహము జీవముతో నున్నదని కూడ ఇఁక ననవచ్చును.

[అని అట్లు చేయఁబోవును.

ఋత—అయ్యో! వలదు వలదు. నిన్ను బతిమాలెదను. నీవట్లు చేయుదువేని నేఁడే నాప్రియురాలు చనిపోయినట్లు నా మదికిఁ దోఁచును. కావునఁ దెర అట్లే యుండనిమ్ము.

అశ్వ—రాజనందనా! నీ మనస్సునకు హాయిని గూర్చుటకు బదులు ఈ విగ్రహమును జూపుచు నిన్నిపుడు కారింపుచుంటినిగదా? నిన్ను ఇంకను గారింపుమందువా?

ఋత—నీవు ఏమిచేసినను సరియేకాని నాప్రేయసిని మాటుపఱుపకుము. నన్నా అనుపమాంగి సౌందర్యలహరిలోఁ దనివి దీఱఁదోఁగనిమ్ము.

అశ్వ—అయిన నీయిష్టము. [అని కొంతవడి యూఁగి, శత్రుజిత్తు నుద్దేశించి] మిత్రమా! నీవును, నీకుమారుఁడును ఇపుడెల్లను విచారసాగరమున మునింగి యున్నవారుకదా? మిమ్ము నిఁక విస్మయాబ్ధిని దేల్చెదఁ జూతురా?

శత్రు—నీమందిరమున అన్నియును మాకు విస్మయమునే కొల్పుచున్నవి. నీది మాయలప్రోలుగదా! నీ యిచ్చవచ్చినట్లొనర్పుము.

అశ్వ—అయిన వినుఁడు. మీరందఱు తేఁటవమ్మైఁ జూడఁగల్గితిరేని నేనిపుడు ఈవిగ్రహమును గదలునట్లు చేసెదను. అది అల్లన దిగివచ్చి ఋతధ్వజుని కరగ్రహణ మొనర్చి అతనిని గౌఁగిలించును. కాని మీరెవ్వరును వెఱఁగందఁగూడదు.

శత్రు—నీవు ఆమెచే నేమి పనులుచేయించినను అవి యట్లే చూచుచుందుము. ఆమె ఏమిమాటలాడినను అవి యట్లే వినుచుందుము. కాని మాకెవ్వరికిని భయములేదు. కానిమ్ము.

అశ్వ—అట్లయిన సరియే. మీరందఱును అట్లే నిలువఁబడి యుండుఁడు. కాని పిఱికిగుండె గలవారు ఇప్పుడే బయిటికిఁ బోవచ్చును.

శత్రు—కానిమ్ము కానిమ్ము.ఎవరును గదలఁ గూడదు.

అశ్వ—ఏదీకొంచెము సంగీతము?

[తెరలో సంగీతము వినఁబడును.

అశ్వ—[విగ్రహము నుద్దేశించి]

సీ. తరుణి! నీ కొఱకు సం * తాప మొందుచు నీ ప్రి,
యుఁడు పేఁడె నినుఁ గోరి * యున్నవాఁడు
ఎవరి వాఁడవు నీవు * శ్వాసింపవైతేఁడె చాల,
కన్నులఁ జేడె నినుఁ జూచు * చున్నవాఁడు
వాఁడు నీకు శుభవాక్కు * నర్పిన మౌనిక,
న్యాయపతం డేడె నీ ప్రోల * నున్న వాఁడు
నీ మనోహరమూర్తి * నీ సంబు నాపట్టి
యును పేఁడె పతునట్లె * యున్నవాఁడు.
లీలఁ గట్టువట్టి పసిఁ గౌఁగి * లింపుమమ్మ!
నృపతి కీ యతఁడ నమస్క * రింపుమమ్మ!
సిగుము; తలఁడియయ్యో; విడనాఁడు * మిఁగను లాతి
రూపు; రారమ్మ; వెఱఁగొల్పు * మా పలుగను.

చూచితిరా ఆమె మొదలుచున్నది.

[మదనసాయక పట్టమము దిగ క్రిందికి వచ్చును. అందఱు నదిరి పాటుసూచింతురు.]

ఏల మీరదిరి పడెదరు? ఆమె మిమ్ము నేమియుఁ జేయదు. [స్మితముతో] అయ్యో! మీరామెను దొలఁగిపోకుఁడు. [ఋత

ధ్వజు నుద్దేశించి] కుమారా! నీవును జంకుచున్నావేమి? అపుడు నీవు ఆమెపైఁ బడి కౌఁగిలింపఁ బూనితివే? నీహస్తము ఆమెకిమ్ము. తొల్లి గాలవాశ్రమమున మీకు గాంధర్వమయ్యెనుగదా? ఇపుడు నామందిరమున మరల మీకు గాంధర్వము.

[ఋతధ్వజుఁడు హస్తమొసఁగును. మదనసాయక దానింగొని, "హా ప్రాణేశ్వరా!" అంచు నతనినిఁ గౌఁగిలించును.]

ఋత—[ఆశ్చర్యముతో] ఓహో! ఈమె సజీవ! మదనసాయక! నాహృదయేశ్వరి! [మదనసాయక నుద్దేశించి] హా! జీవితేశ్వరి!

[అని రెండవమాఱుఁ గౌఁగిలించును.

శత్రు—ఏమిచిత్రము! కుమారునిఁ గౌఁగిలింపుచున్నదే!

గాల—"ప్రాణేశ్వరా!" అనికూడ అనుచున్నది. ఇదియేమో యింద్రజాలమువలె నున్నది.

శత్రు—[అశ్వస్థు నుద్దేశించి] మిత్రమా! ఇదియేమి? నిజమా విభ్రాంతియా? ఈమె మదనసాయకయేనా? యువరాజపత్నియేనా? ఈమె ఎట్లు బ్రతికినది? నీమందిరమున ఎట్లున్నది. ఈ యభ్యుదయము నేఁడు మాకు ఎట్లు కలిగినది?

అశ్వ—మిత్రమా! ఏమిచెప్పుదును? నాపట్టణమున మీపూర్వులు ప్రతిష్ఠించిన చండికాలయమునకు రాజకుటుంబమున జరుగనున్న వివాహకార్యములకు ముందుగ వధూవరులు వచ్చి దేవిని దర్శించుటయు, నామందిరమునఁ బ్రారంభో

త్సవము జరుగుటయు, నీవంశమందు అనుశ్రుతాచారమై యున్నది కదా? ఆయాచారము ఇపుడు నీవు తప్పుటచే కల్గిన అనర్థమేయిది. మదనసాయక అకాలమరణమునకుఁ గారణము నేను దివ్యదృష్టి నరయఁగాఁ దదాచార ప్రతిరోధమువలనఁ జండికకుఁ గల్గిన ఆగ్రహమే యని తేలినది. అపుడు నేను ఆదేవి నారాధింపఁగా ఆమె ప్రసన్నయై తనకు సపర్యచేయుచు దివ్యరూపమునఁ దనచెంత నున్న ఈమదనసాయకను నాకుఁ గనఁబఱచినది. ఈమెను మరల మనుష్యరూపమున నాకుఁ బ్రసాదింపుమని నేనామెను ఎన్నియోవిధములఁ బ్రార్థించితిని. తుదకు ఆదేవి నాయెడఁ గరుణించి మదనసాయకను బ్రసాదింప నియ్యకొనెనుగాని తన్ను ఏరూపమున నిచటఁ బ్రతిష్ఠించి యిపు డొప్పరికించిరో అట్టిరూపముననే తొలి మీకుఁజూపి చేసిన తప్పిదమునకుఁ జాలినంత మనోవ్యథ మీకుఁగలిగినపైని ఆమెను బ్రబోధించి మీకిడవలయునని నాకానతిచ్చి తాను అంతర్హితయయ్యె. ఇదియే మిమ్మునిచటికి ఈరీతిని నేను రావించుటకుఁ గారణము. ఇందువలననే మిమ్మునందఱను ఇంతవఱకు శోకసంతప్తులుగ నుంచవలసివచ్చినది. వయస్యుఁడు నన్ను మన్నించునుగాక.

శత్రు—[అతని హస్తములు పట్టుకొని] అయ్యయ్యో! మిత్రమా! ఏమియిట్లందువు? నేనే మహాపరాధిని. అనుశ్రుతాచారమును నేనెన్నఁడైన మఱవవచ్చునా? అట్టిస్థితిలో నీవు

నాకు జ్ఞప్తికిఁ దెచ్చినను నేను ఉపేక్షించితిని గదా? ఇట్టి మందబుద్ధి శిక్షార్హుఁడు; కానిచో క్షంతవ్యుఁడు. కానిక్షమింపువాఁడెన్నఁడును గాఁడు. ఇంతియకాక ఆఁకలిగొన్న వారికి అమృతాన్నము సంతరించిన విధమున అమితశోకార్తుల మగు మాకిపుడు అమితానందము గూర్చితివి. నీ ఋణ మెట్లు తీర్పఁగలను?

అశ్వ—మిత్రమా! నీ పురోభివృద్ధియే నేను ఎల్లప్పుడుఁ గోరువాఁడను. దీనికేమి? సర్వవిధముల నేఁడు మనకు శుభదినము. కావున నేఁడే బిడ్డ లిర్వురును నా మందిరమున వధూవరులగుటయు, మనమందఱము యథోచితము చండికను దర్శించుటయు, జరుపుదము గాక.

శత్రు—మిత్రునియాజ్ఞ. ఇవియే కర్తవ్యములు. అయ్యో! దేవిని గూడ దోడ్కొని రానైతిని!

[అంత నొక సాశ్వికుఁడు ప్రవేశించును.]

ఆశ్వి—[కేలుమోడ్చి] మానవేశ్వరా! దేవిగారు ఏలిక కిట్లని వేదింపుమనిరి. "యువరాజ పత్ని మదనసాయక ధాత్రేయియు, ఆమె తల్లి దండ్రులును వివాహోత్సవమునకు వచ్చుచుండ దమకుమారె చనిపోయినదను సమాచారము మార్గమునవిని తమ తమ అరదములలో బిట్టు మూర్ఛవడి యున్నవారఁట." ఈ యుదంతము వారి పరివారము వలనఁ దెలిసి కర్తవ్య మేమియుఁ దోఁచక దేవర సన్నిధికి నన్ను హుటాహుటిగఁ బుత్తెంచినారు.

శత్రు—అయ్యయ్యో! [ఆశ్వికు నుద్దేశించి] ఓరీ! నీవు మరల సత్వరముగఁ బోయి యువరాజ పత్ని పునర్జీవిత అయ్యెననియు, ఆమెను దోడ్కొని మేము శీఘ్రముగానే వచ్చుచున్నామనియు, దేవితోఁ జెప్పుము. విశ్వావసు ప్రభృతుల నెదుర్కొని వారల కీయుదంతము చెప్పి తోడ్కొని వచ్చి మాసౌధమున వారిని యథోచితము సత్కరింప వలయునని ముఖ్య మంత్రితోఁ జెప్పుము. పొమ్ము పొమ్ము.

ఆశ్వి—మహాప్రసాదము. [అని నిష్క్రమించును.

శత్రు—ఇప్పుడు స్ఫురణకు వచ్చినది. [అశ్వస్థు నుద్దేశించి] మిత్రమా! కుమారుని వివాహమునకు ఇఁక రెండు దినములే గడువున్నది. కావున అతి శీఘ్రగమనముతోఁ బ్రయాణమొనర్పవలయు. మీరందఱు మాతోడనే తరలి రావలయును.

అశ్వ—వయస్యుని యాజ్ఞ. అట్లే వచ్చెదము. [విశోకుని నుద్దేశించి] విశోకా! నేఁడు మన ప్రయాణమునకై వాహనములసిద్ధపఱుపుమని అశ్వపాలకునితోఁ జెప్పి వైళంబరమ్ము.

[విశోకుఁడు నిష్క్రమించును.

శత్రు—నేఁడిట్టి మంగళము మాకొనఁగూర్చిన మదీయప్రాణసఖుఁడగు ఈమహానుభావునకుఁ గుమారుఁడును గోడలును, మాకనుల వేడుకగా ఒకసారి ప్రణమిల్లఁగోరెద.

ఋత } —మహాప్రసాదము.
మద }

[అని యట్లొనరింతురు.

అశ్వ—బిడ్డలకుఁ గళ్యాణ పరంపరలు ఈశ్వరుఁడు ప్రసాదించును గాక! లెండు. బిడ్డలారా! లెండు. [వారు లేచిన వెనుక, మదనసాయక నుద్దేశించి] పుత్రీ! ఆర్యపుత్రుని ఎపుడు చూతునని తపించుచుంటివిగదా? ఇప్పుడు చూచితివా? [మదనసాయక తలవంచును. పిదప ఋతధ్వజునిలాలింపుచు] కుమారా! నీ మనస్తాపము దీఱినదా? నిన్ను మిగులఁ గారించితిని జుమా?

శత్రు—సఖా! ఏమియిట్లనెదవు? నీ కతమ్మున నేఁడు గదా మాకు సకలాభ్యుదయములును జేకూరినవి? ఇఁకఁ గుమారుని వివాహమునకై మన మందఱము గలసి శీఘ్రముగ బయలు వెడలితిమేని మా అభ్యుదయములు పూర్తి యగును.

[అంత విశోకుఁడు మరలఁ బ్రవేశించును.]

విశో—(అశ్వఘ్నునితో) జనకా! చెప్పివచ్చితిని. సార్వభౌముని వాహనములును, మన వాహనములును అప్పుడే ప్రయాణ సన్నద్ధము లగుచున్నవి.

శత్రు—సరియే. నేఁటి సాయాహ్నమే మన ప్రయాణము. మన మిఁకఁ గర్తవ్యమరయుదము. (ఋతధ్వజు నుద్దేశించి) కుమారా! మనకిఁక వాంఛనీయము ఏమైన నున్నదా?

ఋత—ఏమియులేదు. కాని యిట్లగునటు లానతిండు.

ఉత్సాహము

దేశ విప్లవముల నీ పృ * థివి యెఱుంగ కుండుతన్
దేశ పుంబరి శ్రమము ల * తి ప్రశస్తి గాంచుతన్
దేశ భక్తి లహరు లెల్ల * దేశములను బాఱుతన్
దేశ మున జనమ్ము పాడి * తెరువు ననుగ మించుతన్
దేశ మెపుడుఁ బాడి పంటఁ * దేలు చుండుతన్; కృతుల్
దేశ కాల సమనుకూల * దివ్య కవిత నెసఁగుతన్
దేశ విహిత కార్యకరణ * దీక్ష తనయు లూనుటన్
దేశ మాత ఋణము లెస్స * దీఱుఁగాత! మఙ్గళమ్!

శత్రు—తథాస్తు!

[అందఱు నిష్క్రమింతురు.

సమాప్తము.

END OF
TITLE